సాహితీ గత సాహిత్యంపై విహంగం
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

విజయవాడ

: fb.com/vaartha Digital

Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

24-6-2025 మంగళవారం సంపుటి: 31 సంచిక: 143 పేజీలు: 10+4 వెల: 6.50

## లక్ష్యాలకు చేరువలో ఉన్నాం: నెతన్యాహు

5లో

## సిరియా చర్చిలో ఆత్మాహుతి దాడి: 24 మంది మృతి

# విధ్వంసం నుంచి వికాసం వైపు



సోమవారం అమరావతిలో జరిగిన సుపరిపాలన తొలి అడుగు సమావేశాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న సిఎం చంద్రబాబు. చిత్రంలో డి.సిఎం పవన్, మంత్రి లోకేష్, బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి తదితరులు

## ఇబ్బందులున్నా యేడాదిలో ముందుకు

### అన్ని ప్రాంతాలు సమతుల్యంగా అభివృద్ధి

### 31 పాలసీలు ఆచరణలోకి

### సూపర్ సిక్స్ వాగ్దానాలు క్రమంగా అమలు

### సుపరిపాలన, తొలి అడుగు కార్యక్రమంలో పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించిన సిఎం చంద్రబాబు

**విజయవాడ,జూలై23.ప్రభాతవార్తప్రతినిధి:** ఎన్నో ఇబ్బందులు పడి రాష్ట్రంలో అభివృద్ధి ఏడాది కాలంలో బాటలు వేసామని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు.పేదరిక నిర్మూలన దిశలో అడుగులు ముందుకు వేస్తున్నామన్నారు. కృతిమ మేథ(ఎఐ)ని ప్రోత్సహిస్తున్నామన్నారు,అమరావతిలో క్వాంటంవ్యాలీతో పాటు అనేక ఆధునీకంశాలు అందుబాటులోకి తీసుకుని వస్తున్నామన్నారు. అన్ని ప్రాంతాలను సమతుల్యం చేస్తూ ఉపాధి,ఉద్యోగ అవకాశాలను కల్పించే దిశలో పెట్టుబడులను ఆహ్వానిస్తున్నామన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు పేరిట యేడాది పాలనపై ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన ఏపీ సచివాలయం పక్కన విస్తృత సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి చంద్రబాబు, పవన్ కళ్యాణ్, పురందేశ్వరి, లోకేష్ ,ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సీఎస్, ఉన్నతాధికారులు, హెచ్ఓడీలు, జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు.సదస్సుకు హాజరైన వివిధ కార్పోరేషన్ల ఛైర్మన్లు, డైరెక్టర్లు హాజరయ్యారు.వారందరితో ఏడాది పాలనపై చంద్రబాబు సమీక్షించారు.సాధించిన అభివృద్ధిని భవిష్యత్తులో చేపట్టబోయే అభివృద్ధిని ఆయన పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఏడాది కాలంలో 31 పాలసీలు అమల్లోకి తీసుకొచ్చామని గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిన 82 పథకాలను తిరిగి పునరుద్ధరించామని సీఎం తెలిపారు. ఆర్థిక పరిస్థితి మెరుగు పరిచేందుకు ఎన్ని మార్గాలు ఉంటే అన్ని మార్గాలు అన్వేషిస్తున్నామని మిగిలిన సమస్యలను అధిగమించేలా కార్యాచరణ అమలు చేసుకుందామని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భంలోనే చెప్పామన్నారు. రాష్ట్రాన్ని విధ్వంసం నుంచి వికాసంవైపునకు తీసుకుని వెళ్తామన్నారు. ఏడాదిలో అన్నివ్యవస్థలుగాడిలో పెట్టామన్నారు. సంపదను >>2

## రౌడీయిజం చేస్తే తాటతీస్తాం


### మాది మంచి ప్రభుత్వమేకానీ మెతకదనం లేదు: డి.సిఎం పవన్

**విజయవాడ,జూన్23,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో సమర్ధవంతమైన,సంస్కాయుతమైన ప్రభుత్వం అధికారంలో ఉందని రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో ఏడాది కాలంలో రాష్ట్రంలో ఎంతో అభివృద్ధిని సాధించిందన్నారు.రాష్ట్రాన్ని ఆయన ఎంతో పట్టుదలతో అభివృద్ధి దిశలో ముందుకు తీసుకుని వెళ్తున్నారన్నారు.రాజ్యాంగాన్ని,గౌరవిస్తూ ఒక నిబద్ధత్తో ప్రభుత్వం అడుగులు ముందుకు వేస్తుందన్నారు.పనిచేసే తమ ప్రభుత్వాన్ని మెతక ప్రభుత్వం అనుకోవద్దన్నారు. తమది మంచి ప్రభుత్వం శాంతి భద్రతలకు భంగం కలిగిస్తూ, వికృత చేష్టలతో విధ్వంసాన్ని సృష్టించాలనుకునే వారు ఒక్కటే గుర్తుంచుకోవాలి.ప్రభుత్వానికి, >>2

## పరుగులు పెడుతున్న డబులింజన్ సర్కార్

### గత ప్రభుత్వం ఐదేళ్లలో సాధించలేనిది యేడాదిలో చేసి చూపించాం: మంత్రి లోకేష్

**విజయవాడ,జూన్23,ప్రభాతవార్తప్రతినిధి:** సుపరిపాలనలో తొలి అడుగు వేశామని విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు. పాలనలో ప్రభుత్వ ఉద్యోగస్తుల సహకారం ఎంతో అవసరమని చెప్పారు. ప్రభుత్వ అధికారులు కూడా ప్రజలకు మరింత దగ్గర అవ్వాలని సూచించారు. చాలా సమస్యలతో ప్రజలు అధికారుల దగ్గరకు వస్తారని వారిని ఆప్యాయంగా పలకరించి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని చెప్పారు. ఉద్యోగస్థులు తలుచుకుంటే స్వర్ణాంధ్ర ఖచ్చితంగా సాధ్యం అవుతుందని అన్నారు. సచివాలయం వెనుక >>2



## ప్రతీకార జ్వాలలు

### అమెరికా ఎయిర్‌బేస్‌పై ఇరాన్

# క్షిపణి దాడులు

### వెంటనే గగనతలం మూసివేసిన ఖతార్

### గల్ఫ్‌లోని యుఎస్ స్థావరాలను లక్ష్యం చేసుకొన్న టెహ్రాన్

### వార్ రూమ్‌లో చీఫ్‌లతో భేటీ అయిన ట్రంప్

### దాడులతో అట్టుడుకుతున్న పశ్చిమాసియా



**దోహా,జూన్ 23:** ఇరాన్‌పై నేరుగా దాడులుచేసి అణుస్థావరాలను ధ్వంసంచేసిన అమెరికాకు గుణపాఠం చెపుతామని, ప్రతీకారం తీర్చుకుంటామని ప్రకటించిన ఇరాన్ అనుకున్నట్లే అమెరికా స్థావరాలపై దాడులుప్రారంభించింది. పశ్చిమాసియాలోని అమెరికా వైమానిక, నౌకాయాన, సైనిక స్థావరాలన్నింటినీ ధ్వంసంచేస్తామని ప్రకటించిన కొద్ది గంటలకే ఈ దాడులు జరిగాయి. ప్రస్తుతం గల్ఫ్‌లోని ఖతార్‌లో ఉన్న వైమానిక బేస్‌లపై ఇరాన్ ఐఆర్‌జిసి ఏడు క్షిపణులు ప్రయోగించిందని తేలింది. ఖతార్‌లో ఉన్న అల్ ఉదీద్ ఎయిర్‌బేస్‌ను ఇరాన్ టార్గెట్‌చేసింది. దోహా, ఖతార్ ప్రాంతాల్లో భారీ ఎత్తున పేలుళ్ల జరిగినట్లు ఖతార్‌ప్రభుత్వం ప్రకటించింది. సెంట్రల్ దోహా, ఖతార్ రాజధాని దోహాకు ఉత్తరం వైపున ఉన్న లూసైల్ ప్రాంతంలోను ఈ దాడులుచేసింది. దీనితో ఖతార్ వెంటనే తన గగనతలాన్ని మొత్తం మూసివేసింది. దేశ పౌరులు భద్రతను దృష్టిలో ఉంచు >>2

## మోహిత్ రెడ్డికి సిట్ నోటీసులు



**విజయవాడ,జూన్23, ప్రభాతవార్తప్రతినిధి:** వైఎస్సార్సీపీ నేత చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కుమారుడు మోహిత్ రెడ్డికి సిట్ నోటీసులిచ్చింది. మద్యం కుంభకోణం కేసులో బుధవారం విచారణకు హాజరుకావాలని సూచించింది. మద్యం కేసులో మోహిత్ రెడ్డి పేరును ఇటీవల సిట్ అధికారులు చేర్చారు. ఈ కేసులో ఆయన ఏ39గా ఉన్నారు. ఇదే కేసులో ఇప్పటికే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అరెస్టై ప్రస్తుతం విజయవాడ జిల్లా జైలులో ఉన్నారు. లిక్కరు స్కామ్ కేసులో సిట్ దర్యాప్తు ముమ్మరం చేసింది. ఈ క్రమంలో చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, అతని సన్నిహితుడు వెంకటేశ్ నాయుడు ప్రమేయం >>2

## డ్రగ్స్ కేసులో తమిళ నటుడు శ్రీరామ్ అరెస్టు



**హైదరాబాద్, జూన్ 23, ప్రభాతవార్త:** తమిళంతో పాటు పలు దక్షిణాది చిత్రాల్లో నటించిన కోలీవుడ్ నటుడు శ్రీరామ్ డ్రగ్స్ కేసులో తమిళనాడు పోలీసులకు పట్టుబడ్డాడు. ఈ ఘటన సోమవారం జరిగింది. కొంతకాలంగా శ్రీరామ్ డ్రగ్స్ వాడుతున్నట్లు పక్కా సమాచారం అందుకున్న చెన్నై నార్కోటిక్స్ >>2

## జగన్ కారు డ్రైవర్‌ను ప్రశ్నిస్తున్న పోలీసులు

### సింగయ్య మృతి కేసు

**విజయవాడ,జూన్23,ప్రభాతవార్తప్రతినిధి:** సత్తెనపల్లి పర్యటనకు వెళ్లే క్రమంలో వైఎస్ జగన్ కారు కింద పడి వృద్ధుడు సింగయ్య మృతి చెందిన ఘటనలో కారు డ్రైవర్ రమణారెడ్డిని పోలీసులు ఇంకా విచారిస్తున్నారు. ఈ కేసులో మరిన్ని సాక్ష్యాలను సేకరించే పనిలో పోలీస్ యంత్రాంగం నిమగ్నమైంది. ఈ కేసును పోలీస్ ఉన్నతాధికారులు స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. భారతీయ న్యాయ సంహిత చట్టంలోని 105 సెక్షన్ కింద కేసు నమోదు చేయడంతో పాటుపూర్తి సాక్ష్యాలతో ముందుకు >>2

## రాజధానిలో మరో ఆరు సంస్థలకు భూకేటాయింపులు

### ఇప్పటివరకూ మొత్తం 74 సంస్థలకు మంజూరు: మంత్రి పి.నారాయణ



**విజయవాడ,జూన్23,ప్రభాతవార్తప్రతినిధి:** సచివాలయంలో జరిగిన భూకేటాయింపుల మంత్రివర్గ ఉపసంఘం సమావేశానికి మంత్రులు నారాయణ,టీజీ భరత్ హాజరయ్యారు. మంత్రులు పయ్యావుల కేశవ్,దుర్గేష్‌లు ఆన్ లైన్ ద్వారా హాజరయ్యారు.సమావేశం ముగిసిన తర్వాత మంత్రి నారాయణ మీడియాకు వివరాలు వెల్లడించారు.రాజధాని భూకేటాయింపుల సబ్ కమిటీ 18వ సమావేశం జరిగింది. మొత్తం 16 అంశాలకుగాను 12 అంశాలకు సబ్ కమిటీ ఆమోదం తెలిపింది. వీటిలో 2014- 19 మధ్య కాలంలో భూములు కేటాయించిన పలు సంస్థలకు తిరిగి కేటాయింపుల్లో మార్పులు చేస్తూ సబ్ కమిటీ ఆమోదం తెలిపింది. సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్...సీబీఐకు రెండు ఎకరాలు అలాగే జియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా సంస్థకు రెండు ఎకరాలు,స్టేట్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ కు ఐదు ఎకరాలు,ఆంధ్రప్రదేశ్ కోపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్‌కు మూడు ఎకరాలు కేటాయింపులను కొనసాగిస్తూ ఆమోదం తెలిపినట్లు మంత్రి నారాయణ చెప్పారు. ఈ నాలుగు సంస్థలకు గతంలో కేటాయించిన భూ కేటాయింపులను రివైజ్ చేసి ఆమోదం తెలిపామన్నారు. 2014- 19లో కేటాయించిన రెండు సంస్థలకు భూ కేటాయింపులను రద్దు చేశాం. గెయిల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, అంబికా అగర్ బత్తి సంస్థకు చేసిన కేటాయింపులు రద్దు చేస్తూ కేబినెట్ సబ్ కమిటీ నిర్ణయం తీసుకుంది.ఈరోజు కొత్తగా మరో ఆరు సంస్థలకు భూ కేటాయింపులు చేసినట్లు మంత్రి చెప్పారు... ఇన్కమ్‌టాక్స్ డిపార్ట్మెంట్‌కు రెండు ఎకరాలు,ఏపీ గ్రామీణ బ్యాంక్‌కు రెండు ఎకరాలు, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు >>2

# రక్షణ రంగ పరిశ్రమలకు ప్రాధాన్యం

### ఏరోస్పేస్, డిఫెన్స్ పాలసీపై సిఎం చంద్రబాబు సమీక్ష


### నాణ్యతా ప్రమాణాలతో ఎంఎస్ఎంఇ ఉత్పత్తులు

### ఐదేళ్లలో లక్ష కోట్ల పెట్టుబడుల సాధనకు కృషి

**విజయవాడ,జూన్ 23,ప్రభాతవార్త బ్యూరో:** ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ పాలసీపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నతాధికారులతో సచివాలయంలో సోమవారం సమీక్షించారు. ఐదేళ్ల పాటు ఈ పాలసీ అంశమై విధివిధానాలు చర్చించారు. వచ్చే ఐదేళ్లలో రూ. లక్ష కోట్ల పెట్టుబడులు ఈ రంగంలో ఆకర్షించాలని లక్ష్యంగా నిర్ణయించారు. నూతన పాలసీ క్లస్టర్ల వారీగా రాష్ట్రం లోని వివిధ ప్రాంతాల్లో అమలు పర్చాలని సూచించారు, రక్షణ, అంతరిక్ష రంగంలో రాష్ట్రం భారీగా పెట్టు బడులు ఆకట్టుకునేలా ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ పాలసీ ఉండాలని నిర్దేశించారు. నూతనంగా తీసుకువచ్చే పాలసీ ద్వారా వచ్చే ఐదేళ్లలో రూ.50 వేల కోట్ల నుంచి రూ. 1 లక్ష కోట్ల పెట్టు బడులు ఆకర్షించేందుకు కృషి చేయాలన్నారు. ఏరోస్పేస్ రంగంలో నూతన సాంకేతికత, నవీన ఆవిష్కరణలకు రాష్ట్రం కేంద్రంగా మారేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సీఎం కోరారు. ఆపరేషన్ సింధూర్‌లో భారతదేశం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించిందని, రానున్న రోజుల్లో టెక్నాలజీ ప్రధాన పాత్ర పోషిస్తుందన్నారు. ఈ తరహా సాంకేతికతను రక్షణపరంగా వాడుకోవడంతో పాటు, వాణిజ్య స్థాయిలో ఉత్పత్తి చేసి, దైనందిన జీవితంలో కూడాఉపయోగపడేలాతీర్చిదిద్దాలని సూచించారు. దేశ రక్షణ, అంతర్గత శాంతి భద్రతలకు సంబంధించి భవిష్యత్‌లో విస్తృత అవకాశాలు ఉన్నాయని ఈ రంగాల్లో పరిశ్రమల ఏర్పాటుకు నూతన పాలసీ దోహదపడాలని సీఎం కోరారు. నేషనల్ సెక్యూరిటీకి ప్రాధాన్యత ఇచ్చేలా పలు మార్పులు సూచించారు. ఏరో స్పేస్ అండ్ డిఫెన్స్ సలహాదారు సతీష్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షకు హాజరై పలు సూచనలు చేశారు. ఎంఎస్ఎంఈ ఉత్పత్తులకు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సీఎం కోరారు. మిగతా రాష్ట్రాల కంటే ఈ రంగంలోని ఎంఎస్ఎంఈలను ప్రత్యేకంగా ప్రోత్సహించాలన్నారు. ఇందుకోసం ఏడాదికి ప్రత్యేకంగా రూ.100 కోట్లతో కార్పస్ ఫండ్ ఏర్పాటు చేయడంతో పాటు, లాజిస్టిక్స్ సబ్సిడీ వంటివి నూతన పాలసీలో పొందుపర్చాలని సూచించారు. అనుబంధ పరిశ్రమలలో ఉత్పత్తుల నాణ్యతలో విలువ జోడింపు జరగాలని, మార్కెటింగ్, బ్రాండింగ్ ప్రాధాన్యతలు గుర్తించాలని కోరారు. వన్ ఫ్యామిలీ, వన్ ఎంట్రప్రెన్యూర్ ఆశయం సాకారం కావాలని,అదే లక్ష్యంగా అధికార యంత్రాంగం ముందుకు సాగాలన్నారు. రక్షణ ఉత్పతులకు గాను విశాఖపట్నం,శ్రీకాకుళంలో నావల్ క్లస్టర్‌లు ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. జగ్గయ్యపేట దొనకొండ ప్రాంతంలో మిస్సైల్, ఆయుధాల ఉత్పత్తులు, కర్నూలు,ఓర్వకల్లులో మానవ రహిత విమానాలు, డ్రోన్ల తయారీ... లేపాక్షి మడకశిర క్లస్టర్‌లో ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, తిరుపతిని రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ హబ్‌గా తీర్చిదిద్దాలన్నారు. అలాగే డీఆర్డీవో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ నెలకొల్పాలని ముఖ్యమంత్రి సూచించారు. మరోవైపు మడకశిర క్లస్టర్‌లో భారత్ ఫోర్జ్, ఎంఎండబ్ల్యు సంస్థలు పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నాయని, త్వరలోనే శంకు స్థాపన చేయనున్నాయని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. రాష్ట్రంలో రూ.22 వేల కోట్ల పెట్టుబడులు పెట్టిన 23 సంస్థల జాతీయ రక్షణ ఉత్పత్తుల విలువ ఏడాదికి రూ.1.27లక్షల కోట్లు ఉంటుందని అధికారులు తెలిపారు. ఇందులో రక్షణ రంగానికి చెందిన ప్రభుత్వ రంగ సంస్థల వాటా 73 శాతం కలిగి ఉన్నాయని, 21 శాతం విలువైన ఉత్పత్తులు ప్రైవేట్ రంగం నుంచి వస్తున్నాయని వివరించారు.మిగిలిన 7శాతం ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంలో ఉత్పత్తి అవుతున్నా >>2

## లడ్డూలకు 'కియోస్క్'!

### తిరుమలలో ప్రయోగాత్మకంగా ఏర్పాటు



### బ్యాంకుల ద్వారా ఐదు యంత్రాలు అందుబాటులోకి

**తిరుమల,జూన్ 23ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం తరువాత అంతేపవిత్రంగా భావించే లడ్డూ ప్రసాదాన్ని భక్తులు ఇకనుండి సులభంగా అందుకునేందుకు వీలుగా టిటిడి అధికారులు “కియోస్క్” యంత్రాలను అందుబాటులోకి తీసుకువచ్చారు.ఈ యంత్రాలను లడ్డూవితరణశాలలో మొదట్లోనే ఏర్పాటుచేశారు. యూనియ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో ఐదు కియోస్క్ యంత్రాలను ప్రయోగాత్మకంగా ఉంచారు. భక్తులు సులభంగా ఈ కియోస్క్‌ల వద్దకు చేరుకుంటే రెండు రకాల సేవలు యంత్రం తెరపై కనిపిస్తుంది. మొదటిది దర్శన టిక్కెట్ కలిగిన భక్తులకు లడ్డూప్రసాదం, దర్శనం టిక్కెట్ లేని భక్తులకు ఆధార్‌కార్డు ఆదారంగా లడ్డూలు అందుకునేందుకు సాంకేతికతను అమర్చారు. దీనిపై భక్తులు ఏదేని ఒకదానిని వినియోగించుకుంటే లడ్డూలకు దర్శన టిక్కెట్‌నంబర్‌గానీ, ఆధార్ కార్డునంబర్ నమోదు చేయాలి. ఆ తరువాత మొబైల్‌నంబర్ నమోదు చేస్తే ఎన్ని లడ్డూలు అవసరం అనేది తెరపై కనిపిస్తుంది. భక్తులు ప్రస్తుతం ప్రయోగత్మక విధానంలో ఆధార్‌కార్డు ఆధారంగా కేవలం 2లడ్డూలు మాత్రమే అందుకునే అవకాశం ఉంది. దర్శన టిక్కెట్ ఉంటే ఆ నంబర్‌ను నమోదుచేస్తే 6లడ్డూలు వరకు అందుకునే వీలుంది. ఈ విధానంలో భక్తులు చేతిలో డబ్బులు లేకున్నా కియోస్క్‌ల ద్వారా యుపిఐ స్కానర్‌తో నగదు చెల్లింపులు జరిపి, కౌంటర్‌ల వద్ద నిరీక్షించే అవసరం లేకుండా లడ్డూలు పొందవచ్చు. ఆదివారం మధ్యాహ్నం నుండి ప్రయోగాత్మకంగా అందుబాటులోకి తీసుకువచ్చిన ఈ కియోస్క్‌యంత్రాలను తక్కువ సంఖ్యలోనే భక్తులు సేవలు వినియోగించుకున్నారని టిటిడి ఆలయ వర్గాల సమాచారం. ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనానికి భక్తుల రద్దీ పెరిగిన సమయంలో దర్శనానంతరం లడ్డూప్రసాదాల కోసం కూడా భక్తులు వితరణశాలలో క్యూలలో బారులుతీరడం కనిపిస్తుంది. కౌంటర్ల వద్ద అధిక రద్దీని, నిరీక్షించే సమయాన్ని తగ్గించేందుకు ఈ యంత్రాలు ఉపయోగకరంగా ఉంటాయి. రోజుకు 80వేలమందినుండి 90వేలమంది వరకు భక్తులు కలియుగవైకుంఠవాసుడిని దర్శించుకుంటున్నారు. ఉదయం విఐపి బ్రేక్ దర్శనాల సమయంలో మాత్రమే లడ్డూవితరణశాలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంటుంది. సర్వదర్శనం ,ఆర్జితసేవలు ముగిసే సమయాల్లో ఉచిత లడ్డూతో బాటు అదనపు లడ్డూలకోసం పెద్దసంఖ్యలో భక్తులు కౌంటర్లవద్ద కనిపిస్తారు. భక్తులు ఒక్కసారిగా కౌంటర్ల వద్దకు వచ్చినపుడు అక్కడి సిబ్బంది ,శ్రీవారిసేవకుల సహాయంతో లడ్డూలకు డబ్బులుతీసుకున్న అనంతరం లడ్డూలను >>2

## సిఎం చంద్రబాబుకు ప్రొటోకాల్ తెలీదా?

### జడ్‌ప్లస్ సెక్యూరిటీ ఉన్నవారికి ఎటువంటి భద్రత ఇవ్వాలి?

### ప్రతి అంశాన్ని రాజకీయం చేయడమేనా?



### ముఖ్యమంత్రికి ప్రశ్నలు సంధించిన జగన్

**విజయవాడ,జూన్23,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ సీఎం చంద్రబాబు మీరు ప్రతి అంశాన్ని రాజకీయం చేయాలనే వైఖరిని మార్చుకోవాలని మాజీ సీఎం వైఎస్ జగన్మోహనరెడ్డి 'ఎక్స్' సామాజిక మాధ్యమం వేదికగా వ్యాఖ్యానించారు.సీఎం చంద్రబాబుకు ఆయన తన ట్వీట్‌లో పలు ప్రశ్నలు సంధించారు.ఈరోజు మీరు రాజకీయాలను మరింత దిగజార్చారు. నేను అడుగుతున్న ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పగలరా? చంద్రబాబు అంటూ ప్రశ్నించారు. అసలు నా పర్యటనకు మీరు ఎందుకు ఆంక్షలు పెట్టి, ఎవరూ రాకూడదని కట్టడి ఎందుకు చేశారు? గతంలో మీరుకాని, మీ పవన్‌కళ్యాణ్ కాని తిరుగుతున్నప్పుడు మేం ఇలాంటి ఆంక్షలు ఎప్పుడైనా పెట్టామా?ప్రతిపక్ష నాయకుడిగా నేను మా కార్యకర్తల ఇంటికి వెళ్లడం తప్పా? ప్రతిపక్ష నాయకుడిగా రైతుల తరఫున, ప్రజల తరఫున వారికి సంఘీభావం తెలియజేయడానికి వెళ్లడం తప్పా? ఒక మాజీ ముఖ్యమంత్రిగా, జడ్ ప్లస్ సెక్యూరిటీ భద్రత అన్నది నాకు అయినా, మీకు గతంలో అయినా, భవిష్యత్తులో అయినా, ఆటోమేటిక్ హక్కు కాదా? మీకు బుద్ధిపుట్టినప్పుడు భద్రత ఇస్తాం, లేదంటే, మూడ్ రానప్పుడు మేం మీకు జడ్‌ప్లస్ కేటగిరీ సెక్యూరిటీని >>2



సోమవారం అమరావతిలో జరిగిన యేడాది పాలనపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరిస్తున్న సిఎం చంద్రబాబు, హాజరైన ప్రజాప్రతినిధులు తదితరులు

# విధ్వంసం నుంచి వికాసం వైపు

>> సృష్టించే దిశలో దిశలో ఆర్థిక వనరులు పెంచుతున్నారు.రూ.లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకుని వస్తున్నామన్నారు. ప్రతి అంశాన్ని ప్రజలతో చర్చిస్తున్నామన్నారు.సూపర్ సిక్స్ వాగ్దానాలను క్రమంగా అమలు చేస్తున్నామన్నారు.దీపం-2,తల్లికివందనం,పెన్షన్ పెంపు, మరో రెండు నెలల్లోపు స్త్రీలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తున్నామన్నారు. ప్రజాలోచనలకు అనుగుణంగా ప్రభుత్వం ముందుకు వెళ్లాలని సీఎం చంద్రబాబు సూచించారు. ఎన్ని ఇబ్బందులు ఉన్నా ఇచ్చిన హామీలు అమలు చేసి తీరుతామని స్పష్టం చేశారు. అస్తవ్యస్తంగా ఉన్న ఆర్థిక వ్యవస్థను గాడిన పెడుతున్నామని అన్నారు. అన్ని చేశామని చెప్పట్లేదు కానీ ఊహించిన దాని కన్నా ఎక్కువే చేశామని వెల్లడించారు. మన ప్రయాణం ఎక్కడ నుంచి మొదలైందో విశ్లేషించుకోవాలని దిశానిర్దేశం చేశారు. అప్పులకు వడ్డీ, అసలు కట్టి, సంక్షేమం అందిస్తూ ముందుకు సాగాలంటే అసాధారణంగా పని చేయాలని స్పష్టం చేశారు. పోలవరం పూర్తయితే ఏపీకి నీటి సమస్య సమసిపోతుందని వెల్లడించారు. జగన్ ప్రభుత్వ హయాంలో నిధులు మళ్లించి దుర్వినియోగం చేశారని మండిపడ్డారు. అధికారంలోకి రాగానే నాలుగు సంతకాలు పెట్టానని గుర్తుచేశారు. మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చామని ప్రకటించారు. జగన్ ప్రభుత్వ హయాంలో రెవెన్యూ రికార్డులను అస్తవ్యస్థం చేశారని ఆరోపించారు. 213 అన్న క్యాంటీన్ల ద్వారా రూ.5కే భోజనం పెడుతున్నామని ఉద్ఘాటించారు. విశాఖ ఉక్కు పరిశ్రమకు రూ.11,400కోట్లు సాయం చేశామని చెప్పారు. అమరావతిని మళ్లీ పట్టా లెక్కించాం,పూర్తిచేస్తామని మాటిచ్చారు. పోలవరం ప్రాజెక్టుకు రూ.12,500 కోట్లను కేంద్రప్రభుత్వం కేటాయించిందని అన్నారు. విశాఖపట్నం రైల్వేజోన్ పనులు వేగంగా జరుగుతున్నాయని వివరించారు. తల్లికి వందనం హామీని పూర్తిగా నిలబెట్టుకున్నామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.రాష్ట్రంలో శాంతి భద్రతలకు భంగం కలిగించే శక్తులను నియంత్రించాలని ఆయన సమావేశ ముఖంగా డీజీపీ హరీష్‌కుమార్ గుప్తాను ఆదేశించారు.

**రెండుతెలుగు రాష్ట్రాలు బాగుండాలి :** పోలవరం బనకచర్ల అనుసంధానం ద్వారా గోదావరి వరద జలాల్ని రెండు తెలుగు రాష్ట్రాలు వాడుకోవచ్చని సీఎం చంద్రబాబు చెప్పారు. గోదావరిలో కలిసే 3వేల టీఎంసీల నీటిలో 200 టీఎంసీలు ఏపీ, మరో 200 టీఎంసీలు తెలంగాణ వాడుకునేలా వర్కౌట్ చేస్తున్నామని వెల్లడించారు. రెండు తెలుగు రాష్ట్రాలు బాగుండాలని ఆకాంక్షిస్తున్నానని అన్నారు. 3 ఏళ్లలో రాజధాని అమరావతి తొలిదశ పనులు పూర్తి చేసి మళ్లీ ప్రధాని మోదీతోనే ప్రారంభింపచేస్తామని స్పష్టం చేశారు.

**ఆగస్టు 15 నుంచి ఉచిత బస్సు ప్రయాణం:** ఇప్పటి వరకూ 9.34 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించామని చంద్రబాబు స్పష్టం చేశారు. వీటి ద్వారా 8.50లక్షల ఉద్యోగాలు వస్తాయని వివరించారు. పది సూత్రాలతో స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాలు సాధిద్దామన్నారు. ఆగస్టు 15న మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తూనే ఆటోడ్రైవర్లను ఆదుకునేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామన్నారు. 4ఏళ్లలో ప్రతీ ఒక్కరికీ సొంత ఇంటి కల సాకారం చేస్తామని వెల్లడించారు. ఎన్నికల హామీ ప్రకారం పట్టణ ప్రాంతాల్లో 2సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 5సెంట్లు ఇంటి జాగా వచ్చే 4ఏళ్లలో కల్పిస్తామని చంద్రబాబు తెలిపారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మూడు ముక్కలాటతో ఏపీకి రాజధాని లేకుండా చేశారని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ హయాంలో నిధులు మళ్లించి దుర్వినియోగం చేశారని మండిపడ్డారు. వైసీపీ ప్రభుత్వ విధానాలతో పెట్టుబడిదారుల్లో నమ్మకం పోయిందని చెప్పారు. కూటమి ప్రభుత్వంలో స్వర్ణాంధ్ర విజన్ 2047ను లక్ష్యంగా పెట్టుకున్నామని ఉద్ఘాటించారు. డబుల్ ఇంజిన్ సర్కార్‌తో అభివృద్ధి ఎలా ఉంటుందో చూపించామని చెప్పారు. అన్నీ చేసేశామని చెప్పట్లేదని.. ఊహించిన దాని కంటే ఎక్కువగానే సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ఏపీలో అమలు చేశామని అన్నారు. మూడు పార్టీలు కలిసి అధికారంలో ఉన్నా ఎలాంటి సమస్య రాలేదని చెప్పారు. ఎన్ని ఇబ్బందులున్నా చెప్పిన మాట నిలబెట్టుకుంటామని ఉద్ఘాటించారు. సుపరిపాలన అందించేందుకు అధికారులు కూడా కలిసి రావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు ,కేంద్రమంత్రులు పెమ్మసాని చంద్రశేఖర్,కింజరపు రామ్మోనాయుడు తదితరులు సభలో పాల్గొన్నారు.

# పరుగులు పెడుతున్న డబులింజన్ సర్కార్

>> భాగంలో సుపరిపాలనలో తొలి అడుగు పేరిట సదస్సులో ఏర్పాటు చేశారు. ఈ సదస్సును సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్, ఎంపీ పురందేశ్వరిలు కలిసి ప్రారంభించారు. అలానే ఈ సదస్సులో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. లోకేశ్ మాట్లాడుతూ ఉత్తరాంధ్రకు టీసీఎస్, కాగ్నిజెంట్ సంస్థలను తీసుకువచ్చామని కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు కేంద్రం సహకరిస్తోందని తెలిపారు. అభివృద్ధిలో డబల్ ఇంజిన్ సర్కారు దూసుకుపోతోందని కొనియాడారు. వైఎస్సార్సీపీ హయాంలో రంగులు, ఫొటోల పిచ్చి మనం చూశామని అన్నారు. విద్యాశాఖలో అనేక సంస్కరణలు తీసుకువచ్చామని అలానే మధ్యాహ్న భోజనానికి సన్నబియ్యం అందిస్తున్నామని స్పష్టం చేశారు. బాధ్యతాయుతమైన నాయకులుగా ప్రజల సమస్యలను ఓపిగ్గా వినాలని, నియోజకవర్గ అభివృద్ధి కోసం అందరూ పోటీపడాలని వెల్లడించారు. వచ్చే నాలుగేళ్లపాటు అభివృద్ధి పనులపైనే దృష్టి పెట్టి అందరం కలిసి రాష్ట్రాన్ని నెంబర్‌వన్ చేద్దామని పిలుపునిచ్చారు.మొన్నటి ఎన్నికల్లో నిజంగా గెలిచింది రాష్ట్ర ప్రజలేనని మంత్రి లోకేశ్ కొనియాడారు. గత ఐదేళ్ల పరిపాలనలో అప్పుల రాష్ట్రంగా మార్చారని ఆరోపించారు. వైఎస్సార్సీపీ హయాంలో రాష్ట్రానికి ఒక్క పరిశ్రమ కూడా రాలేదని, ఇంకా ప్రజాసమస్యలను ఏ మాత్రం పట్టించుకోలేదని మండిపడ్డారు. వైఎస్సార్సీపీని ప్రశ్నిస్తే లాఠీ దెబ్బలు, అరెస్టులు, వేధింపులకు గురి చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రజలు సుఖశాంతులతో ఉన్నారని నియంత పాలన నుంచి ప్రజలకు నిజమైన స్వాతంత్ర్యం వచ్చిందని అన్నారు.

ఏ రాష్ట్రం ఇవ్వని విధంగా ఎక్కువ మొత్తం పింఛను ఇస్తున్నామని, తల్లికి వందనం పేరుతో ఒకటో క్లాస్ నుంచి ఇంటర్ వరకు సాయం అందిస్తున్నామని తెలిపారు. తొలి ఏడాదిలోనే డీఎస్సీ ద్వారా 16,300 పోస్టులు భర్తీ చేస్తున్నామని అలానే పేదలకు చేయూత ఇచ్చేందుకే పీ4 విధానం తీసుకువచ్చామని వెల్లడించారు. గత వైసీపీ పాలకుల అహంకారం, అరాచకంతో 151సీట్లు 11కే పరిమితం అయ్యాయన్నారు. ఈ విషయాన్ని కూటమి నేతలు గుర్తుపెట్టుకోవాలని సూచించారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ పరుగులు పెడుతోందని మంత్రి నారా లోకేష్ ఉద్ఘాటించారు. ఐదేళ్లలో సాధించలేనిది ఏడాదిలోనే సాధించి చూపామని అన్నారు. ఉద్యోగులే ప్రభుత్వానికి గుండెకాయ అని అభివర్ణించారు. ప్రజలకు చేరువగా వెళ్లి సేవలందించాలని కోరారు. దేవుడు కూడా అన్ని సమస్యలు తీర్చలేరని చెప్పారు. అవకాశం ఉన్నంత వరకూ ప్రజా సమస్యలు పరిష్కరిస్తున్నామని తెలిపారు. గత జగన్ ప్రభుత్వం పెట్టిపోయిన బకాయిలను కూడా త్వరగా చెల్లిస్తున్నామని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.

త్వరలోనే అన్నదాత సుఖీభవ, ఆగష్టు 15న మహిళలకు ఫ్రీగా బస్సు ప్రయాణం అమలుచేస్తాం. గత పాలకులు ప్రజల ఆస్తులు కొట్టేయడానికి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తీసుకొస్తే దానిని మన ప్రజా ప్రభుత్వం రద్దు చేసింది. గత ప్రభుత్వం చెత్త మీద పన్ను వేస్తే మన ప్రజా ప్రభుత్వం చెత్త పన్ను ఎత్తేసింది. పేదరికం లేని సమాజం చూడాలనేది చంద్రబాబు లక్ష్యమన్నారు. పీ4 కాన్సెప్ట్ తీసుకొచ్చారు. సమాజానికి ఎంతో కొంత తిరిగి ఇవ్వడమే పీ4. బంగారు కుటుంబాలకు చేయూత అందిస్తున్న మార్గదర్శులకు నా ధన్యవాదాలు. పవనన్న ఆధ్వర్యంలో పంచాయతీలకు స్వాతంత్ర్యం వచ్చింది. పంచాయితీలకు వెయ్యి కోట్లు నిధులు విడుదల చేసాం. రైతుల నుండి 56 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాం, 13,600 కోట్లు చెల్లించాం. గత ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లలో పెట్టిన 1700 కోట్ల బకాయిలు కూడా మనమే తీర్చాము. పొగాకు, మిర్చి, కోకో రైతులకు మద్దతు ధర ఇచ్చి ఆదుకుంటుంది ప్రజా ప్రభుత్వమని అన్నారు. విద్యాశాఖలో సంస్కరణలు: నా శాఖ లో సంస్కరణలు తెస్తున్నా. రాజకీయాలకు అతీతంగా విద్య వ్యవస్థ ఉండాలనేది ప్రజా ప్రభుత్వం లక్ష్యం. గత పాలనలో ఫోటోలు రంగుల పిచ్చి మీరంతా చూసారు. యూనిఫామ్ దగ్గర నుండి చిక్కీ వరకూ పార్టీ రంగులు, ఫోటోలు. ఫీజు రీయింబర్స్మెంట్ నుండి చిక్కీల వరకూ 6500 కోట్ల బకాయిలు నా నెత్తి మీద పోయారు. బకాయిలన్నీ క్రమ పద్ధతిలో చెల్లిస్తున్నాం. మధ్యాహ్న భోజన పథకానికి డొక్కా సీతమ్మ గారి పేరు పెట్టాం. స్టూడెంట్ కిట్ కి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ గారి పేరు పెట్టాం. గత ప్రభుత్వ పాలనలో 1200 స్కూళ్ల వన్ క్లాస్ … వన్ టీచర్ ఉంటే ఇప్పుడు 9800 స్కూల్స్ లో వన్ క్లాస్… వన్ టీచర్ పెంచాం. కరిక్యులమ్ లో మార్పులుకేజీ నుండి పీజీ వరకూ కరికులం మారుస్తున్నామని లోకేష్ అన్నారు.

## జగన్ కారు డ్రైవర్‌ను ప్రశ్నిస్తున్న పోలీసులు

>> వెళ్లాలని వారు నిర్ణయించారు. ఈ సెక్షన్ కింద 10 ఏళ్లకుపైనే శిక్ష పడే అవకాశం ఉందని న్యాయ నిపుణులు చెబుతున్నారు. ఇక 2011 నాటి నుంచి అంటే గత 14 ఏళ్లగా వైఎస్ జగన్ వద్ద రమణారెడ్డి కారు డ్రైవర్‌గా పని చేస్తున్నట్లు విచారణలో వెల్లడయింది. ఇక ఈ సంఘటన జరిగిన రోజు అంటే.. జూన్ 18వ తేదీన వైఎస్ జగన్‌కు రక్షణగా ఉన్న పోలీస్ సిబ్బందిని సైతం పిలిపించి విచారించాలని పోలీస్ ఉన్నతాధికారులు నిర్ణయించినట్లు సమాచారం. వైఎస్ జగన్ జెడ్ ప్లస్ కేటగిరిలో ఉండటంతో ఆయన వాహనం చుట్టూ భద్రతా సిబ్బంది ఉంటారు. అదీకాక జగన్ వాహనం కింద సింగయ్య పడిన సమయంలో ఈ దృశ్యాన్ని అక్కడే విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి ఖచ్చితంగా తెలిసి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. మరోవైపు వృద్ధుడు సింగయ్య కారు కింద పడిన అనంతరం అతడు కొన ఊపిరితో ఉండగా అతనిని అక్కడి నుంచి తీసుకువచ్చి పొదల్లో పడేసినట్లు వార్తలు వెలువడ్డాయి. ఈ వ్యవహారంలో ప్రమేయం ఉన్న వ్యక్తులను ఆదివారం రాత్రి పోలీస్ అధికారులు పిలిపించారు. వారి వద్ద నుంచి స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు. అలాగే ఈ ఘటన చోటు చేసుకున్న ప్రదేశంలోని సీసీటీవీ ఫుటేజ్‌లను ఇప్పటికే పోలీసులు సేకరించారు. ఈ కేసుదర్యాప్తులో భాగంగా మరికొందరి పేర్లను ఎఫ్ఐఆర్‌లో చేర్చే అవకాశాలు ఉన్నాయని పోలీసు ఉన్నతాధికారులు స్పష్టం చేశారు.

## రక్షణ రంగ పరిశ్రమలకు ప్రాధాన్యం

>> ఏరో స్పేస్ అండ్ డిఫెన్స్ క్లస్టర్‌లో 23 సంస్థలు,రూ.22 వేల కోట్ల పెట్టుబడులు పెట్టాయి. దీంతో 17 వేల మందికి ఉపాధి లభించిందని అధికారులు వెల్లడించారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, టీజీ భరత్‌తో పాటు వాణిజ్యపరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ పాల్గొన్నారు.

## క్షిపణిదాడులు

>> కుని ఈ చర్యలుచేపట్టినట్లు తేలింది. కొన్ని క్షిపణులు ఆకాశ మార్గంలో అల్ ఉదీద్ ఎయిర్‌బేస్‌వెపు శరవేగంగా దూసుకువెళ్లినట్లు దృశ్యాలు కనిపించాయి. అమెరికా ఇరాన్‌పై దాడికి ఎన్ని బాంబులను వినియోగించిందో ఇరాన్‌కూడా అమెరికా వైమానిక స్థావరాలపై అదేసంఖ్యలో క్షిపణి దాడులు చేసిందని ప్రకటించారు. పరిస్థితి తీవ్రం అవుతుండటంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్, డిఫెన్స్ సెక్రటరీ పేటే హెగ్‌సేత్ జాయింట్‌స్టాఫ్ ఆఫ్ చీఫ్స్ జనరల్ జాన్ కైనేలు వార్‌రూమ్‌లో అత్యవసర సమావేశం నిర్వహించి ఖతార్‌పై ఇరాన్‌దాడుల స్థితిపై చర్చలు జరిపారు. ఆపరేషన్ మిడ్‌నైట్ హ్యామ్మర్‌పేరిట నిర్వహించిన దాడుల్లో బంకర్‌బస్టర్ బాంబులు ఉపయోగించి ఇరాన్‌లోని మూడు కీలక అణుస్థావరాలను ధ్వంసం చేసింది. సోమవారం కూడా కొన్ని చోట్ల దాడులు నిర్వహించిందని తేలింది. ఇందుకు ప్రతీకారం తప్పదని ముందే హెచ్చరించిన ఇరాన్ తాను అనుకున్న లక్ష్యాలను సాధించేందుకు తొలివిడతగా ఖతార్ ఎయిర్‌బేస్‌ను ఎంచుకుని దాడులుచేసింది. ఇరాన్ తానుచేసిన దాడులకు ఆపరేషన్ బేషరత్ ఫతాహ్ అని పేరుపెట్టింది. యుద్ధవాతావరణం అలుముకుంటుండటంతో దోహా ఎయిర్‌పోర్టుకువచ్చే విమానసర్వీసులన్నింటిని దారిమళ్లించాలని ఆదేశాలుజారీ చేసింది. అలాగే ఖతార్‌లోని అమెరికా దౌత్యకార్యాలయం కూడా అమెరికా పౌరులు ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా ఇళ్లనుంచి బయటికి రావద్దని అత్యవసర పరిస్థితులు మినహా బయటకు రావద్దని హెచ్చరించింది. అయితే ఈ దాడుల పరిణామాలు కూడా మరింత తీవ్రంకావచ్చని అంచనా. పశ్చిమాసియాలోని మా స్థావరాలపై దాడులుచేస్తే ఇరాన్‌కు మరింత గట్టిగా బుద్ధిచెపుతాం అంటూ అమెరికా అధ్యక్షుడు హెచ్చరించిన సంగతి తెలిసిందే.

## లడ్డూలకు 'కియోస్క్'!

>>అందిస్తారు. దీనివల్ల చాలావరకు ఇబ్బందులుఎదురవుతున్నాయి. ఈ రద్దీని నియంత్రించేందుకు ఇప్పుడు ప్రయోగాత్మకంగా ఏర్పాటుచేసిన కియోస్క్‌ల ద్వారా రశీదు అందుకుంటే క్షణాల్లో లడ్డూలు కౌంటర్ల నుండి పొందవచ్చు.ఒక కుటుంబంలో ఐదుగురు భక్తులు దర్శనానికి వచ్చినా వీరంతా కలసి 30 వరకు లడ్డూలు అదనంగా పొందే వీలు కలుగుతుంది.ఇదేగాక ఆధార్‌కార్డు ఆధారంగా తీసుకునే 2లడ్డూల సంఖ్యను కూడా 4లడ్డూలకు పెంచేందుకు సాంకేతిక మార్పులు జరగనున్నాయి.

## భూకేటాయింపులు

>> 0.4ఎకరాలు, ఇంటిలిజెన్స్ బ్యూరోకి 0.5 ఎకరాలు,బ్యూరో ఆఫ్ ఇమిగ్రేషన్‌కి 0.5 ఎకరాలు,బీజేపీ కార్యా లయానికి రెండు ఎకరాల చొప్పున కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నాం. 2014-19 మధ్య కాలంలో 130సంస్థలకు 1270 ఎకరాలు కేటా యించగా గత ప్రభుత్వ నిర్వాకం,మూడు ముక్కలాటతో పలు సంస్థలు భయపడి వెనక్కి వెళ్లిపోయాయి. ఆయా సంస్థలతో సంప్రదింపులు జరిపి తిరిగి కేటాయింపుల విషయంలో నిర్ణయం తీసుకుంటున్నాం...ఇప్పటివరకూ 64 సంస్థలకు 884 ఎకరాలు కేటాయించగా ఈరోజు మరో పది సంస్థలకు కేటాయింపులు పూర్తి చేసామని మంత్రి నారాయణ తెలిపారు.

# తాటతీస్తాం

>> ప్రజలకు ఇబ్బందులు కలిగించే అరాచక శక్తులను అత్యంత కఠినంగా అణచివేస్తామన్నారు. సుపరిపాలన తొలి అడుగు సమావేశంలో సోమవారం ఆయన మాట్లాడుతూ పంచాయతీరాజ్.గ్రామీణాభివృద్ధి దిశలో ఏడాది కాలంలో గణనీయ ప్రగతి సాధించామన్నారు. ఉపాధి పనులు మెరుగుపరుస్తున్నామన్నారు. అడవులు,వన్య ప్రాణులను రక్షించే దిశలో ఎన్నో చర్యలు తీసుకుంటున్నామన్నారు.సాంకేతికంగా రాష్ట్రాన్ని అన్ని దిశలో ముందుకు తీసుకుని వెళ్తున్నామన్నారు.గతంలో అయిదేళ్ళు రాష్ట్రంలో అరాచక పాలన సాగించి,ఎన్నికల్లో 11 సీట్లుకు పరిమితమైన రాజకీయ పక్షాలు ఇంకా పద్దతులు మార్చుకోవడం లేదన్నారు.రాష్ట్రంలో అత్యంత దారుణంగా బలప్రదర్శనలు,అరాచకాలు చేస్తున్నాయన్నారు.ఎక్కడిక్కడ విధ్వంసం సృష్టించాలనే దుష్ట ఆలోచనతో ఉన్నాయన్నారు. అటువంటి దుర్మార్గాన్ని సాగించమన్నారు.ఒక సమర్ధవంతుడు,ముందు చూపు వున్న నేత చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం ముందుకు వెళ్తుందన్నారు.కేంద్ర సహకారంతో, ప్రజామోదం పొందిన ప్రధాని నరేంద్రమోడీని ఆదర్శంగా తీసుకుని తమ ప్రభుత్వం అభివృది పథంలో దూసుకుని వెళ్తుందన్నారు. గత కొద్ది రోజులుగా చోటు చేసుకుంటున్న పరిస్దితులను గమనించి సహనంతో వ్యవహరిస్తున్నామని విషయాన్ని వివరిస్తున్నాను,.సందర్భం కానప్పటికి శాంతి భద్రతలకు భంగం కలిగించే పరిస్దితులను సృష్టించినా, ఆడపిల్లల జోలికి వచ్చిన తాట తీస్తానని పవన్ కల్యాణ్ ఉద్వేగంతో మాట్లాడారు. రోడ్లపైకి వచ్చి రౌడీయిజం చేస్తే కాళ్లు విరగ్గొట్టి కింద కూర్చో బెడతామని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్సీపీ బెదిరింపులకు భయపడమని అన్నీ చూశాకే ఇక్కడవరకు వచ్చామని పవన్ వ్యాఖ్యానించారు. సుపరిపాలన అవసరం గుర్తించే ప్రజలు కూటమికి పట్టం కట్టారని పవన్ కల్యాణ్ తేల్చిచెప్పారు. ప్రజల్లో మార్పు తెచ్చి చీకటి నుంచి వెలుగులోకి వచ్చేందుకు పెద్ద యుద్ధమే చేశామని గుర్తు చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడకుండా ఉంటే పరిస్థితులు ఎంత దారుణంగా ఉండేవో ఊహించుకోవచ్చునని పవన్ అభిప్రాయపడ్డారు. ప్రజాస్వామ్య హితం కోరుకునే ప్రతీ ఒక్కరూ ఆందోళన చెందేలా గత పాలన సాగిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాజానికి మంచి చేసిన వారి పేర్లను ప్రభుత్వ పథకాలకు పెట్టాలని నారా లోకేశ్ తీసుకున్న నిర్ణయం స్ఫూర్తిదాయకమని వివరించారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల్లో కీలక సంస్కరణలు ఏడాది కాలంలో చేపట్టామని వెల్లడించారు. సుపరిపాలన అవసరం గుర్తించే ప్రజలు కూటమికి పట్టం కట్టారని పవన్ కల్యాణ్ తేల్చిచెప్పారు.

## శ్రీరామ్ అరెస్టు

>> ఇంటెలి జెన్స్ యూనిట్ విభాగం పోలీసులు అతనిపై నిఘా వుంచారు. సోమ వారం నాడు అతన్ని అరెస్టు చేసి కొంతమేర డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం శ్రీరాంకు వైద్య పరీక్షలు నిర్వహించగా అతను కొంతకాలంగా డ్రగ్స్ వాడుతున్నట్లు నిర్ధారణ అయ్యింది. ఎఐడిఎంఎ మాజీ నేత ప్రసాద్ నుంచి శ్రీరాం డ్రగ్స్‌ను కొంటున్నట్లు తేలింది. ఈ కేసులో ప్రసాద్‌తో పాటు మరో మధ్యవర్తిని కూడా పోలీసులు అరెస్టు చేశారు. శ్రీరాం అసలు పేరు శ్రీకాంత్, చిత్తూరు జిల్లా తిరుపతికి చెందిన ఇతను 15 ఏళ్ల క్రితం సినీ రంగంలోకి వచ్చి తన పేరును శ్రీరాంగా మార్చుకున్నాడు.

## సిట్ నోటీసులు

>> ఉన్నట్లు ఆధారాలు వెలుగులోకి తీసుకుని వచ్చింది. ఈ సందర్భంలో నిందితులు ముడుపుల సొమ్మును తొలుతగా హైదరాబాద్‌లో వెంకటేశ్ నాయుడు నివాసానికి చేర్చేవారని సిట్ అభియోగించింది. అక్కడి నుంచి చెవిరెడ్డి బృందం దాదాపు రూ.50 కోట్ల నుంచి రూ.60 కోట్లు వరకూ ఆంధ్ర తరలించింది. మద్యం ముడుపుల సొత్తును ఎలా సేకరించారు? ఎలా రవాణా చేశారు? ఎక్కడికి చేర్చారనే అంశాలన్నీ వెంకటేశ్ నాయుడు, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిలకు మాత్రమే తెలుసనని సిట్ ఆరోపణ చేస్తోంది. గత సంవత్సరం మే 9న ఎన్టీఆర్ జిల్లా(ఏపీ సరిహద్దు) గరికపాడు చెక్‌పోస్టు వద్ద లారీలో తరలిస్తూ పట్టుబడ్డ రూ.8.34 కోట్ల నగదు, లిక్కర్ ముడుపుల సొత్తేనని, లారీ పట్టుబడగానే చెవిరెడ్డి అప్పటి గన్‌మన్ గిరి తన ఫోన్ల స్విచాఫ్ చేసేశారని సిట్ తెలిపింది. చెవిరెడ్డి ఆదేశాలతో పారిపోయిన గిరి చెన్నై, బెంగళూరు, పాండిచ్చేరిల్లో తిరిగారని సిట్ పేర్కొంది. ఎన్నికల్లో వైఎస్సార్సీపీ ఓడిపోవడంతో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి గన్‌మన్ గిరికి ఫోన్ చేసి ముడుపుల సొమ్ము రవాణా గురించి ఎట్టి పరిస్థితుల్లోనూ నోరు విప్పొద్దని హెచ్చరించారని వివరించింది. సిట్ అధికారులు గిరిని విచారించి వాంగ్మూలం తీసుకున్న తర్వాత చెవిరెడ్డి ప్రెస్‌మీట్లు పెట్టి సిట్ అధికారులను బెదిరిస్తూ కేసు దర్యాప్తునకు ఆటంకం కలిగించినట్లు సిట్ అధికారులు కోర్టుకు రిమాండ్ రిపోర్ట్ సమర్పించారు.



మురుగన్ భక్తులతో కలసి స్కంధ షష్టి కవచ పారాయణం చేస్తున్న పవన్ కల్యాణ్

# నేను నా మతాన్ని ప్రేమిస్తా..తప్పేమిటి?

### లౌకికవాదం ముసుగులో కొందరు హిందూమత ఆచారాలను వెక్కిరిస్తున్నారు

### మురుగ భక్తర్గళ్ మానాడు కార్యక్రమంలో డి.సిఎం పవన్

**విజయవాడ,జూన్23,ప్రభాతవార్తప్రతినిధి:** సజ్జనుడికి వచ్చే కోపం చాలా భయంకరంగా ఉంటుంది. నీతిగా, నిజాయతీగా జీవితాన్ని కొనసాగించే వారిని అమాయకులుగా భావించి దాడి చేస్తే ఫలితాలు తీవ్రంగా ఉంటాయి. ధర్మం కోసం నిలబడే ప్రతి అడుగు మనల్ని విజయ తీరాలకు చేరుస్తుంది అని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ అన్నారు. దేశంలో అత్యధికులు హిందువులే అయినా వారి ధర్మం గురించి వారు మాట్లాడకూడదు. ఆచారం మంటగలిపినా నోరెత్త కూడదు. నమ్మకం మీద వెక్కిరింతలు చేసినా గొంతు ఎత్తకూడదు. భావోద్వేగాలను రెచ్చగొట్టినా ఎదిరించకూడదు అంటే ఎలా అని ప్రశ్నించారు. మధురైలోని అమ్మతిడల్ ప్రాంగణంలో హిందూ మున్నాని సంస్థ నిర్వహించిన మురుగ భక్తర్గళ్ మానాడు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పవన్ కళ్యాణ్ గత రాత్రి పొద్దుపోయిన తరువాత ప్రసంగించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "లౌకిక వాదం ముసుగులో కొందరు హిందువుల మత ఆచారాలను వెక్కిరిస్తారు. ఇతర మతాల గురించి మాట్లాడేకంటే, హిందువుల ఆచారాలంటే వారికి ఎనలేని ఏహ్యత. ఈ దేశంలో ఏం జరిగినా హిందువులు నోరెత్తకూడదు అనేలా ప్రసంగాలు ఇస్తారు. దానికే సెక్యూలరిజం అని పేరు పెడతారు. ఇదేమీ తీరు. సెక్యూలరిజం అంటే ప్రత్యేకంగా హిందువులకే సంబంధించినది మాత్రమే కాదు. ఏ మతంలో తప్పు జరిగినా ప్రశించాలి. సూడో సెక్యూలరిస్టులకు మాత్రం కేవలం హిందువులు మాత్రమే కనిపించడం శోచనీయమన్నారు.ధర్మం అంటే దుష్ట శక్తులపై పోరాటం. అందరినీ సమానంగా చూడటమే ధర్మం. ఒక పార్టీ నాయకుడు మురుగ భక్తర్గళ్ మానాడు సభను తమిళనాడులో ఎందుకు చేస్తున్నారు? గుజరాత్ లేదా ఉత్తరప్రదేశ్ లో ఎందుకు చేయట్లేదు అని అడుగుతున్నాడు.? ఇది చాలా ప్రమాదకరమైన వాదన. ఎక్కడ ధర్మం దారి తప్పితే అక్కడే పోరాటం ఉంటుంది. కావాలనే ఉత్తరాదితో పోలుస్తూ సమస్యను పక్కదారి పట్టించడమే కాదు.. ప్రజల్లో విభజనవాదం తీసుకురావాలనే కుట్ర దీనిలో ఉంది. ఇలాంటి విభజన ఆలోచనలు ఉన్నవారు చాలా ప్రమాదం. ఇలాంటి వారు రేపు శివునిపై, అమ్మవారిపై కూడా ప్రశ్నలు వేస్తారు. దేశంలో ఎక్కడ ధర్మం దారి తప్పినా అక్కడ సంఘటితంగా పోరాడటం కచ్చితంగా చేయాల్సిన పని అన్నారు. మీనాక్షి అమ్మవారు కొలువైన పట్టణం మధురై. పార్వతీదేవి స్వరూపం అయిన మీనాక్షి అమ్మవారి ప్రసాదం మధురై. వేదాలకు నెలవైన భూమి మధురై. హిందువుల పవిత్రభూమి మధురై. అలాంటి గొప్ప భూమిలో ధర్మం కోసం నిలబడ్డట్టి, ఆ శివపార్వతుల పుత్రుడు మురుగన్ ఆశీస్సులతో ఈ గొప్ప కార్యక్రమానికి రావడం మరపురాని అనుభూతి అన్నారు.

**స్కంధ షష్టి కవచ పారాయణం చేసిన పవన్**

మధురై మీనాక్షి అమ్మ సాక్షిగా వేల్ మురగ.. వెట్రి మురుగా..శరణం శరణం..అంటూ మధురై అమ్మ తిడల్ ప్రాంగణంలో హిందూ మున్నాని సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన మురుగ భక్తర్గళ్ మానాడులో పవన్ కళ్యాణ్ వేల్ వేల్ మురుగ.. వెట్రి వేల్ మురుగ అంటూ నినదించారు. ఆద్యంతం భక్త జన సంద్రం జయ జయధ్వానాల మధ్య ఈ మహా సమ్మేళనం జరిగింది.

# సిఎం చంద్రబాబుకు ప్రొటోకాల్ తెలీదా?

>> విత్‌డ్రా చేసుకుంటామనే అధికారం ఏ ప్రభుత్వానికైనా ఉంటుందా? అది మీకైనా, నాకైనా?జడ్ ప్లస్ సెక్యూరిటీ ఉన్న ఒక మాజీ ముఖ్యమంత్రి ఎక్కడికైనా వెళ్తున్నప్పుడు, ఈ కార్యక్రమంపై తన కార్యాలయం ద్వారా ముందుగానే సమాచారం ఇస్తారు. అలా సమాచారం ఇచ్చిన తర్వాత ఏ ప్రభుత్వ పోలీసులు అయినా జడ్ ప్లస్ సెక్యూరిటీ ప్రొటోకాల్‌ను ఫాలో అయ్యి, ఆమేరకు సెక్యూరిటీని ఆ మాజీ ముఖ్యమంత్రికి కల్పించాలి. ఇది నాకైనా, మీకైనా ఒకటే. ఎవరి ప్రభుత్వం అధికారంలో ఉన్నా పాటించాల్సిన ప్రొటోకాల్.మరి జడ్‌ప్లస్ సెక్యూరిటీతో మాజీ ముఖ్యమంత్రి ఉంటే, తన ప్రోగ్రాంకు సంబంధించి రూట్‌మ్యాప్ ఇచ్చిన తర్వాత, పైలట్ వెహికల్స్, రోప్ పార్టీలు అన్నవి సెక్యూరిటీ ప్రోటోకాల్‌లో భాగమైనప్పుడు, మరి మీ రోప్ పార్టీల, జడ్ ప్లస్ సెక్యూరిటీ ఉన్న మాజీ ముఖ్యమంత్రి ప్రయాణం చేస్తున్న వాహనం చుట్టూ రోప్‌పట్టుకుని, ఎవ్వరూ వాహనంమీద పడకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఉండదా? మనుషుల తాకిడి ఎక్కువ ఉన్న పరిస్థితుల మధ్య అందుకే కదా జడ్‌ప్లస్ కేటగిరీ సెక్యూరిటీతో మాజీ ముఖ్యమంత్రి ప్రయాణంలో, ప్రొటోకాల్‌లో భాగంగా ఈ రోప్ పార్టీని,పైలట్ వాహనాలను పెట్టడానికి కారణం. మరి మీపైలట్ వెహికల్స్, అందులో సెక్యూరిటీ, రోప్‌పార్టీలను జడ్‌ప్లస్ సెక్యూరిటీ ఉన్న మాజీ ముఖ్యమంత్రి వాహనం చుట్టూ, ఇంతమంది ప్రజల తాకిడి ఉన్నప్పుడు, ఎందుకు లేరు. ఒకవేళ ఉండి ఉన్నమాట నిజమే అయితే మరి ఎవరైనా వెహికల్ కింద ఎలా పడగలుగుతారు? మరి ఏది వాస్తవం? మీరు సెక్యూరిటీ ఇవ్వలేదన్నదా, లేక వెహికల్ కింద ఎవరూ పడలేదన్నదా?జడ్ ప్లస్ భద్రత ఉన్న మాజీ ముఖ్యమంత్రికి బుల్లెట్ ప్రూఫ్ వాహనాన్ని కూడా గవర్నమెంటే ఇవ్వాలి, గవర్నమెంట్ డ్రైవరే ఆ వాహనాన్నిడ్రైవ్‌కూడా చేయాలి. ఇది ప్రొటోకాల్.

నేను సత్తెనపల్లి నియోజకవర్గం రెంటపాళ్ల గ్రామానికి చేరి, తిరిగి వచ్చేటప్పుడు దురదృష్టకర ఘటన జరిగిందని మా పార్టీ నాయకులు నాదృష్టికి తీసుకు వచ్చారు. వెంటనే ప్రత్తిపాడు మా పార్టీ ఇన్‌ఛార్జి బాలసాని కిరణ్, తర్వాత మాజీ మంత్రి అంబటి రాంబాబు సహా అప్పటికే మా పార్టీ నాయకులు ఆస్పత్రికి చేరుకున్నారని మా వాళ్లు చెప్పారు. వెంటనే నేను స్పందించి మరుసటి రోజుకూడా ఆ కుటుంబం దగ్గరకు వెళ్లాలని, కష్టంలో ఉన్న ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని, రూ.10లక్షల ఆర్థిక సహాయం చేయాలని ఆదేశాలు కూడా ఇచ్చాను. ఒక మనిషిని కోల్పోయిన కుటుంబంపట్ల చేతనైనంత మేర మా బాధ్యతను మేం నిర్వర్తించాం. అందులోనూ మరణించిన ఆ వ్యక్తి మా మనిషి, మమ్మల్ని అభిమానించే వ్యక్తి అయినప్పుడు ఆ బాధ్యత మరింత రెట్టింపు అవుతుంది. ఇదే పర్యటనలో గుండెపోటు కారణంగా ప్రాణాలు కోల్పోయిన మరో అభిమాని విషయంలోనూ ఇదే రీతిలో స్పందించాం. అయినా మా మీద విషప్రచారాలు చేస్తున్నారు. మానవత్వం గురించి, నైతికత గురించి మీరు పాఠాలు చెప్పడమే ఆశ్చర్యం?అయినా నేను చంద్రబాబుగారిని ప్రశ్నిస్తున్నా, మీ పర్యటనల సమయంలో, మీ మీటింగుల్లో చనిపోయిన వారి విషయంలో మీరు ఏం చేశారు? ఎంత చేశారు? ఎంత మేర చేశారు? మీరా మానవత్వం గురించి, నైతికత గురించి మాట్లాడేది? ఇప్పటికైనా మారండి! అంటూ జగన్ ట్వీట్‌లో పేర్కొన్నారు.

## వారం - వర్జ్యం

తేది : 24-06-2025, మంగళవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
జ్యేష్ఠ మాసం, ఉత్తరాయణం,
గ్రీష్మ ఋతువు, కృష్ణ పక్షం
చతుర్దశి రా. 7.01
రోహిణి మ. 12.55
వర్జ్యం సా. 6.00-7.27
దు.ఉ. 8.14-9.06, 2)రా. 11.58-12.50
రాహుకాలం - మ. 3.00-4.30

## వార్తాఫలం

**మేషం :** ప్రముఖులతో ఉత్తర ప్రత్యుత్తరాలు సాగిస్తారు. వృత్తి-వ్యాపారాలు విస్తరిస్తారు.

**వృషభం :** దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించుకుంటారు. మానసిక ప్రశాంతత పొందుతారు.

**మిథునం:** అనుకోని అతిథుల ద్వారా ముఖ్య విషయాలు తెలుసుకుంటారు. వస్తు సేకరణ.

**కర్కాటకం :** ముఖ్యమైన వ్యవహారాలలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు. ప్రయాణాలు.

**సింహం:** ఉద్యోగాలలో పదోన్నతులు పొందుతారు. భూ వివాదాలు తీరి లబ్ధిపొందుతారు.

**కన్య :** ఇంటాబయటా ప్రోత్సాహం లభిస్తుంది. సంతాన సాంకేతిక విద్యావకాశాలు పొందుతారు.

**తుల :** మిత్రులతో అకారణంగా విరోధాలు ఏర్పడతాయి. దీర్ఘకాలిక సమస్యలు వచ్చి మీదపడతాయి.

**వృశ్చికం:** చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి. శ్రమపడ్డా ఫలితం కనిపించదు.

**ధనుస్సు:** కుటుంబ సభ్యులను కలిసి కష్టసుఖాలను పంచుకొంటారు. నూతన వస్తుకొనుగోలు.

**మకరం:** బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు. శ్రమకోర్చి పనులు పూర్తిచేస్తారు.

**కుంభం:** భాగస్వామ్య వ్యాపారాలు ప్రారంభిస్తారు. ప్రముఖులనుండి ఆహ్వానాలు అందుతాయి.

**మీనం :** సంతానంనకు నూతన విద్యా, ఉద్యోగావకాశాలు పొందుతారు. సోదరుల కలయిక.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# కమిషనర్ జయరాం అవినీతిపై ఎసిబి విచారణ



**సాలూరు (విజయనగరం జిల్లా), జూన్ 23 ప్రభాతవార్త :** ఏసీబీ అధికారుల దాడులతో ఒక్కసారిగా పురపాలక సంఘం కార్యాలయం ఉద్యోగులు ఏం జరుగుతుందో తెలియక సోమవారం ఉదయం హడలెత్తిపోయారు. మున్సిపల్ కమిషనర్ సీపాన జయరాంకు ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నాయని ఫిర్యాదు రావడంతో ఏసీబీ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎంవిఎస్ నాగరాజు ఆధ్వర్యంలో అధికారులు మున్సిపల్ ఆఫీసులో తనిఖీలు చేపట్టారు. ఇదిలా ఉండగా జయరాం ఈనెల 13వ తేదీన కమిషనర్‌గా ఇక్కడ బాధ్యతలు తీసుకున్నారు. ఇదివరకు పనిచేసిన నందిగాం, విశాఖపట్నం అలాగే శ్రీకాకుళంలో ఏకకాలంలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించినట్లు సమాచారం. అందులో భాగంగా మున్సిపల్ కార్యాలయంలో తనిఖీలు చేపట్టిన అనంతరం ఏసీబీ అధికారి నాగ రాజు స్థానిక మీడియాతో మాట్లాడుతూ మాకు అందిన ఫిర్యాదు మేరకు ఇక్కడ తనిఖీలు నిర్వహించామన్నారు.అలాగే ప్రస్తుతం విచారణ జరుగుతుందని క్లారిటీ వచ్చిన తర్వాత మిగతా వివరాలు తెలియజేస్తామన్నారు. ఈ సోదాలలో ఏసీబీ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# జగన్‌కు రాజకీయ లబ్ధి తప్ప మనుషుల ప్రాణాలంటే లెక్క లేదా ! : హోంమంత్రి అనిత



**విజయవాడ,జూన్ 23,ప్రభాతవార్తప్రతినిధి:** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కావాలనే విద్వేషాలు రెచ్చగొడుతున్నారని ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత ధ్వజమెత్తారు. జగన్ వాహనం కింద ఓ వ్యక్తి పడిన ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. దయ, జాలి లేకుండా అతడ్ని ముళ్ల పొదల్లో పడేశారని హోంమంత్రి అనిత ఆవేదన వ్యక్తం చేశారు.సోమవారం సమాచార సమావేశ ప్రాంగణంలో హోంమంత్రి అనిత మీడియాతో మాట్లాడారు. జగన్‌కు సత్తెనపల్లి పర్యటన సందర్భంగా జడ్‌ప్లస్ సెక్యూరిటీ కల్పించామని స్పష్టం చేశారు. పరామర్శకు వెళ్తూ జగన్ రోడ్‌షో చేశారని ధ్వజమెత్తారు. ఉదయం పదిన్నరకు తాడేపల్లి నుంచి బయల్దేరిన జగన్.. సాయంత్రం 4 గంటలకు రెంటపాళ్ల చేరుకున్నారని తెలిపారు. జగన్ కావాలనే బలప్రదర్శన చేసుకుంటూ వెళ్లారని చెప్పుకొచ్చారు.. సింగయ్యను సమయానికి ఆస్పత్రికి తరలిస్తే బతికేవారని హోంమంత్రి అనిత అన్నారు. దళితుడు జగన్ కారు టైర్ కింద నలిగిపోయినా పట్టించుకోలేదని మండిపడ్డారు. జగన్‌కు రాజకీయ లబ్ధి తప్పించి మనుషుల ప్రాణాలంటే లెక్క లేదా అని ప్రశ్నించారు. జగన్ పర్యటనలో ఇద్దరు చనిపోయినా పర్యటన కొనసాగించారని ఫైర్ అయ్యారు. బెట్టింగ్‌లో అప్పులపాలై చనిపోయిన వ్యక్తికి విగ్రహం పెట్టించారని చెప్పుకొచ్చారు. తన పర్యటనలో ఇద్దరు చనిపోయినా జగన్ రెడ్డి ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. జగన్‌కు ఇంకా సీఎం కుర్చీలో కూర్చోవాలనే దురాశ ఉందని చెప్పారు. జగన్ వాహనం కిందపడే సింగయ్య నలిగిపోయినట్లు వీడియో ఉందని అన్నారు. సింగయ్య మృతిని వైసీపీ నేతలు నిస్సిగ్గుగా సమర్థిస్తున్నారని.. చనిపోయింది తమ పార్టీ కార్యకర్తేగా అని కొంతమంది నేతలు అంటున్నారని తెలిపారు. జగన్ రాజకీయ ముసుగులో ఉన్న నేరస్థుడని ఆరోపించారు. ప్రభుత్వం ఇచ్చిన బుల్లెట్ ప్రూఫ్ వాహనంలో జగన్ ఎందుకు వెళ్లట్లేదని ప్రశ్నించారు. జగన్ కావాలనే విద్వేషాలు రెచ్చగొడుతున్నారని ధ్వజమెత్తారు హోంమంత్రి అనిత.నాయకులు అనే వారు ఎంతో బాధ్యతగా ఉండాలి. పరిస్థితులు జగన్ వచ్చాక ఇంతగా దిగజారిపోయాయా అనిపిస్తోంది. హింసను చేస్తూ దాన్ని జగన్ సమర్థించుకుంటున్నారు. పొదిలిలో వైసీపీ అరాచకం చూశాం... ఆ వెంటనే రెంటపల్లె వెళ్తాం అన్నారు. వెంటనే మేము నోటీస్ ఇచ్చాం. ఇంతమందితోనే వెళ్లాలని చెప్పాం. పరామర్శకు వెళ్లే వ్యక్తి రోడ్ షో చేశారు. జగన్ నిర్లక్ష్యం కారణంగా సింగయ్య, రెడ్డి అనే వాళ్లు చనిపోయారు. అప్పటికీ కూడా ఇంకా సమర్థించుకోవడం దారుణం. ఆ వీడియో మార్ఫింగ్ అని కూడా ఫ్యాన్ పార్టీ నేతలు అంటున్నారు. ఇంత దారుణమా. మంత్రి నారా లోకేష్ పరామర్శకు వెళ్తే ఫొటో కూడా ఇవ్వరు... అది ఆయన రాజకీయ పరిణతి. మాజీ ముఖ్యమంత్రిగా ఉన్న జగన్‌కి బాధ్యత లేదా. వైసీపీ కార్యకర్త పేరుతో ఒక చేత్తో గొడ్డలి.. మరో చేత్తో వైసీపీ జెండా పట్టుకుంటారు.

కార్యకర్త ప్రదర్శించిన ప్లకార్డులు సినిమా డైలాగ్‌లు తప్పేముందని జగన్ సమర్థిస్తారా. సినిమాలో చెప్పిన డైలాగ్‌లు బయట నిజం చేస్తాం అంటే ఎలా. పరామర్శకు వెళ్లే వ్యక్తికి 7గంటల పాటు రోడ్ షో అవసరమా? పరామర్శను బలప్రదర్శనగా మార్చుకుంటారా? జగన్, అతని మనుషులు రాజకీయాలను దిగజారుస్తున్నారు.

# బాగా చదువుకున్నవారు రాజకీయాల్లోకి రావాలి

- మనల్ని రక్షించే సైనికులకు సెల్యూట్ చేయాలి
- మెరుగైన విద్యను అందించాలనే లక్ష్యంతో సైనిక్ స్కూల్‌ను ఏర్పాటుచేయడం ఆనందంగా ఉంది
- ఇంకొల్లులో డాక్టర్ డివిఆర్ సైనిక్ స్కూల్‌ను లాంఛనంగా ప్రారంభించిన మంత్రి లోకేష్




**సోమవారం బాపట్ల జిల్లా ఇంకొల్లులో డాక్టర్ డీవీఆర్ సైనిక్ స్కూల్‌ను ప్రారంభించిన అనంతరం ప్రసంగిస్తున్న మంత్రి లోకేష్. చిత్రంలో దగ్గుబాటి వెంకటేశ్వరరావు, పురందేశ్వరి తదితరులు**

**గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, జూన్ 23:** బాగా చదువుకున్నవారు రాజకీయాల్లోకి రావాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పిలుపునిచ్చారు. సోమవారం బాపట్ల జిల్లా ఇంకొల్లు గంగవరం రోడ్డులో మాజీ మంత్రి డాక్టర్ దగ్గుబాటి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నెలకొల్పిన డాక్టర్ డీవీఆర్ సైనిక్ స్కూల్‌ను మంత్రి లోకేష్ ప్రారంభించారు. తొలుత సైనిక్ స్కూల్ ప్రధాన భవనంతో పాటు కంప్యూటర్, సైన్స్ ల్యాబ్, బాలబాలికల వసతి సముదాయం, క్యాంటీన్, మెస్ భవనాలను డీవీఆర్ సైనిక్ స్కూల్ సెక్రటరీ, కరస్పాండెంట్ హితేష్ చెంచురామ్ తో కలిసి మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటుచేసిన దగ్గుబాటి చెంచురామయ్య, దగ్గుబాటి నీలమోహన్ విగ్రహాలను మంత్రి ఆవిష్కరించారు. గురువులను దేవుడితో సమానంగా గౌరవించాలన్నారు.ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ, 'గురుబ్రహ్మ, గురువిష్ణు, గురుదేవో, మహేశ్వరహ:' అంటారని, పుట్టిన దగ్గర నుంచి చనిపోయే వరకు మన జీవితంలో గురువులు కీలకపాత్ర వహిస్తారన్నారు. తాను పదో తరగతి వరకు భారతీయ విద్యాభవన్ లో చదివానని, నాడు ఉన్న మా ఉపాధ్యాయులు, ఇంటర్ లిటిల్ ఫ్లవర్ లో చదివినప్పుడు ఆనాడు ఉన్న అధ్యాపకులు ,మా గురువుగా ఉన్న ప్రొఫెసర్ రాజ్ రెడ్డి ఇప్పుడు కూడా నా జీవిత ప్రయాణంలో ఎంతోమంది గురువులు నాకు సలహాలు, సూచనలు ఇస్తుంటారని తెలిపారు. అందుకే గురువులను దేవుడితో సమానంగా గౌరవించాల్సిన బాధ్యత మనందరిపై ఉంటుందన్నారు. అందరం తల్లులను గౌరవించాలి, ఇల్లు దాటే ముందు వారి ఆశీర్వాదం తీసుకోవాలన్నారు.మన జీవితంలో అన్ కండి షనల్‌గా మనల్ని ప్రేమించేది మన తల్లి అని పేర్కొన్నారు. నేడు డాక్టర్ దగ్గుబాటి వెంకటేశ్వరరావు సుందర్ పిచాయ్ గురించి చెప్పారని, నేను నిజంగానే ఆశ్చర్యపోయానని అని మంత్రి లోకేష్ వ్యాఖ్యానించారు. సుందర్ పిచాయ్ కోసం ఆయన తల్లి ఎన్నో త్యాగాలు చేశారని, తల్లుల త్యాగల వల్ల మనం చదువుకోగలుగుతున్నామని అన్నారు. తల్లుల త్యాగాల వల్ల మనం ఈ రోజు ఈ స్థాయికి వస్తున్నామని, అందుకే మనం తల్లులను గౌరవించాలన్నారు. పేదరికం నుంచి బయటకు రావాలంటే అద్భుతమైన విద్యను అందించాలని పేర్కొన్నారు. ఇవాళ తనకు చాలా ఆనందంగా ఉందని, డాక్టర్ వెంకటేశ్వరరావు నాయకత్వంలో ఇవాళ ఈ సైనిక్ స్కూల్ ను ఏర్పాటుచేసి మారుమూల ప్రాంతానికి ఏకంగా ఒక సైనిక్ స్కూల్‌ను తీసుకురావడం జరిగిందన్నారు.తాను బలంగా నమ్మేది పేదరికం నుంచి బయటకు రావాలంటే అద్భుతమైన విద్యను అందించాల్సిన అవసరం ఉందని తెలిపారు. విద్యతోనే మన జీవితాల్లో అద్భుతమైన మార్పులు వస్తాయని పేర్కొన్నారు. నాడు విజనరీ వ్యక్తి దగ్గుబాటి వెంకటేశ్వరరావు తండ్రి దగ్గుబాటి చెంచురామయ్య విద్య శక్తి ఏంటో తెలుసుకుని 1980ల్లోనే అద్భుతమైన విద్యాసంస్థలను ఏర్పాటుచేశారన్నారు. ఇంటర్, డిగ్రీ, పీజీ కాలేజీలను ఏర్పాటుచేసి నిరుపేద కుటుంబాల పిల్లలకు ఆనాడు నాణ్యమైన విద్యను అందించడం జరిగిందని తెలిపారు. ఈ రోజు ఆయన వారసత్వాన్ని కొనసాగించేందుకు పెదనాన్న దగ్గుబాటి వెంకటేశ్వరరావు, పెద్దమ్మ దగ్గుబాటి పురందేశ్వరి , తమ్ముడు హితేష్, చెల్లి నివేదిత పేరిట అద్భుతమైన స్కూల్స్ ను ఏర్పాటుచేశారన్నారు.

# నలుగురు ఎర్రచందనం దొంగలు అరెస్ట్

## కారు సహా 15 దుంగలు సీజ్

**చంద్రగిరి, జూన్ 23 ప్రభాతవార్త:** శ్రీవారిమెట్టు మార్గంలో అక్రమంగా ఎర్రచందనం తరలిస్తున్న నలుగురు ఎర్రదొంగలను సోమవారం టాస్క్‌ఫోర్స్ బలగాలు అరెస్ట్ చేశారు. టాస్క్‌ఫోర్స్ హెడ్ ఎల్.సుబ్బరాయుడు కార్యాచరణలో భాగంగా టాస్క్‌ఫోర్స్ ఎస్పీ పి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో డిఎస్పీ జె.బాలిరెడ్డి పర్యవేక్షణలో ఆర్ఐ సాయి గిరిధర్‌కు చెందిన ఆర్ఎస్ఐ సి.వినోద్‌కుమార్ టీమ్ ఆదివారం రాత్రి శ్రీవారిమెట్టు మార్గంలో వాహనాలు తనిఖీలు చేపట్టారు. సోమవారం వేకువజామున ఒక కారులో ఎర్రచందనం అక్రమంగా తరలిస్తూ పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేసినట్లు తెలిపారు.

దీంతో అప్రమత్తమైన టాస్క్‌ఫోర్స్ బలగాలు చుట్టుముట్టి కారును నిలువరించి నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు. నిందితుల నుండి కారుతో సహా 15 ఎర్రచందనం దుంగలను సీజ్ చేశారు. సిఐ సురేష్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ప్రత్యేక హోదాను పుణ్యక్షేత్రం తిరుపతిలో ప్రకటించారు - అమలుకు ఎందుకు నిలదీయరు?

## కాంగ్రెస్ పార్టీ సమావేశంలో షర్మిలారెడ్డి

**శ్రీకాళహస్తి,జూన్ 23 ప్రభాతవార్త** 'ఎన్నికల ముందు నాటి నేటి ప్రధానమంత్రి నరేంద్రమోడీ కలియుగ దైవం సన్నిధిలో నిర్వహించిన బహిరంగ సభలో 'ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కల్పిస్తామని' ప్రకటించారని 11 ఏళ్ళు దాటిని ఎందుకు ఆచరణకు ప్రకటించలేదని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు షర్మిలా రెడ్డి ప్రశ్నించారు. శ్రీకాళహస్తిలో సోమవారం తిరుపతిజిల్లా కాంగ్రెస్‌పార్టీ సమావేశం ఏర్పాటు చేసారు.ఈ సందర్భంగా



ఆమె మాట్లాడుతూ నేడు ప్రజల పక్షాన పోరాడేది, ప్రజల పక్షాన నిలిచేది ఒక్క కాంగ్రెస్ పార్టీ మాత్రమే అని వివరించారు. పార్టీని బలోపేతం చేసుకోవటానికి వివిధ ప్రాంతాల్లో నాయకులు,కార్యకర్తల మధ్య సమన్వయం చేయటానికి రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తున్నానని ఆమె వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అయ్యిందని అయితే ఇటు ముఖ్యమంత్రి, అటు ఉప ముఖ్యమంత్రి కేంద్రంలో బిజెపికి దాసోహం అంటూ మోదీ భజనకే పరిమితమయ్యారన్నారు.పార్టీని బలోపేతం చేసుకోవటం ఎలా అని కార్యకర్తల అభిప్రాయాల సేకరణకు వచ్చానని వివరించారు.రాష్ట్రంలో రాజకీయ పరిస్థితి దారుణంగా ఉందన్నారు. రాష్ట్రంలో పోలీసుల తీరు అగమ్యగోచంగా మారిందన్నారు. ఇటీవల జరిగిన కొన్ని సంఘటలనకు సంబందించి షర్మిలారెడ్డి మాట్లాడుతూ పోలీసులు తాము ప్రజా సమస్యలపై దీక్ష చేస్తే భగ్నం చేస్తారు. ఆందోళన అంటే హౌస్ అరెస్టు చేస్తారు.కానీ మాజీ సిఎం జగన్మోహన్‌రెడ్డి బలప్రదర్శనకు అనుమతిస్తారు.ఆయన జనంపై కారు నడిపితే పట్టంచుకోరు, అధికారంలో ఉన్నపుడు పరదాల మాటున జనానికి కనబడని జగన్మోహన్‌రెడ్డి నేడు అధికారం కొల్పొయి జనసమీకరణ,బలప్రదర్శనలకు పాల్పడుతుంటే ఎందుకు ప్రభుత్వం అనుమతిస్తుందని షర్మిలా రెడ్డి ప్రశ్నించారు. ఈ అంశాలపై ప్రభుత్వాని నిలదీయాల్సి ఉందన్నారు. ఇలాంటి సభలకు ప్రభుత్వం అనుమతించరాదన్నారు. గత కొంత కాలంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో ప్రాభవం కొల్పొయింది. దానిని మళ్ళీ పూర్వ వైభవం తీసుకురావటానికి కృషి చేస్తున్నామన్నారు.

# శిక్షణ కార్యక్రమాల ద్వారా యువతకు ఉద్యోగాలు

## 20 సూత్రాల కార్యక్రమం ఛైర్మన్ లంకా దినకర్

**సచివాలయం,జూన్23,ప్రభాతవార్త:** రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు తగిన శిక్షణా కార్యక్రమాలు నిర్వహణ ద్వారా వివిధ రంగాల్లో పెద్దఎత్తున ఉపాధి అవకాశాలను కల్పించేందుకు పరిశ్రమలు, ఎంఎస్ఎంఇ,సీడాప్ సంస్థలు సమన్వయంతో పని చేయనున్నాయి.సోమవారం రాష్ట సచివాలయంలో 20 సూత్రాల కార్యక్రమం ఛైర్మన్ లంకా దినకర్,ఎంఎస్ఎంఇ ఛైర్మన్ శివ శంకర్,సీడాప్ ఛైర్మన్ దీపక్ రెడ్డిలు సంయుక్తంగా మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా 20 సూత్రాల కార్యక్రమం ఛైర్మన్ లంకా దినకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తయిందని ఏడాది కాలంలో రాష్ట్రానికి 9లక్షల 30 వేల కోట్ల రూ.ల విలువైన పెట్టుబడులు వచ్చాయని గుర్తు చేశారు.ఐదేళ్ళలో 20 లక్షల మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాల కల్పనే లక్ష్యంగా ఈప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. అందుకు అనుగుణంగా చిన్న,మధ్యతరహా పరిశ్రమలు,ఎంఎస్ఇల ప్రోత్సా హానికి పెద్ద ఎత్తున చర్యలు తీసుకుంటోందని దానిలో భాగంగానే ఈజ్ ఆఫ్ డూయింగ్ నుంచి స్పీడ్ ఆఫ్ బిజినెస్ వైపు అడుగులు పడుతున్నాయన్నారు.ఇప్పటి వరకూ ఉద్యోగాల కల్పనకు కృషి చేయాల్సిన ఆయా విభాగాల మధ్య సరైన సమన్వయం,సమాచార లోపం కొరవడిందని ఆలోపాన్ని సరిదిద్దేందుకు ఇకపై పరిశ్రమలు,ఎంఎస్ఎంఇ,సీడాప్ వంటి విభాగాలు సమచారాన్ని పరస్పరం పంచుకోవడం తోపాటు సమన్వయంతో పని చేసేందుకు ముందుకు వచ్చాయని అన్నారు.ఇందుకు సంబంధించి ఎంఎస్ఎంఇ,సీడాప్,ప్రణాళికా విభాగాల అధికారులతో సచివాలయంలో ఆయా సంస్థల ఛైర్మన్ లు,అధికారులతో సమీక్షించామని చెప్పారు. ఈసమావేశంలో ముఖ్యంగా వెనుకబడిన జిల్లాల్లో యువతకు ఉపాధి శిక్షణ ద్వారా ఏవిధంగా ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే దానిపై ముగ్గురు ఛైర్మన్ లు చర్చించామని అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు 8 లక్షలకు పైగా ఎంఎస్ఎంఇలు ఉన్నాయని తెలిపారు. దేశ జిడిపిలో 30 శాతం మరియు ఎగుమతులలో 40 శాతం వాటా ఎం ఎస్ ఎం ఈ ద్వారా సమకూరుతుందని ఛైర్మన్ లంకా దినకర్ పేర్కొన్నారు. వికసిత్ భారత్ లో భాగంగా స్వర్ణాంధ్ర 2047 విజన్ లక్ష్య సాధనలో సూక్ష్మ,చిన్న,మధ్య తరహా పరిశ్రమలు కీలకపాత్ర పోషించనున్నాయని స్పష్టం చేశారు.అందుకే ఎంఎస్ఎంఇలను పునర్ వ్యవస్థీకరించడంతో పాటు మరింత పటిష్టీకరించాల్సిన ఆవశ్యకత ఉందని దీనిపై ముఖ్యమంత్రి వర్యులకు ఒక నివేదికను సమర్పించనున్నట్టు తెలిపారు.కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పియం విశ్వకర్మ,పియం ఇజిపి కార్యక్రమాల్లో 18 రకాల పథకాలు అమలు చేస్తున్నారని వాటిని రాష్ట్రానికి తీసుకురావడం ద్వారా నిరుద్యోగ యువతకు ఏవిధంగా మెరుగైన ఉపాధి అవకాశాలను కల్పించాలనే దానిపై కూడా విస్తృతంగా చర్చించినట్టు పేర్కొన్నారు.విజయవాడ,విశాఖపట్నం నగరాల్లోని పలు వర్తక సంఘాల అభిప్రాయాలను కూడా తీసుకున్నామని ఆవిషయాలను కూడా సియం దృష్టికి తీసుకువెళ్ళ నున్నామని ఛైర్మన్ లంకా దినకర్ పేర్కొన్నారు.

# అనారోగ్యంతో నీరసపడిన వల్లభనేని వంశీ

**విజయవాడ,జూన్ 21,ప్రభాతవార్త ప్రతినిధి:** గన్నవరం మాజీ ఎంఎల్ఏ వైకాంగ్రెస్‌పార్టీ నేత వల్లభనేని వంశీ గత నాలుగు రోజులుగా కొత్త ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. నాలుగురోజుల కితం ఆయన్ను జిల్లా జైలు అధికారులు ఇక్కడికి తీసుకువచ్చారు. శనివారం నాటికి వంశీ ఆరోగ్యం కుదటపడినా మళ్ళీ విరేచనాలవడంతో నీరసంగా ఉన్నారు. పోలీసు ఎస్కార్ట్ నడుమ ఆస్పత్రిలో ఆయనకు చికిత్స అందిస్తున్నారు.

వంశీ ప్రస్తుతం కొంత కుదుటపడినట్లు వైద్యవర్గాల సమాచారం.ఈ క్రమంలో వంశీని వైద్యబృందం పర్యవేక్షించి సోమవారం సాయంత్రానికి డిశ్చార్జి చేసే అవకాశం ఉందని పోలీసులకు సమాచారం ఇచ్చింది.

# శ్రీశైలంలో తుపాకీ బుల్లెట్ల కలకలం

**శ్రీశైలంప్రాజెక్టు,జూన్23,ప్రభాతవార్త** నంద్యాల జిల్లా శ్రీశైలం నియేజకవర్గం శ్రీశైలం మండలం శ్రీశైల మహాపుణ్యక్షేత్రంలో సోమవారంనాడు తుపాకీ బుల్లేట్లు కలకలం రెపాయి.క్షేత్రంలో వాసవీ త్రం రోడ్డు డివైడర్‌పై గుర్తు తెలియని వ్యక్తులు కవర్లో వదిలివెళ్లారు.ఈ విషయంను పారిశుద్య కార్మికులు గమనించడంతో విషయం బయటకు తెలిసింది.పోలిసులకు సమాచారం తెలియడంతో వెంటనే ఒకటవ పట్టణ పోలిసుల అక్కడికి హుటాహుటిన చేరుకోని పరిశీలించారు. లభ్యమైన వాటిలో 9పెద్ద సైజు బుల్లేట్స్,4చిన్న సైజు బులేట్స్ దోరికాయి.అదే విధంగా అక్కడ ఒక ఎర్రటి గుడ్డ,నాలుగు వంకయ బాంబులు,ఎస్ఎల్ఆర్ తుపాకీ కవరు కూడా ఉన్నాయి.వీటిని అన్నింటిని ఒకటవపట్టణ పోలిసులు స్వాదీనం చేసుకున్నారు.ఈ విషయంపై టుటౌన్ సిఐ చంద్రబాబునాయుడు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయడం జరుగుతుంది. లభ్యమైన వాటిని జిల్లా ఉన్నాతాదికారులకు సమాచారం అందిచండం జరుగుతుంది. శ్రీశైలక్షేత్రంలో ప్రమాదకరమైన వంటివి లభ్యం కావడంతో స్థానికులు ఉల్లికిపడినంతపనైంది.

# 12 పెళ్లిళ్లు చేసుకున్న నిత్య పెళ్లి కూతురిపై పోలీసులకు ఫిర్యాదు

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, జూన్ 23( ప్రభాతవార్త ):** 12 పెళ్లిళ్ల చేసుకున్న నిత్య పెళ్లి కూతురిపై అంబేద్కర్ కోనసీమజిల్లా ఎస్పీ కృష్ణారావుకు సోమవారం బాధితులు ఫిర్యాదు చేశారు. రామచంద్రపురం గ్రామానికి చెందిన బేతి వీర దుర్గ నీలిమ, ఆమె తల్లి బేతి వీరలక్ష్మి ్మ, రామకృష్ణ, కళ్యాణ్ లు ఆర్థిక స్థిరత్వం కలిగి విడాకులు తీసుకున్న పురుషులను టార్గెట్ గా చేసుకుని మోసం చేస్తున్నారు. సెక్షన్ 498 కేసులు ఎదుర్కొంటున్న పురుషులు వీరు చేసిన మోసాలకు బలవుతున్నారు. విడాకులు తీసుకుని డిప్రెషన్ లో ఉన్న పురుషులకు మాయ మాటలు చెప్పి వివాహం వరకు తీసుకువెళతారు. ఈ లోపు వారి నుండి అందినకాడికి డబ్బును దోచుకుంటారు. బాధితులు తిరగబడితే తప్పుడు కేసులు పెట్టి వేధించే వారన్నారు. ఈ విధంగా రాష్ట్రంలోని పలు జిల్లాలకు చెందిన 12 మంది పురుషులను మోసం చేసి లక్షల్లో డబ్బులు వసూలు చేసుకుని పరార య్యారు. ఇటీవల నిత్య పెళ్ళి కూతురు దుర్గా నీలిమపై కేసు లు నమోదు కావడంతో బాధితులు వస్తున్నారు.

# మోటార్ సైకిల్‌ను ఢీకొన్న వ్యాన్ - యువకుడు మృతి

**కోవూరు (నెల్లూరు), జూన్ 23, ప్రభాతవార్త :** కోవూరు మండలం జమ్మిపాలెం వద్ద ఆదివారం అర్థరాత్రి నెల్లూరు వైపు నుంచి జమ్మిపాలెంకు వస్తున్న మోటార్ సైకిల్‌ను.. జమ్మిపాలెం నుంచి వస్తున్న మినీ వ్యాన్ వేగంగా ఢీకొంది. ఈ సంఘటనలో నెల్లూరులోని ఓ ప్రైవేట్ వస్త్ర దుకాణంలో పనిచేస్తున్న ఎం. సుధీర్‌కుమార్ (35) తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందారు. ఐదు నిమిషాలైతే సుధీర్‌కుమార్ ఇంటికి వెళ్లేవారు. కేవలం ఈ మినీ వ్యాన్ అతి వేగంగా రావడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుందని ప్రత్యేక సాక్షులు తెలిపారు. జమ్మిపాలెం ప్రాంతం నుంచి అర్థరాత్రి వేల మోటార్లు, పైపులు వేసుకువస్తున్న ఈ వాహనం మోటార్ సైకిల్‌ను డీకొనడంతో ఈ పరిస్థితి నెలకొంది. ఈ మేరకు సమాచారం తెలుసుకున్న కోవూరు ఎస్సై రంగనాథ్ మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

# రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా వైఎస్సార్సీ అధికారంలోకి వస్తుంది : సజ్జల రామకృష్ణారెడ్డి

**విజయవాడ, జూన్23, ప్రభాత వార్తప్రతినిధి:** రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినప్పటికి వైఎస్సార్‌సీపీనే అధికారంలోకి వస్తుం దని ఆ పార్టీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి అన్నా రు. వైకాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో సోమవారం పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర కమిటీ సభ్యులు,



**వైకాంగ్రెస్‌పార్టీ పంచాయతీరాజ్ విభాగ సమావేశంలో ప్రసంగిస్తున్న సజ్జల రామకృష్ణారెడ్డి**

జిల్లా, అసెంబ్లీ విభాగ అధ్యక్షులు, ఇతర ముఖ్య నాయకులు సమావేశం జరిగింది.ఈ సమావేశంలో పార్టీ పంచాయతీరాజ్ విభాగం చేపట్టాల్సిన కార్యాచరణపై సజ్జల మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ స్టేట్ కోఆర్డినేటర్ శ్రీ సజ్జల రామకృష్ణారెడ్డి లో క్రియాశీలక విభాగంలో ఉన్న మీ అందరి పాత్ర చాలా కీలకమైంది, గతంలో మనకు అసెంబ్లీ ఎన్నికలకు మించి స్ధానిక సంస్ధల ఎన్నికల్లో ప్రజలు పట్టం కట్టారు, అందరూ సమిష్టిగా పనిచేయడం వల్ల అరుదైన విజయం సాధించాం, పంచాయతీరాజ్ విభాగంను బలోపేతం చేయాలని జగన్‌చెప్పారు, మీ విభాగం బలోపేతం అయినప్పుడే మనకు స్ధానిక సంస్ధల్లో బలంగా ఉండగలుగుతాం, ప్రజలకు, పార్టీకి ఉపయోగపడేలా మీ నాయకత్వం పటిష్టం కావాలి. ఇందులో భాగంగానే ఈ సమావేశాలు నిర్వహిస్తున్నాం. పంచాయతీరాజ్ చట్టాన్ని బలోపేతం చేసేందుకు మీరంతా చొరవ తీసుకోవాలి. రాష్ట్ర అభివృద్ధి జరగాలంటే గ్రాస్ రూట్ లెవల్‌లో బలంగా ఉండాలి.కూటమి ప్రభుత్వం తప్పుడు కేసులు, కక్షసాధింపు చర్యలు, వేధింపులు, రెడ్‌బుక్ రాజ్యాంగం ఇలా ఎన్ని రకాలుగా ఇబ్బందులు పెట్టినా ఏపీలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా వైఎస్సార్సీపీ రికార్డు మెజార్టీలతో గెలుస్తుంది, ప్రజల్లో, పార్టీ క్యాడర్ లో ఇదే చర్చ జరుగుతోంది. చంద్రబాబు సంక్షేమ పథకాలు అమలుచేయడం లేదు, లా అండ్ ఆర్డర్ పూర్తిగా నాశనం అయింది, సామాన్యులు కూడా బలవుతున్నారు, గవర్నెన్స్ పూర్తిగా భ్రష్టుపట్టింది, మళ్ళీ గెలవలేమన్న భయంతో కూటమి నేతలు ఎవరి స్ధాయిలో వారు అడ్డంగా దోచుకుంటున్నారు, ఈ ఏడాదిలో 1.67 లక్షల కోట్ల అప్పులు చేసింది కూటమి ప్రభుత్వం, అమరావతిలో 40 వేల ఎకరాలు చాలవన్నట్లు మరో 40 వేల ఎకరాల భూములు లాక్కునే ప్రయత్నం జరుగుతోంది. మొబిలైజేషన్ అడ్వాన్స్ పేరుతో దోపిడీ నేరుగా పదిశాతం కమిషన్ తీసుకుంటున్నారు,

వేలకోట్లు దోచుకోవడం లక్ష్యంగా ప్రజల ఆకాంక్షలు, కోరికలతో సంబంధం లేకుండా పాలన సాగుతోంది, కూటమి ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీల అమలుపై ప్రజలే నిలదీసేలా మన కార్యాచరణ ఉండాలి, అందుకు ప్రజలను అప్రమత్తం చేద్దాం.

# ఫేక్ వీడియో ఆధారంగా జగన్‌పై కేసు పెడతారా? :మాజీ మంత్రి రోజా



**విజయవాడ,జూన్23,ప్రభాతవార్తప్రతినిధి:** సింగయ్య అనే వ్యక్తి ఏపీ మాజీ సీఎం జగన్ కాన్వాయ్‌లో వాహనం వెనుక చక్రం కిందపడి మృతి చెందారు.ఈ ఘటనపై వెలుగులోకి వచ్చిన ఒక వీడియో ఆధారంగా మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డిపై కేసు నమోదైంది. ఇందుకు కారణమైన ఘటనకు సంబంధించిన వీడియోపై మాజీ మంత్రి ఆర్కే రోజా స్పందించారు.ఆమె వైకాంగ్రెస్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ జగన్‌కు వస్తున్న జనాదరణ చూసి తట్టుకోలేక అక్రమ కేసులు పెడుతున్నారని ఆమె అన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ డైవెర్షన్ పాలిటెక్స్ చేస్తున్నారు. కక్ష్య సాధించడంలో భాగమే ఈ కేసు పెట్టారంటూ ఆమె అన్నారు. జగన్‌పై కేసు పెట్టడానికి ఒక ఫేక్ వీడియోను బయటకు వదిలారు. ఒక ఫేక్ వీడియోను వదిలి వైకాంగ్రెస్ పార్టీని భయపెట్టాలని చూస్తున్నారని ఆమె అన్నారు.అయితే,సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతున్న వీడియో...ఫేక్ వీడియో అని, అది ఎక్కడైనా వెళ్ళి టెస్ట్ చేసుకోమనండి అంటూ పేర్కొన్నారు. 18వ తేదీన ఘటనలో సింగయ్య మృతి ప్రమాదం జగన్ కారు వల్ల కాదని ఎస్పీ అన్నారని, కానీ 22వ తేదీన ఎస్పీ ఓ ఫేక్ వీడియో బయటకు తెచ్చి జగన్ కారు గుద్దిందంటూ ఒక కట్టుకథ అల్లుతున్నారని పేర్కొన్నారు. నాలుగు రోజుల పాటు ఇంటెలిజెన్స్ ఏం చేస్తుంది...?నిద్ర పోతుందా...? అంటూ కీలక వ్యాఖ్యలు చేశారు. పోలీసులు దగ్గర లేని వీడియో బయటకు ఎలా వచ్చిందని ఆమె ప్రశ్నించారు.ఆ వీడియో వెనుక చంద్రబాబు, లోకేష్, పవన్ ఉన్నారని, అధికారంలో ఉన్నారు కాబట్టి భయపెట్టి కేసులు పెడుతున్నారని రోజా మాట్లాడారు. ఒక వ్యక్తి పడిపోతే తొక్కించుకు వెళ్ళేంత మూర్ఖుడు, గుండె లేని వ్యక్తి జగన్ కాదని, తారకరత్న చనిపోయినా పాదయాత్ర చేసినా వ్యక్తి లోకేష్ అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. గోదావరి పుష్కరాల్లో,సింహాచలం,తిరుపతి,కందూరు లో వీళ్ళు ఎంత మంది చంపేశారు... దానిపై చంద్రబాబు పై ఎన్ని కేసులు పెట్టాలి అంటూ రోజా ఘాటు వ్యాఖ్యలు చేసారు..గేమ్ ఛేంజర్ సినిమా ఫంక్షన్‌లో ఇద్దరు చనిపోయారు. దానికి పవన్‌పై కేసు పెట్టాలి. పి-4 పథకంలో మొదట చంద్రబాబు,లోకేష్,పవన్ భార్యలు వారి ఆస్థులను ప్రజలకు పంచాలి. అప్పుడు మిగిలిన వారికి కూడ నమ్మకం వస్తుందని అన్నారు. నిరుద్యోగ భృతి ఇస్తామంటూ కూటమి ప్రభుత్వం మోసం చేసిందని, ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అబద్దాలు చెప్పడమే పిగా పెట్టుకున్నారని ఆమె పేర్కొన్నారు.

# యుపిఎస్ పెన్షన్ ఆప్షన్ల గడువు సెప్టెంబరు వరకు పొడిగింపు

**గుంతకల్లు రైల్వే, జూన్ 23,ప్రభాతవార్త** కేంద్రప్రభుత్వం కొత్తగా అమలు చేయబోతున్న ఏకీకృత పెన్షన్ పథకం (యూపిఎస్)లో చేరాలనుకునే రైల్వే సిబ్బంది తమ ఆప్షన్స్ ఫారాలను సెప్టెంబరు 30లోగా తాము పనిచేస్తున్న కార్యాలయాల్లో అందచేయాలని రైల్వే వర్గాలు తెలిపాయి. కేంద్ర ప్రభుత్వంలోని వివిధ మంత్రిత్వ శాఖలలో పనిచేస్తున్న 23లక్షల మంది సిబ్బంది వారు పొందే వేతనంలో యాభై శాతం పెన్షన్‌గా పొందే కేంద్రప్రభుత్వ ఏకీకృత పెన్షన్ (యనిఇఫైడ్ పెన్షన్ పథకం) పథకాన్ని అమలు చేసే క్రమంలో ఈ నెల 30లోగా తమ ఆప్షన్స్ ఫారాలను ఇవ్వాలని ఆదేశించిన విషయం తెలిసిందే.

అయితే వివిధ వర్గాల నుంచి కేంద్రప్రభుత్వానికి వచ్చిన విజ్ఞప్తులను దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వ, రైల్వే సిబ్బంది తాము ఎన్‌పిఎస్‌లోనే కొనసాగుతారా?లేక కొత్తగా అమలు లోకి వచ్చిన యూపిఎస్ పథకంలో చేరుతారా అనే అంశాలపైనే తుది నిర్ణయం తీసుకోవాలని సూచించారు.

# దుర్గమ్మ ఆలయంలో 2047 విజన్ డాక్యుమెంట్ అమలు: మంత్రి ఆనం

**ఇంద్రకీలాద్రి, జూన్ 23, ప్రభాతవార్త** 2047 విజన్ డాక్యుమెంట్ అమలులో దుర్గమ్మవారి ఆలయం చేరుతుందని ఆ మేరకు ఆలయంలో ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం ఇంద్రకీలాద్రి మహామండపంలో మంత్రి అధ్యక్షతన జరిగిన సమీక్షలో ఎంపి కేశినేని శివనాథ్, దేవదాయ శాఖ కార్యదర్శి వి వినయ్‌చందర్, కమీషనర్ రామచంద్ర మోహన్ లు పాల్గొన్నారు. ఈ సమీక్షలో మంత్రి మాట్లాడుతూ ఆలయంలో వున్న అన్ని సమస్యల పరిష్కారానికి మాస్టర్‌ప్లాన్ అమలు చేస్తామన్నారు. ఇంద్రకీలాద్రి అభివృద్ధికి ఎంపి కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే సుజనా చౌదరి పెద్దఎత్తున విశేష ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. త్వరలో మాస్టర్‌ప్లాన్ అమలుపై పూర్తిస్థాయి సమీక్ష నిర్వహిస్తామన్నారు. ఇపుడు జరుగుతున్న అభివృద్ధి పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇంద్రకీలాద్రి అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు చరిత్రలో నిలిచి పోతాయన్నారు. 50 సంవత్సరాల వరకు తిరిగి చూసే పనిలేకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. త్వరలో కేంద్రం అమలు చేస్తున్న ప్రసాదం పథకంపై శుభవార్త వింటామన్నారు. ఈ సందర్భంగా ఆలయాభివృద్ధికి స్థానిక ఎమ్మెల్యే సుజనా చౌదరి రూపొందించిన డిపిఆర్ తో పాటు దేవదాయ శాఖ తయారు చేసిన డిపిఆర్‌ను పరిశీలిస్తున్నామని త్వరలో మాస్టర్‌ప్లాన్ అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఇవో వికె శీనా నాయక్ పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఆలయాభివృద్ధిని వివరించారు. కార్యక్రమంలో పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

వార్త

మితభోజనం వల్ల తిండిపోతు అనేందుకు ఆస్కారం లేకపోవడం, ఆరోగ్యం, ఆయుష్షు, బలం, సుఖం, మంచితనం అనే ఆరు గుణాలు లభిస్తాయి.

-ప్లినీ

# భాషా వైవిధ్యమెందుకు?


భాషా వైవిధ్యాల,వైరుధ్యాల కొలిమి నుంచి బయటపడడానికి అప్పటి ప్రభుత్వాలు భాషా ప్రయుక్త రాష్ట్రాలను ఏర్పాటు చేసి కాస్త ఊపిరి పీల్చుకున్నాయి. రానురాను స్వభాషల మీద ఎంత మమకారమున్నా పరాయి భాష ఇంగ్లీష్‌ను మరచిపోలేని పరిస్థితి తలెత్తింది. ఇప్పటికీ ఆంగ్ల భాషా వ్యామోహాన్ని వదిలించుకోలేని పరిస్థితి ఉంది. మాతృ భాషలో చదివితే మంచి చదువులు అబ్బుతాయన్న గ్యారంటీ ఏమి ఉండదనే వాదన ఉంది. ఆంగ్ల భాషను బ్రిటిష్ వారు వదిలి వెళ్ళారనే ఒకే ఒక కారణంతో పక్కన పెట్టడానికి వీలు లేదు. కానీ భాషల విషయంలో చెలరేగుతున్న వైరుధ్యాలను, వైవిధ్యాలను పట్టుకుని భాష వైషమ్యాలు పెరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత మనదే. స్థానిక భాషతో ఉపాధి పొందలేనపుడు ఉపాధినిచ్చే భాషా విజ్ఞానం సాధించడం పెద్ద తప్పేమీ కాదు. కూటి కోసం కోటి విద్యలని చిన్నారి పొన్నారి చిరుత కూకటి నాడే నేర్చుకున్న సూక్తి.ఇంగ్లీష్ మాట్లాడేవాళ్లు త్వరలోనే సిగ్గుపడతారని, దేశంలో అలాంటి సమాజం ఏర్పడేరోజు దగ్గరలోనే ఉందని అంటూ కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా సంచలన వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. భారతీయ భాషలే దేశ గుర్తింపునకు కేంద్రంగా ఉంటాయని, అందుకే ఇంగ్లీష్ కంటే వాటికే ఎక్కువగా ప్రాధాన్యం ఇవ్వాలని సూచించడం మంచిదే.కానీ ఎన్నో దేశాల వాడుక భాషను వీడి వారికి తెలియని భాషలో వ్యవహారాన్ని నడిపించగలిగే పరిస్థితులు కనపడవు. ఢిల్లీలో ఓ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న అమిత్ షా మాట్లాడుతూ బ్రిటిష్ వలస పాలనలోని బానిసత్వానికి చిహ్నంగా ఆంగ్లభాష మనకెందుకు!? అనేవిధంగా మాట్లాడారు. భారతీయ భాషలు మన సంస్కృతికి రత్నాల వంటివి. మన భాషలు మనకు లేకుండా మనం నిజమైన భారతీయులుగా ఎలా ఉండగలం అనే ధోరణిలోసాగింది. భారతదేశ భాషా వారసత్వాన్ని పునరుద్ధరించేందుకుకృషి జరగాల్సిన తరుణంలో ఆంగ్లమీడియా, తెలుగు మీడియాలతో మనమెలా మనుగడ సాధించగలమో విశ్లేషించుకోవాల్సిన అవసరముంది. మనదేశం, సంస్కృతి, మతానికి ఏ విదేశీ భాష కూడా సరితూగదు. అసంపూర్ణమైన విదేశీ భాషలతో సంపూర్ణమైన భారత దేశం అనే భావనను ఊహించలేం. ఇలాంటి ఆలోచనఎంత సంక్లిష్టమైందో తెలుసు. కానీ భారతీయ సమాజం విజయం సాధిస్తుందని, మరోసారి ఆత్మవిశ్వాసంతో, మనం దేశాన్ని మన భాషలతో నడిపించగలం, ప్రపంచానికి నాయకత్వం వహించగలమని నమ్ముతున్నానని షా అన్నారు. నూతన విద్యా విధానం ముసుగులో త్రిభాష సూత్రం ద్వారా బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం హిందీని బలవంతంగా రుద్దేందుకు ప్రయత్నిస్తున్నదని పలు రాష్ట్రాలు ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో అమిత్ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఇంగ్లీష్ వద్దనడం పేదలను చులకన చేయడమే నని వారిని ఉన్నత విద్యకు దూరం చేసే కుట్రయని ఒక వారధిలాంటి భాషగా ఉన్నా ఆంగ్లాన్ని వదిలిపెట్టమనడం తగదని కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ కేంద్ర హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్యలను తప్పుపట్టారు. ఇంగ్లీష్ అనేది డ్యామ్ కాదు, ఒక బ్రిడ్జి. ఇంగ్లీష్ అంటే సిగ్గు కాదు, పవర్, ఇంగ్లీషు అనేది ఒక చైన్‌కాదు, చైన్లను బ్రేక్ చేసే పరికరం. ఇండియాలోని పేద పిల్లలు ఇంగ్లీష్ చదువుకోవడం బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌కు ఇష్టం లేదు. వాళ్లను ప్రశ్నించేవారు ఉండకూడదని వారుకోరుకుంటున్నారు. తమతో సమానంగా ఎదగడం కూడావారికి ఇష్టంలేదని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో రాహుల్ పేర్కొన్నారు.ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ ప్రతిరోజూ ఇంగ్లీష్ మాట్లాడవద్దని, హిందీలో మాట్లాడమని చెబుతుంటారని,అయితే ఆర్ఎస్ఎస్, బీజేపీలోని పిల్లలు మాత్రం ఇంగ్లీషు విద్యకు వెళ్తుంటారని, దీనివెనుక కారణమేమిటని రాహుల్ ప్రశ్నించారు. ఎందుకంటే పేద పిల్లలు బోర్డ్ రూముల్లోకి ఎంటర్ కారాదని, అధిక వేతనాలతో కూడిన ఉద్యోగాలు రాకూడదని వారు కోరుకుంటున్నారని అన్నారు. వాళ్లు ఇంగ్లీషు స్కూళ్లకు వెళ్లి కాంటాక్టులు పెంచుకుంటారని, పేదపిల్లలకు మాత్రం తలుపులు మూసేస్తారని అక్షేపణ తెలి పారు.సాధికారతకు మాతృభాషతోపాటు ఇంగ్లీష్ చాలా అవసరమని, ఇంగ్లీష్ విద్య విద్యార్థులకు ఆత్మవిశ్వాసాన్ని, ఉపాధిని కల్పిస్తుందని రాహుల్ అన్నారు. దేశంలోని ప్రతిభాష ఆత్మవంటిదని,సంస్కృతి, నాలెడ్జికి ప్రతీక అని అన్నారు. భాషాభివృద్ధి జరగాలని, అదే సమయంలో ప్రతి ఒక్కపిల్లవాడికి ఇంగ్లీష్ బోధించాలని అన్నారు. అప్పుడే ప్రపంచంతో భారత్ పోటీ పడగలుగుతుందని, ప్రతి ఒక్క పిల్లవాడు సమానావకాశాలు పొందగలడని రాహుల్ స్పష్టం చేశారు. తన ఎక్స్ అకౌంట్లో హిందీ భాషలో రాహుల్ గాంధీ ఈ పోస్టు చేశారు. ఇంతకు నాలుగు రోజులకు ముందే ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్ జాతీయవిద్యావిధానం గురించి మాట్లాడుతూ హిందీ ప్రస్తావన తెచ్చారు.ఇలా భాషల విషయంలో అన్ని రాష్ట్రాలతోనూ సంప్రదించి సమగ్ర విద్యావిధానాన్ని భాషా ఔన్నత్యాలను గుర్తించాలి. జాతీయ విద్యా విధానం లోని త్రిభాషా సూత్రంతో దేశవ్యాప్త విద్యార్థులు మూడుభాషలు నేర్చుకోవాలిని కేంద్రం అభిభాషణ.దాంతోనే తమిళరాష్ట్ర పాలకులు స్టాలిన్ ఈరకం విద్యావిధానంపై ఆగ్రహం వెలిబుచ్చారు. దక్షిణాది రాష్ట్రాల్లో హిందీ మూడో భాషగా ఉంచాలని కుదరదని ఢంకా బజాయించి చెప్పారు. రాష్ట్రపరంగా తమిళ ప్రాముఖ్యతను తప్పించడం సాధ్యపడదని తేల్చిచెప్పారు. భాషలన్నింటంలోనూ ఏ భాష మేలు అంటే ఏ భాషకు ఆభాషే గొప్పది. మాతృభాష మరీ గొప్పది. ఎన్నో దేశాలు అనుసరించే ఆంగ్లమూ అనుసరణీయమే! దేన్నీ కాదనలేం.

మనకున్న దానితో సంతృప్తిపడడం సబబే అయినా మన స్వభావాన్ని మాత్రం సంస్కరించుకోవాలి.



మహాత్మాగాంధీ

విధి అంటూ ఎవరూ సృష్టించలేదు. మనకు మనమే సృష్టించుకున్నాం. మన మాట, ఆలోచన, ప్రవర్తన వల్ల మన జీవితానికి మనమే బాధ్యులం.



డబ్ల్యు.ఎమర్సన్

# ప్రజావాక్కు



### ముదురుతున్న బనకచర్ల వివాదం

ఈ మధ్యకాలంలో రెండు తెలుగు రాష్ట్రాల మధ్య బనకచర్ల ప్రాజెక్టు వివాదం తీవ్రమవుతూ, ప్రజల్లో ఆందోళన పెరుగుతోంది. గోదావరి నదిలో వృథాగా సముద్రంలో కలిసిపోతున్న నీటిని వినియోగించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గోదావరి బనకచర్ల ప్రాజెక్టును ప్రతిపాదించింది. అయితే ఈ ప్రాజెక్టు తెలంగాణ ప్రయోజనాలకు విరుద్ధమని తెలంగాణ ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. విభజన చట్టాన్ని, జల వివాదాల ట్రిబ్యునల్ నిబంధనలను ఉల్లంఘించేలా ఏపీ ప్రభుత్వం వ్యవ హరిస్తోందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ ప్రాజెక్టు వల్ల తెలంగాణ రైతులకు నష్టం కలుగుతుందని, రాష్ట్ర హక్కులను కాపాడేందుకు అన్ని చట్టపరమైన మార్గాలను అనుసరిస్తామని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### రోడ్డు ప్రమాదాలకు హెడ్‌లైట్లే కారణం

ఈ మధ్యకాలంలో దేశంలో నిత్యం ఎక్కడో ఒక చోట వాహన ప్రమాదాలు సంభవిస్తూ ఏటా లక్షలాది మంది చనిపోవటం, గాయపడటం జరుగుతుంది. ఈ ప్రమాదాలు ముఖ్యంగా రాత్రివేళల్లో అమిత వేగంతోవెళ్లే వాహనాలు, కళ్లు మిరుమిట్లు గొలిపే వాటి హైటెక్ లైటింగ్, కొందరు మద్యం సేవించి వాహనాలు నడపటం వంటివి. ఒకప్పుడు స్వదేశీ వంటి కార్లు,బస్సులు,ద్విచక్ర వాహనాల హెడ్‌లైట్లపై సగం నల్ల రంగు వేయడటమో నల్ల స్టిక్కర్లు అంటించటమో జరిగేది. ఫలితంగా కాంతి అన్ని వైపులా ప్రసరించకుండా ఎదుటి వాహనాలు స్పష్టంగా కనిపించేవి. కనుక ఇకనైనా వాహన తయారీ కంపెనీలు ఎదుటి వాహనాలకు ఇబ్బంది లేని విధంగా లైటింగ్ ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించాలి.

- తిరుమలశెట్టి సాంబశివరావు, గుంటూరు

### మత ఛాందసవాదం

యుద్ధం ఆధిపత్యం చాటడానికి మాత్రమే. పర్షియన్ చరిత్ర నాగరికత ఎంత మహోన్నత లౌకిక విలువలు కలిగిన నాగరికత.ఇప్పుడు మత ఛాందసవాదంలోకి ఆధిపత్య దేశాల చక్రబంధంలోకి జారిపోవడం ఒక రకంగా విచిత్రం అయితే మతం ఆధారంగా నాయకులు పుట్టుకు రావడం కూడా ఒక రకంగా దీనికి కారణం కావొచ్చు.

- భారత అవినాష్, జనగామ

### అగ్నికి ఆజ్యం పోస్తున్న దేశాలు

భారత్ ప్రధాని మోడి అద్భుతమైన నాయకుడు, కాని తనకు పాకిస్థాన్ అంటే వల్లమాలిన ప్రేమ అంటూ అమెరికన్ ట్రంప్ శత్రుదేశాలుగా మారిన ఇండోపాక్‌ల మీద కురిపిస్తున్న అభిమానం. పాక్ మిలిటరీ చీఫ్ అయిన మునీర్‌ను ట్రంప్ తన శ్వేత సౌధానికి పిలిచి అతనితో భోజనం చేసాడు. అమెరికాకు ఇరాన్‌తో పొరపొచ్చాలులేకపోయినా ఇజ్రాయిల్‌కు ఆయుధ సామాగ్రి, ఆర్థిక సహాయం చేసి ఇరాన్ మీద యుద్ధానికి మరింత పుష్టిని చేకూర్చడానికిట్రంప్ ఉవ్విళ్ళూరుతున్నాడు.ఏయుద్ధాలను ఆపలేని అగ్రరాజ్యాధినేతకు నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలా? పైగా ఇండోపాక్ యుద్ధాన్ని తానే ఆపానాని పదేపదే గ్లోబెల్ ప్రచారం చేస్తే ప్రపంచం నమ్మేస్తుందా?కాల్పుల విరమణ కోరింది మేమేనని పాక్ ఉపప్రధాని కూడా ఒప్పుకున్నాడు. అందరూ ఇలా అగ్నికి ఆజ్యంపోసేవాళ్లే కాని శాంతి సామరస్యాలకు బాటలు వేసేవారెవరూ కనుచూపు మేరలో కానరావడం లేదు. ఐక్యరాజ్య సమితి ఉన్నా ఒకటే లేక పోయినా ఒకటే.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### ఒక్కొక్క పార్టీకి ఒక్కో ఛానెల్

ఒక దశాబ్దం నుండి మన తెలుగు చానెల్లో ఒక్క దూరదర్శన్ ఛానల్‌లోతప్పా మిగతా ప్రైవేట్‌చానెల్స్ ఎలా మారిపోయాయంటే ఏదో ఒక రాజకీయ పార్టినో ఏదో ఒక సామాజిక కులాన్నో మోస్తోన్న వ్యవస్థలుగా మారిపోయాయి. వాళ్లవాళ్ల మీటింగులు, వారి వారి చెత్తడప్పులు కొట్టుకోవడం చేస్తే ఒక సందర్భంలో కొంతలోనైనా మంచిది. విర్నుద్ధంగా పగ వారిని తిట్టించడం ఎక్కువై పోయింది. డిబేట్లు అయితే తిట్టు కోవడమే పరామవధి. వక్తలు సహనం కోల్పోయి కొట్టుకోవడం వరకూ వెళ్తే మరి వారినిఫాలో అయ్యే జనాల పరిస్థితి రోడ్ల మీద చూస్తూనే ఉన్నాము. ప్రభుత్వం అంటే పోలీస్ శాఖ, అంటే భయం లేని జనాలు రోడ్ల మీద సినిమాలు చూపిస్తున్నారు.

- గార్లపాటి సీతారామయ్య,హైదరాబాద్

### చదువు ఖరీదైన వస్తువు

అన్ని ప్రయివేటు విద్యా సంస్థలు కేజి నుండి పేజి వరకు సంవత్సరం ఫీజులను ఇబ్బడిముబ్బడిగా పెంచేస్తున్నారు. చదువులు రానురాను అధిక ఖరీదైన వస్తువుగా మారిపోతున్నది. ఇంజినీరింగ్ ఫీజు సాలీనా రెండు నుంచి రెండున్నర లక్షల వరకూ ఉంది.ప్రభుత్వం ఫీజులు తగ్గించదు. తగ్గిస్తే ఫ్రొఫెసర్లకు ఇతర స్టాఫ్‌కు జీతాలు యివ్వలేమని యాజమాన్యాల ఆవేదన.

- ఎన్.రామారావు, నల్గొండ

మన వి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)


# వడ్డీ వ్యాపారుల ఆగడాలను నియంత్రించాలి!

*సాంప్రదాయక అటవీ హక్కుల చట్టం 2006ప్రకారం తొలిసారిగా కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనులకు అటవీ హక్కు పత్రాల పంపిణీ చేసింది. ఆదివాసీ ప్రాంతాల్లో వారసత్వంగా సాగు చేసుకుంటున్న పోడుభూములకు హక్కుపత్రాలు అందడంలేదు. ఇచ్చిన పత్రాలకు రుణాలు ఇవ్వడం లేదు. మిషన్ కాకతీయ వల్ల సాగు విస్తీర్ణం 51శాతం పెరిగింది. పెట్టుబడి సాయంగా ప్రభుత్వం అంది స్తున్న రైతుబంధు సాయంవల్ల కొంత మేలు జరుగుతోంది. అకాల వైపరీత్యాల వల్ల జరిగే పంట నష్టాన్ని అరికట్టేందుకు రైతులకు తగిన నష్టపరిహారం, రుణమాఫీ అమలు చేయాలి. త్వరలో రైతులందరికీ పెట్టుబడిగా ఇవ్వబోయే ముందస్తు సాయం, రుణాలు సకాలంలో అందించి ఏజెన్సీ ప్రాంత అన్నదాతలను ఆదుకోవాలి. ప్రభుత్వం శూన్య ఆధారిత వడ్డీతో రుణాలు అమలు చేస్తే ఏజెన్సీ రైతులకు మేలు జరుగుతుంది. అలాగే నిబంధనలకు విరుద్ధంగా వ్యవహారి స్తున్న వడ్డీ వ్యాపారస్తులను కఠినంగా శిక్షి ంచాలి.*



గుమ్మడి లక్ష్మీనారాయణ

ఆరుగాలం కష్టించిన రైతులు ప్రత్యేకించి సన్న, చిన్నకారు రైతులకు పండించిన పంటకు గిట్టుబాట ధర లేకపోగా సరైన ఆదరణ లభించడం లేదనేది సుస్పష్టమైన విషయం.పంట కోసం తెచ్చిన అప్పుల కిచ్చేందుకు రైతులు నరకయాతన పడుతున్నారు. వడ్డీకి వడ్డీ వసూలు చేసుకుంటూ దళారులు మోసానికి పాల్పడుతుండటంతో అన్నదాతల కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయి. ఏడాదికి ఒకే పంట పండించే ఏజెన్సీ ప్రాంతాలలో అప్పు చేయని రైతు కుటుంబమే కన్పించదు. పంట పండితేనే అప్పు తీరేది.. అన్నట్లు మరోపక్క వరుణుడు కరుణించకపోతే దిగుబడి అనుమానమే. దీంతో ఆదివాసీ రైతులు దళారుల వలలో చిక్కుకొని మోసపోతూ ఆర్థికంగా నష్టపోతున్నారు. వారు నిత్యకూలీలుగా మారడం సర్వసాధారణం అయిపోయింది. ప్రభుత్వపరంగా బ్యాంకులిచ్చే రుణాలు రైతులకు భరోసా కల్పించడం లేదు. వానాకాలం (ఖరీఫ్ పంటకు) షెడ్యూల్డ్ ఏజెన్సీ ప్రాంతాల్లో వర్షపాతం సగటుగా ఉంటున్నప్పటికీ, పెద్ద చెరువులు, లిఫ్ట్ ఇరిగేషన్, బోర్లు, బావులు లేక మరోపక్క కరెంటు కనికరించక ఏడాదికి ఒకే పంటతో సరిపుచ్చుకుంటున్నారు. అనేక ఏజెన్సీప్రాంతాల్లో యాసంగి అనేదే కన్పించదు. మహబూబాబాద్ జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో కాకతీయులు నిర్మించిన పాకాల సరస్సు, బయ్యారం పెద్ద చెరువు ఉన్నాయి. ఏజెన్సీ అడవుల నుండి పాకాలలో చేరే వాననీరు ఆయకట్టు కింద 28,512 ఎకరాల సాగుకు, అదీ గిరిజనేతర రైతులకే తోడ్పడుతుంది తప్ప ఒక్క ఆదివాసీ రైతుకు ఉపయోగపడటం లేదు. ఏటా ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో వడ్డీ వ్యాపారులు ఇతర రాష్ట్రాల నుండి ఏజెన్సీ ఏరియాకి వస్తుంటారు. స్థానిక వ్యాపారులతో పాటు వీరు కూడా విత్తనాలు, పెట్టుబడి ఇస్తామంటూ మాయమాటలు చెబుతారు. బ్యాంకు రుణం దొరకని రైతులు తప్పనిసరి పరిస్థితిలో వీరి నుండి విత్తనాలు, ఎరువులు, అప్పు తీసుకుంటారు. పంట చేతికొచ్చే వరకు అంతా వడ్డీ వ్యాపారి కనుసన్నలలోనే సాగు పనులు నడుస్తాయి. వ్యాపారులు 10 నుంచి 15 శాతం వడ్డీ వసూలు చేస్తారు. అమ్మకాలు సైతం వారి చేతులలో ఉండాల్సిందే. దళారులను వెంట పెట్టుకొని కొందరు తక్కువ ధరకే రైతుల పంటను కల్లాల వద్దే దౌర్జన్యంగా కాంటాలు పెట్టి కొనుగోలు చేయించి తమ పైకం తీసుకుంటారు. ఒకవేళ అప్పు చెల్లించే స్తోమత లేని రైతులు నుంచి వారి కాడెడ్లను సైతం కమేళాలకు తరలించడం, వాహనాలను, వస్తువులను స్వాధీనపర్చుకోవడం ఆనవాయితీగా మారింది. రైతులు తమవద్ద రుణాలు తీసుకోవాలనే షరతు విధించి, సుమారు 20శాతం పంట డబ్బులను బయానా (అడ్వాన్స్)గా పొందడమే గాక, వాటికి వడ్డీ చెల్లించకపోవడం కొసమెరుపు మోసం. ఇలా తిండి గింజల కోసం ఆరుగాలం కష్టించే రైతులు ప్రత్యామ్నాయంగా పత్తి తదితర వాణిజ్య పంటలు పండించినా వారి ఆశలు నెరవేరకపోగా ఆత్మహత్యలే శరణ్యమవుతున్నాయి. రాష్ట్రంలోని ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్ ప్రాంతాల ఆదివాసీ రైతులకు చాలా మందికి అటవీ హక్కు పత్రాలు ఇవ్వకపోవడంతో బ్యాంకు రుణాలు అందటంలేదు. 2016లో గిట్టుబాటు ధర లభించని ఒక కుటుంబం (ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడలోని కుంట గూడ గ్రామం) వడ్డీ వ్యాపారికి రూ.60 వేల విలువైన ఎడ్లను అమ్మివేసి, తమ పిల్లలను చదువు మాన్పించి, కూలి పనులకు కుదిరించింది. వడ్డీ వ్యాపారులకు భయపడి కొందరు రాత్రివేళ ఇళ్ళు చేరడం, లేదా గూడేలు వదిలి పోవడం జరుగుతోంది. ఇక రోజువారీ గిరిగిరి వ్యాపారం అడ్డూ అదుపూ లేదు. కొందరు వడ్డీవ్యాపారులు గిరిజనులను నమ్మించి 5 నుంచి 10 శాతం వడ్డీతో అప్పులిచ్చి నెలనెలా బెదిరించి వసూలు చేస్తున్నారు. చక్ర వడ్డీలు వేస్తున్నారు. రుణదారుని నిరూపణ కోసం బ్యాంకు చెక్కులు, ఏటిఎం కార్డులు,బంగారు ఆభరణాలు, ఫిక్స్డ్ సేవింగ్ బాండ్స్ తీసుకొని దగ్గర పెట్టుకుంటున్నారు. ఏజెన్సీలో ఉద్యోగస్తులకు గంట గంటకి లెక్కించి ఇస్తున్నారు. ఉద్యోగస్తులకు జీతం ఆలస్యమైతే చక్రవడ్డీ లెక్కగడుతున్నారు. నెల మొదటి తేదీన జీతం రాగానే రుణదారునికి ఈఎంఐ పోగా మిగిలినవి ఇస్తూ ఏ.టి.ఎం కార్డు మాత్రం ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారు. ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడలో ఒక వడ్డీ వ్యాపారస్తుడు ఇద్దరి వద్ద షూరిటీ బాండ్ పేపర్స్ తీసుకొని 5లక్షలు అప్పు ఇచ్చాడు. అప్పు తిరిగి కట్టినా బాండ్ పేపర్లు ఇవ్వకుండా అధిక వడ్డీ కోసం డిమాండ్ చేయడంతో బాధితుల ఫిర్యాదు మేరకు రిమాండ్‌కి పంపిన సంఘటన ఇటీవల జరిగింది.



గిరిజనుల అమాయకత్వాన్ని, నిరక్షరాస్యతను ఆసరాగా చేసుకొని, వడ్డీ వ్యాపారస్థులు చేస్తున్న మోసాలు అరికట్టేందుకు ప్రభుత్వం ఏజెన్సీలో వడ్డీ వ్యాపార నిబంధన చట్టం 1960ను రూపొందించింది. దీని ప్రకారం నాము, సిరి నాము (నాము అంటే బస్తాకు రెండు బస్తాలు, సిరి నాము అంటే బస్తాకు బస్తన్నర) పేరుతో పంటల మీద వడ్డీకి అప్పులు, బంగారు ఆభరణాలు, వస్తువులు తదితర తాకట్టు పెట్టుకుని అప్పులు ఇవ్వడం నిషేధించబడింది. ఈ చట్టం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని 5,948 షెడ్యూల్డ్ ఏజెన్సీ ప్రాంతాలన్నింటికీ వర్తిస్తుంది. లైసెన్సు పొందకుండా రుణాలు ఇవ్వరాదు. అనుమతి లేకుండా ఏజెన్సీలో వ్యాపారం చేస్తే ఏడాది జైలుశిక్ష లేదా రూ.1000 వరకు జరిమానా లేదా రెండూ విధిస్తారు. రుణగ్రహీతల నుండి వడ్డీ వసూలు చేసే సమయంలో వారిని నిర్బంధాన్ని గురిచేసినా, బెదిరించినా లేదా ఆస్తులకు ఆటంకం కలిగించినా శిక్ష, జరిమానా లేదా రెండూఉంటాయి. నిబంధనలకు ఇచ్చిన వారు కోర్టుకు వెళ్లి తిరిగి వసూలు చేసుకునేందుకు వీలుండదు. లైసెన్స్ పొంది రుణాలు ఇచ్చేవారు ఖచ్చితంగా రాతపూర్వక ఒప్పందం చేసుకోవాలి.సాక్షుల సంతకాలు ఉండాలి.మొదటి సాక్షిగా సర్పంచ్ సంతకం తప్పనిసరి. లేకవారి కేసును కోర్టులు విచారణకు స్వీకరించవు. వ్యాపారులు రుణ వివరాలతో కూడిన రిజిస్టరు నిర్వహించాలి. కానీఇవేవీ సక్రమంగా అమలు కావటం లేదు. ఏజెన్సీలోని పేద గిరిజన రైతులకు సకాలంలో బ్యాంకు రుణాలు అందకపోవడంతోనే వడ్డీ వ్యాపారుల చుట్టూ తిరగడం తప్పా గత్యంతరం లేదు. దీంతో దళారుల ప్రవేశం కూడా కాకతాళీయంగా మారింది. దీనికి తోడు అధిక వడ్డీ వసూలు చేసే వ్యాపారులపై అధికారుల నియంత్రణ చర్యలు లేవు. సాంప్రదాయక అటవీ హక్కుల చట్టం 2006ప్రకారం తొలిసారిగా కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనులకు అటవీ హక్కు పత్రాల పంపిణీ చేసింది. ఆదివాసీ ప్రాంతాల్లో వారసత్వంగా సాగుచేసుకుంటున్న పోడుభూములకు హక్కుపత్రాలు అందడంలేదు. ఇచ్చిన పత్రాలకు రుణాలు ఇవ్వడం లేదు. మిషన్ కాకతీయ వల్ల సాగు విస్తీర్ణం 51శాతం పెరిగింది. పెట్టుబడి సాయంగా ప్రభుత్వం అందిస్తున్న రైతుబంధు సాయంవల్ల కొంత మేలు జరుగుతోంది. అకాల వైపరీత్యాల వల్ల జరిగే పంట నష్టాన్ని అరికట్టేందుకు రైతులకు తగిన నష్టపరిహారం, రుణమాఫీ అమలు చేయాలి. త్వరలో రైతులందరికీ పెట్టుబడిగా ఇవ్వబోయే ముందస్తు సాయం, రుణాలు సకాలంలో అందించి ఏజెన్సీ ప్రాంత అన్నదాతలను ఆదుకోవాలి. ప్రభుత్వం శూన్య ఆధారిత వడ్డీతో రుణాలు అమలు చేస్తే ఏజెన్సీ రైతులకు మేలు జరుగుతుంది. అలాగే నిబంధనలకు విరుద్ధంగా వ్యవహారిస్తున్న వడ్డీ వ్యాపారస్తులను కఠినంగా శిక్షించాలి. •

# మెడికల్ టూరిజం హబ్‌గా ఎదుగుతున్న భారత్!




కామిడి సతీష్ రెడ్డి

వైద్య రంగంలో ఎంతో పురోగతి సాధించి ప్రపంచానికే తలమానికంగా నిలుస్తున్నది మన భారత్.నిన్న మొన్నటి వరకు కూడా దేశ రాజకీయ నాయకులు, సెలబ్రిటీలు ఏదైనా పెద్ద జబ్బు చేస్తే వైద్యం కోసం విదేశాలకు వెళ్లేవారు. కానీ ఇప్పుడు మన దేశం వైద్యరంగంలో ఎంతోపురోగతి సాధించడంతో పాటు, నిపుణులైన డాక్టర్లు అందుబాటులో ఉండటం, అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన అధునాతనమైన వైద్య పరికరాలు, సదుపాయాలు, ఇంగ్లీష్ మాట్లాడే స్టాఫ్ మన దగ్గర ఎక్కువగా ఉండటం, పైగా వైద్యానికి తక్కువ ఖర్చు అవుతుండటం వంటి ఇత్యాది కారణాలతో ఇప్పుడు మన దేశానికి వైద్యులు సైతం వైద్యం చేయించుకునేందుకు క్యూ కడుతుండటం ఎంతైన యావత్ మన భారతదేశ ప్రజానీకానికి గర్వకారణమైన విషయం. అలాగే విదేశాల నుంచి వచ్చే వారు ప్రధానంగా తుంటి మార్పిడి, ఎముక మజ్జ మార్పిడి, కంటి శస్త్రచికిత్సల కోసం ఏటా వేలాది మందికి పైగా విదేశీ రోగులు ముఖ్యంగా మొదటి ప్రాధాన్యతగా వున్న 'హెల్త్ క్యాపిటల్ ఆఫ్ ఇండియా'గా పిలువబడే చెన్నైకి విచ్చేస్తుండటం, ఆ తర్వాత అత్యున్నత అర్హతలు కలిగిన వైద్య నిపుణులు, వైద్య పరిశోధన బృందాలకు బెంగుళూరు నిలయంగా మారడంతో పాటు అక్కడికి సైతం విదేశీయులు ఆహ్లాదకరమైన వైద్యం కోసం ప్రపంచంలోని ఎక్కడెక్కడ నుంచో ఈ నగరానికి విచ్చేస్తుండటాన్ని బట్టి ఈ రెండు నగరాలు ఎంతగా వైద్య రంగంలో అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నాయో మనం ఇట్టే ఊహించవచ్చు. తెలుగు ప్రజల ప్రముఖ నగరం హైదరాబాద్ సైతం కీలక స్థానమే. ఎందుకంటే హైదరాబాద్‌కు సులువైన రవాణా సౌకర్యం ఉండటం, అదీగాక అన్ని రకాల అధునాతనమైన వైద్య సదుపాయాలు ఉండటం, వైద్యం అందించడంలో చెయ్యి తిరిగిన, ఆరితేరిన డాక్టర్లు ఉండటం, పైగా విదేశీ విద్యా



ర్థులు, పలు భాషలు మాట్లాడే ఫెసిలిటేటర్స్ కూడా ఎక్కువగా ఈ నగరంలో ఉండటంతో విదేశీయులు వైద్యం కోసం ఈ నగరానికి సైతం రావడానికి మొగ్గు చూపుతున్నారు. ఇంకా చెప్పుకుంటూపోతే కేరళ రాష్ట్రం విషయానికి వస్తే అలెప్పీ 'మెడికల్ టూరిజం హాట్ స్పాట్'గా గుర్తింపు పొందడం, ఆయుర్వేద చికిత్సల కోసం విదేశీ రోగులు ఈ నగరానికి రావడానికి ఆసక్తి చూపుతున్నారు. పైగా ఇక్కడి చికిత్స పచ్చని ప్రకృతి మధ్య రిసార్టు వంటి కాటేజస్‌లో సాగుతుండటం వారిని ఎంతగానో ఆకట్టుకుంటున్నది. అలాగే తమిళనాడులోని చెన్నై తర్వాత వైద్యానికి ప్రసిద్ధి చెందింది కోయంబత్తూర్, ఇక్కడ వైద్య ఖర్చులు కూడా తక్కువగా ఉండటం, పైగా ఈ నగరంలో అల్లోపతితోపాటు సిద్ధ, ఆయుర్వేద, యునాని, హోమియోపతి, ఈ ఎన్‌టీ, వెల్‌నెస్ వంటి చికిత్సల కోసం విదేశీ రోగులు ఇక్కడకు వస్తున్నారు అంటే ఈ నగరం సైతం వైద్యరంగంలో ఎంతటి ప్రత్యేకతను, గుర్తింపును చాటుకుంటున్నాదో చెప్పవచ్చు. తర్వాత స్థానాల్లో ఉత్తర భారత్‌లోని ఢిల్లీ, ముంబాయి వంటి నగరాలు వున్నాయి. ఏదిఏమైనా భారతదేశంలో మెడికల్ టూరిజంలో మన దేశం వెలుగు వెలుగుతుండటంతో మనదేశంలోని యూనివర్సిటీల్లో చదువుకుంటున్న విదేశీ విద్యార్థులు సైతం దీనివల్ల జీవనోపాధి పొందుతున్నారు. ఎలాగంటే వైద్యం కోసం ఈ దేశానికి వచ్చే విదేశీయులకు వసతి, భోజన సౌకర్యాల నుంచి ఆసుపత్రుల చుట్టూ తిప్పటం, వైద్య పరీక్షలకు వెంట ఉండటం, ఆ విదేశీ పేషెంట్లకు,డాక్టర్లకు మధ్య మధ్యవర్తులుగా వ్యవహరించడం వంటి సేవలను అందిస్తూ దాని ద్వారా వచ్చే డబ్బు విదేశీ విద్యార్థుల ఖర్చులకు ఉపయోగపడటంతో అది వాళ్లకు ఓ గొప్ప ఉపాధి మార్గంగా మారడం గొప్ప పరిణామం. ఏమైనా ఈ మెడికల్ టూరిజం ఎంతో మందికి ఉపాధి నిస్తూ, సంపదను సృష్టిస్తూ, మన భారతదేశ ఆర్థికవ్యవస్థ వృద్ధికి తోడ్పడటమే కాకుండా వైద్యంలో ఉన్నత ప్రమాణాలు సాధించేలా చేస్తూ మన దేశ వైద్య సేవలను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడం అనేది నిజంగా గొప్ప విశేషం. పైగా ఈ అద్భుతమైన పరిణామం మన భారతదేశ కీర్తి, ప్రతిష్టలను అంతర్జాతీయ స్థాయిలో విశ్వవ్యాప్తం చేస్తుంది. •

# దేశాభివృద్ధిలో దౌత్యవిధానం కీలకం



ఐ.ప్రసాద రావు

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత దాదాపు ఆరు దశాబ్దాలుగా భారత్ చూపిన దౌత్యనీతికి ప్రపంచం అంతా ఆసక్తిగా అనుసరించింది. ముఖ్యంగా రెండవ ప్రపంచ యుద్ధానంతరం ద్విధ్రువ ప్రపంచంగా ప్రపంచ దేశాలు అన్నియు ఆనాడు ఉంటే, అమెరికా కూటమిలో, లేదా రష్యా కూటమిలో చేరడానికి సమాయత్తం అవుతున్న సమయంలో, అప్పుడే స్వాతంత్ర్యం పొందిన దేశాలను, తటస్థంగా ఉన్న దేశాలను ఏకం చేసి పైన పేర్కొన్న ఏ ఒక్క కూటమిలో చేరకుండా 'అలీన దేశాలు కూటమి ( నామ్)' ఏర్పాటు చేసిన ఘనత మనదేశం సాధించిన అద్భుతమైన అత్యున్నత దౌత్యనీతికి నిదర్శనంగా నిలుస్తోంది. అంతేకాకుండా 'సార్క్ దేశాల' కూటమి ఏర్పాటు చేసి ఆసియా దేశాలను ఐక్యవేదిక ద్వారా అనేక అంశాలపై గళం వినిపించింది. మనదేశం పెట్టుబడీదారి దేశాలు, నియంతృత్వ దేశాల పలు విషయాలపై నియంత్రణ సాధించింది. ముఖ్యంగా కాశ్మీర్ విషయంలో మూడోదేశం జోక్యానికి తావు లేకుండా చేసింది. అంతేకాకుండా, బంగ్లాదేశ్ స్వాతంత్ర్యం విషయంలో కూడా చక్కటి పరిష్కారం చూపింది. అలాగే, భారత్ చైనా యుద్ధ సమయంలో 'పంచశీల' పద్ధతి ద్వారా పరిష్కారం చూపింది. అలాగే మూడు దశాబ్దాల క్రితం శ్రీలంకలో జాతుల మధ్య వైరుధ్యాలు ముఖ్యంగా ప్రభాకరన్ ఆధ్వర్యంలో జరిగిన ఎల్.టి.టి.ఈ పోరాటాన్ని అప్పటి ప్రధాని సరైన మార్గంలో పరిష్కారం చూపారు. తత్ ఫలితంగా తదుపరి తన ప్రాణాలను బలిదానం చేయవలసి వచ్చింది. అలాగే కాశ్మీర్ విషయంలో ఐక్యరాజ్యసమితి వేదికగా, మన దేశం అప్పటి లోక్‌సభ ప్రతిపక్ష నేత అటల్ బిహారీ వాజపేయి ద్వారా ఘాటుగా మన వాయిస్ వినిపించింది. మన ఇరుగు పొరుగు దేశాలతో ఉన్న వివిధ రకాల సమస్యలు మన దౌత్యవిధానం ద్వారా పరిష్కారం చేసుకున్న పరిస్థితి ఉంది. మరి ఇంత ఘనచరిత్ర ఉన్న మన దౌత్య విధానం ఇటీవల కొంచెం మసకబారుతున్న పరిస్థితి కనిపిస్తోంది అని పలువురు భావిస్తున్నారు.ఈ పరిస్థితిని సాధ్యమైనంత త్వరగా చక్కదిద్దేందుకు చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా 2014నుంచి కేంద్రంలో ఉన్న ప్రస్తుత ప్రభుత్వం 'అలీన విధానాన్ని' పక్కన పెట్టారు. దీనికితోడు, అమెరికా పక్షాన నిలబడుతున్నట్లు కనపడుతుంది. ముఖ్యంగా గత దశాబ్దాలుగా మనం 'పాలస్తీనా' పక్షాన నిలబడితే, ప్రస్తుతం అమెరికా అండదండలతో గత రెండు సంవత్సరా



లుగా పాలస్తీనా గాజాపై మానవత్వం లేకుండా విరుచుకు పడుతున్న ఇజ్రాయెల్‌పై మనం మౌనంగా ఉండటం మన దౌత్య విధానంలో మార్పులు వచ్చినట్లు స్పష్టంగా కనిపిస్తుంది.'ఇది యుద్ధాల సమయం కాదు అని చెబుతున్నా,' ఎక్కడో స్పష్టత లోపం కనపడుతుంది. అదేవిధంగా, ఇటీవల బంగ్లాదేశ్‌లో అధికారం చేపట్టిన ప్రభుత్వం మనలను దూరం చేసుకుంటూ, చైనాతో స్నేహం కోసం ఆరాటం పడుతుంది. షేక్ హసీనా పదవీకాలంలో అక్కడ ఉన్న పరిస్థితులపై మనకు అవగాహనా లోపంఉన్నట్లు తెలుస్తోంది. అలాగే గతంలో మనతో కలిసి ఉన్న శ్రీలంక కూడా ఇటీవల కాలంలో చైనాతో సంబంధాలు పెంచుకుంటూ పోతూన్నారు. అంటే గతంలో మనద్వారా అనేక విధాలుగా లబ్ధిపొందిన మన ఇరుగుపొరుగు దేశాలు మనకు దూరంగా జరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో మన దౌత్య విధానంలో (లేదా) దౌత్యనీతిలో ఎక్కడో ఒకచోట 'గ్యాప్' ఏర్పడుతుంది. ఆలోపం విధానాల్లో ఉందా? లేదా రాజకీయ పరిపక్వత లేకుండా ఉన్న రాజకీయ నేతల్లోఉందా? త్వరితగతిన విశ్లేషణ చేసుకోవాలి. పరిష్కారం దిశగా అడుగులు వేయాలి.లేకపోతే వేమన చెప్పినట్లు 'ఇంటిలోని పోరు ఇంతింత కాదయ్యా' అన్నట్లు, మన ఇరుగు పొరుగు దేశాలతో వివిధ రకాల తలపోట్లు తలెత్తుతాయి. మనం చాలా విషయాల్లో అభివృద్ధి చెందుతున్నామని మనం పాలకులు చెబుతున్న మాటల్లో కొంతమేరకు వాస్తవం ఉన్నా, అదే సమయంలో మన చుట్టు పక్కల దేశాలు మనకు ఎందుకు దూరంగా జరుగుతున్నాయి అనే విషయాన్ని విశ్లేషణ చేసుకోవాలి. మనకు అత్యంత మిత్ర దేశం అయిన రష్యా కూడా ఇటీవల పాకిస్థాన్‌తో అనేక వేలకోట్ల రూపాయలతో ఒప్పందం చేసుకున్న సంగతి మరువరాదు.. అలాగే ఇరాన్ పై ఇజ్రాయెల్, అమెరికా చేస్తున్నదాడుల విషయంలో కూడా ఇప్పటి వరకూ మనం నోరు మెదపకుండా ఉండటం కూడా సబబుగా లేదు అని చాలామంది రాజనీతిజ్ఞులు అభిప్రాయం వ్యక్తంచేశారు. ఇతర దేశాలతో మన పొరుగు దేశాలు వారివారి అభివృద్ధికి ఒప్పందాలు చేసుకోవడం తప్పుకాదు కానీ మనకు దూరంగా జరుగుతున్న పరిణామాలు పై మాత్రం మనం దౌత్య పరంగా ఆలోచన చేయవలసి ఆవశ్యకత ఉంది. మనదౌత్య విధానంలో ఉన్న చిన్నచిన్న గ్యాప్‌లను సరిచేసుకోవాలి. అందరితో స్నేహంగా ఉండేటట్లు చూసుకోవాలి. ప్రస్తుతం ఒక్క అమెరికా పక్షాన నిలబడుతున్నట్లు కనపడుతున్న పరిస్థితి నుంచి చాకచక్యంగా వ్యవహరించి బయటపడాలి. ఇప్పటికే కాశ్మీర్ విషయంలో ట్రంప్ పాత్ర లేదు అని చెప్పడం జరిగింది. అయితే ఇంకా అనేక విషయాల్లో స్పష్టతగా మన వైఖరి చెప్పవలసి ఉంది. అలాగే అవసరమైన సందర్భాల్లో మాజీ దౌత్యవేత్తల సలహాలు, ప్రతిపక్ష నాయకుల అభిప్రాయాలను తీసుకోవాలి. భవిష్యత్తులో భారత్ దౌత్యవిధానం, దౌత్యనీతి అందరూ మెచ్చే విధంగా, ఆదర్శంగా ఉండాలని ఆశిద్దాం. 2047 నాటికి మన దేశం 'వికసిత భారత్' గా అవతరించాలంటే అందరితో కలిసిమెలిసి ఉండేవిధంగాదౌత్య విజయం సాధించడం అతి ప్రాముఖ్యమైన విషయం అదే సమయంలో రాజ్యాంగ ఆశయాలను ఆచరణలో పెట్టాలి. •



# లక్ష్యాలకు చేరువలో ఉన్నాం

## ఇరాన్ అణుకేంద్రాలకు తీవ్రనష్టం కలిగించాం

## ఇజ్రాయెల్ అధ్యక్షుడు నెతన్యాహు

**టెల్ అవీవ్,జూన్ 23:** ఇరాన్ విషయంలో తాము నిర్దేశించుకున్న లక్ష్యాలకు అత్యంత చేరువలో ఉన్నామని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ప్రకటించారు. ఇరాన్ బాలిస్టిక్ క్షిపణి కార్యక్రమానికి, అణు కేంద్రాలకు గణనీయమైన నష్టం కలిగించామని ఆయన తెలిపారు. అయితే, లక్ష్యాలు పూర్తిగా నెరవేరే వరకు తమ సైనిక చర్యలను ఆపేది లేదని స్పష్టం చేశారు. ఇరాన్‌లోని కీలక అణు కేంద్రాలపై అమెరికా దాడులు జరిపిన నేపథ్యంలో నెతన్యాహు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇరాన్‌లోని ఫోర్డో అణు కేంద్రానికి అమెరికా దాడుల వల్ల చాలా తీవ్రమైన నష్టం వాటిల్లిందని ఆయన తెలిపారు. ఇరాన్ అణు కార్యక్రమం నుంచి ముప్పును తొలగిస్తున్నామని, వారిని వెనక్కి పంపిస్తున్నామని నెతన్యాహు పేర్కొన్నారు. లక్ష్యాలను సాధించడానికి అవసరమైన దానికంటే ఎక్కువగా మా చర్యలను కొనసాగించము. అలాగని చాలా త్వరగా ముగించము కూడా. లక్ష్యాలు నెరవేరి నప్పుడు, ఆపరేషన్ పూర్తవుతుంది. పోరాటం ఆగిపోతుందని నెతన్యాహు స్పష్టం చేశారు. సుదీర్ఘ పోరులోకి ఇరాన్‌ను లాగడానికి తాము సిద్ధంగా లేమని విలేకరులతో ఆయన అన్నారు. ఇజ్రాయెల్‌ను పూర్తిగా తుడిచిపెట్టాలనేదే ఇరాన్ పాలకుల ఉద్దేశం. ఈ విషయంలో నాకు ఎటువంటి సందేహం లేదు. అందుకే మా ఉనికికి ఉన్న రెండు ప్రధాన ముప్పులను తొలగించడానికి ఈ ఆపరేషన్ చేపట్టాం. ఈ లక్ష్యాలను సాధించే దిశగా మేం అంచెలంచెలుగా ముందుకు సాగుతున్నాం. వాటిని పూర్తి చేయడానికి మేం చాలా, చాలా దగ్గరలో ఉన్నామని నెతన్యాహు వివరించారు. ఇరాన్ వద్ద ఉన్న 400 కిలోల 60 శాతం శుద్ధి చేసిన యురేనియం ఎక్కడుందన్న ప్రశ్నకు, నెతన్యాహు తమ వద్ద ఈ విషయమై ఆసక్తికరమైన నిఘా సమాచారం ఉందని తెలిపారు. కానీ వివరాలు చెప్పడానికి నిరాకరించారు. మేం దాన్ని చాలా నిశితంగా గమనిస్తున్నాం. అది అణు కార్యక్రమంలో ఒక ముఖ్యమైన భాగం అని నేను మీకు చెప్పగలను. దానిపై మా వద్ద ఆసక్తికరమైన సమాచారం ఉంది. దాన్ని మీతో పంచుకోనందుకు నన్ను క్షమించండని ఆయన అన్నారు.

ఇరాన్ అణు కేంద్రాలపై ఇజ్రాయెల్ చర్యల సమయం గురించి నెతన్యాహు మాట్లాడుతూ 2024 సెప్టెంబర్‌లో హిజ్బుల్లా నాయకుడు హసన్ నస్రల్లా హత్య తర్వాత టెహ్రాన్ అణు ఆయుధీకరణ వైపు వేగంగా వెళుతుండటంతో ఇజ్రాయెల్ చర్యలు తీసుకోవలసి వచ్చిందని అన్నారు. 2023 అక్టోబర్ 7న దక్షిణ ఇజ్రాయెల్‌లో హమాస్ ఉగ్రవాదుల దాడి తర్వాత లెబనాన్ ఉగ్రవాద సంస్థ హిజ్బుల్లా ఇజ్రాయెల్ ఉత్తర సరిహద్దులోని కమ్యూనిటీలు, సైనిక స్థావరాలపై దాడులు ప్రారంభించింది. దీంతో ఏడాదికి పైగా సాగిన ఘర్షణల్లో దక్షిణ లెబనాన్‌లో కొన్ని నెలల పాటు జరిగిన పూర్తిస్థాయి యుద్ధంలో ఒకప్పుడు టెహ్రాన్ బలమైన పరోక్ష శక్తిగా ఉన్న హిజ్బుల్లా తీవ్రంగా బలహీనపడింది.

నెలకు 300 బాలిస్టిక్ క్షిపణులను నిర్మించాలన్న ఇరాన్ ప్రణాళికలు కూడా నిర్వీర్యం చేసామన్నారు. గత 10 రోజుల్లో ఇస్లామిక్ రిపబ్లిక్‌లోని సగానికి పైగా బాలిస్టిక్ క్షిపణి ప్రయోగ కేంద్రాలను నిర్వీర్యం చేసినట్లు ఆయన చెప్పారు. ఈ ముప్పు తీవ్రత గురించి తాను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో తన ఆందోళనలను పంచుకున్నానని, ఆయన దీనిని అర్థం చేసుకున్నారని నెతన్యాహు తెలిపారు. మేం చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని ఆయనకు చెప్పాను. ఆయన దాన్ని చాలా బాగా అర్థం చేసుకున్నారు. కీలక సమయంలో ఆయన సరైన పని చేస్తారని నాకు తెలుసని నెతన్యాహు అన్నారు.



## రష్యా మాట్లాడే వారు 20 లక్షల మంది ఉన్నారు : అధ్యక్షుడు పుతిన్

**మాస్కో,జూన్ 23:** ఇజ్రాయెల్, అమెరికా దాడులతో అల్లాడుతోంది. అయినా మిత్ర దేశం రష్యా ఎందుకు మిన్నకుండిపోతోందని అంతర్జాతీయ మీడియా రష్యా అధ్యక్షుడి ముందు ప్రస్తావించింది. రష్యా స్నేహధర్మంపై సందేహాలు మొదలయ్యాయని చెప్పుకొచ్చారు. సెయింట్ పీటర్స్‌బర్గ్ అంతర్జాతీయ ఎకనామిక్ ఫోరంలో ఎదురైన ఈ ప్రశ్నకు పుతిన్ సవివరంగా బదులిచ్చారు. మాజీ సోవియట్ యూనియన్, రష్యా ఫెడరేషన్‌కు చెందిన సుమారు 2 మిలియన్ల మంది ఇజ్రాయెల్‌లో ఉంటున్నారు. ఈ విషయాన్ని అందరూ గమనించాలి. దీంతో, అదో రష్యన్ దేశంగా కనిపిస్తోంది. అందుకే తటస్థంగా ఉండాల్సి వస్తోంది. అదే సమయంలో మేము రష్యా చరిత్రను కూడా పరిగణనలోకి తీసుకుంటామని అన్నారు. రష్యా స్నేహ ధర్మాన్ని ప్రశ్నిస్తున్న వారి సందేహాలను కూడా ఆయన తోసి పుచ్చారు. వీళ్లందరూ రష్యాను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. అరబ్ దేశాలతో పాటు ఇస్లామిక్ దేశాలతో కూడా తమకు మంచి సంబంధాలు ఉన్నాయని అన్నారు. రష్యా జనాభాలో 15 శాతం మంది ముస్లింలేనని కూడా తెలిపారు. ఇస్లామిక్ దేశాల సహకార కూటమిలో కూడా తాము పరిశీలక దేశంగా ఉన్న విషయాన్ని ప్రస్తావించారు. ఇరాన్ అణుస్థావరాలపై అమెరికా దాడులను రష్యా తీవ్రంగా ఖండించింది. ఇది బాధ్యతారాహిత్యం, అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించడమేనని మండిపడింది. పరిస్థితిని ప్రమాదకరంగా దిగజారుస్తూ ప్రాంతీయ స్థిరత్వం, భద్రతలను దెబ్బతీస్తున్నారని మండిపడింది. ఇరాన్‌కు అణ్వాయుధాలు సరఫరా చేసేందుకు పలు దేశాలు సిద్ధంగా ఉన్నాయని రష్యా మాజీ అధ్యక్షుడు డిమీట్రీ మెద్వెదేవ్ కూడా హెచ్చరించారు. ట్రంప్ చర్యల కారణంగా అమెరికా మరో యుద్ధంలో ఇరుక్కుపోయే ప్రమాదం ఉందని అన్నారు. ఇరాన్, రష్యా మధ్య ఎంతో కాలంగా గట్టి దౌత్య సంబంధాలు ఉన్నాయి. అయితే, ఇప్పటివరకూ రష్యా ఇరాన్‌కు ఎలాంటి ఆయుధాలు సరఫరా చేయలేదు.

## ఇరాన్‌కు అణ్వాయుధాలు ఇచ్చేందుకు చాలా దేశాలు రెడీ

### రష్యా మాజీ అధ్యక్షుడు డిమిత్రి మెద్వెదేవ్

**మాస్కో,జూన్ 23:** ఇరాన్‌కు అణ్వాయుధాలు ఇచ్చేందుకు చాలా దేశాలు రెడీగా ఉన్నాయని రష్యా మాజీ అధ్యక్షుడు డిమిత్రి మెద్వెదేవ్ సంచలన వ్యాఖ్యలు చేసారు.ఇరాన్ ప్రజలు ఇప్పుడు నిరంతర ముప్పు భయంలో ఉన్నారని, దేశంలోని అనేక చోట్ల పేలుళ్ల జరుగుతున్నాయని చెప్పారు. దాడుల వల్ల రాజకీయంగా ఇరాన్ బలపడుతుందన్నారు. ఇరాన్ రాజకీయ వ్యవస్థకు ఇబ్బందేమీ లేదని చెప్పారు. ఇరాన్‌లోని ఫోర్డో, నాటాంజ్, ఇస్ఫహాన్ అణు కేంద్రాలపై ఆదివారం తెల్లవారుజామున అమెరికా బీ2 బాంబర్లపై దాడి చేయడంపై రష్యా మాజీ అధ్యక్షుడు, రష్యా భద్రతా మండలి డిప్యూటీ చైర్మన్ డిమిత్రి మెద్వెదేవ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. శాంతిని ప్రకటిస్తూ అధికారంలోకి వచ్చిన ట్రంప్ అమెరికాను మధ్యప్రాచ్యాన్ని యుద్ధంలోకి నెట్టేస్తున్నారని మండిపడ్డారు. ఇరాన్‌పై దాడిలో అక్కడ పెద్దగా నష్టమేమీ జరగలేదని, అమెరికా సైనిక లక్ష్యం విఫలమైందని చెప్పారు. ఇరాన్‌లోని న్యూక్లియర్ ఫ్యూయల్ సైకిల్‌కు చెందిన క్రిటికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు ఎలాంటి నష్టం జరిగినట్టు కనిపించడం లేదు. డ్యామేజ్ చాలా స్వల్పంగానే ఉంది. అణు పదార్థాల సుసంపన్నత, భవిష్యత్తులో అణ్వాయుధాల తయారీ కొనసాగుతుందని ఇప్పుడు మనం బహిరంగంగా చెప్పగలనని మెద్వెదేవ్ పేర్కొన్నారు. ఇరాన్‌కు నేరుగా తమ న్యూక్లియర్ వార్‌హెడ్‌లను సరఫరా చేసేందుకు అనేక దేశాలు సిద్ధంగా ఉన్నాయని మెద్వెదేవ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అయితే ఆ దేశాల పేర్లను ఆయన చెప్పలేదు. ఇరాన్ ప్రజలు ఇప్పుడు నిరంతర ముప్పు భయంలో ఉన్నారని, దేశంలోని అనేక చోట్ల పేలుళ్ల జరుగుతున్నాయని చెప్పారు. దాడుల వల్ల రాజకీయంగా ఇరాన్ బలపడుతుందన్నారు. ఇరాన్ రాజకీయ వ్యవస్థకు ఇబ్బందేమీ లేదని, మరింత బలపడే అవకాశం కూడా ఉందని చెప్పారు. ఇంతకు ముందు పాలనా వ్యవస్థతో విభేదించిన వారితో సహా ప్రజలు దేశ ఆధ్యాత్మిక నాయకత్వం వైపు మొగ్గుచూపనున్నారని అన్నారు. కాగా, ఇరాన్ అణుస్థావరాలపై అమెరికా దాడుల నేపథ్యంలో తాను మాస్కో వెళ్తున్నట్టు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చి ప్రకటించారు. రష్యా అధ్యక్షుడు వ్లాడిమిర్ పుతిన్‌తో ఉన్నత స్థాయి సమావేశం జరుపనున్నట్టు చెప్పారు. ఇస్తాం బుల్‌లో ఓఐసీ సదస్సులో పాల్గొనేందుకు వచ్చిన అరాగ్చి పుతిన్‌ను కలుస్తామని తెలిపారు. ఇరాక్‌కు రష్యా మిత్రుడని, తాము ఒకరితో ఒకరు ఎప్పుడూ సంప్రదించుకుంటూనే ఉంటామని చెప్పారు. పుతిన్‌తో సీరియస్ చర్చలు జరపనున్నట్టు చెప్పారు.

## తప్పక ప్రతీకారం తీర్చుకుంటాం..

### ఐక్యరాజ్యసమితిలో ఇరాన్ రాయబారి



**న్యూయార్క్,జూన్ 23:** అమెరికా, ఇజ్రాయెల్ ఇటీవల చేపట్టిన వైమానిక దాడులపై ఇరాన్ రాయబారి అమీర్ సయీద్ ఇరావానీ తీవ్రంగా స్పందించారు. అమెరికాపై తగిన సమయంలో స్పందిస్తామని పేర్కొన్నారు. న్యూయార్క్‌లో జరిగిన ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి అత్యవసర సమావేశంలో ఆయన అమెరికాపై ధ్వజమెత్తారు. అలాగే ఈ సమావేశంలో రష్యా, ఇరాన్ ప్రతినిధులు కూడా స్పందించారు. తమకు పూర్తి రక్షణ హక్కు ఉంది. అమెరికా, ఇజ్రాయెల్ చేసిన దాడులపై ఇరాన్ తగిన విధంగా స్పందిస్తుంది. ఆ స్పందన ఎప్పుడు, ఎలా, ఏ స్థాయిలో ఉంటుందో ఇరాన్ సైనిక బలగాలే నిర్ణయించేది. మరోవైపు దౌత్యాన్ని ఇజ్రాయెల్ ధ్వంసం చేసింది. ఇజ్రాయెల్ ఉద్దేశపూర్వకంగా దౌత్య మార్గాన్ని నాశనం చేసింది. తాము సమాధానానికి సిద్ధంగా ఉన్నట్టు ఇజ్రాయెల్ నటించినా, అది అంతర్జాతీయ సమాజాన్ని మభ్యపెట్టే ప్రయత్నమే అవుతుందని ఆయన అన్నారు. పాశ్చాత్య దేశాలపై కూడా ఇరావానీ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. పాశ్చాత్య దేశాలు ఇరాన్ చర్చల తిరిగి రావాలని అంటున్నాయని, అసలు తాము చర్చల నుంచి బయటకు వెళ్లలేదన్నారు. తమ మా విదేశాంగ మంత్రి ఇప్పటికే స్పష్టం చేశారని గుర్తు చేశారు. చర్చలు జరుగుతున్న వారంలోనే అమెరికా ఈ దాడులు చేసిందని, వాటిని చూసి ఏం నేర్చుకోవాలని ఆయన అడిగారు. ఇలాంటి చర్యలు అత్యంత రాజకీయ ఉద్దేశ్యాలతో చేసినవని, అంతర్జాతీయ నిబంధనలకు విరుద్ధమైనవని అన్నారు. ఇరాన్‌లో పౌరుల ప్రాణనష్టానికి, ముఖ్యంగా మహిళలు, పిల్లలు మృతి చెందటానికి, అత్యవసర సదుపాయాల వినాశనానికి అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, ఇజ్రాయెల్ పూర్తిగా బాధ్యత వహించాలని ఘాటుగా స్పందించారు. ఈ సమయంలో భద్రతా మండలి తగిన చర్యలు తీసుకోకపోతే అంతర్జాతీయ శాంతి భద్రతను కాపాడే బాధ్యతను, విశ్వసనీయతను శాశ్వతంగా కోల్పోతుందని ఇరావానీ స్పష్టం చేశారు. ఇరాన్‌పై అమెరికా జరిపిన వైమానిక దాడులపై అత్యవసర సమావేశంలో రష్యా ఐక్యరాజ్యసమితి రాయబారి వాసిలీ నెబెంజియా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరాన్ అణు కేంద్రాలపై అమెరికా వైమానిక దాడులపై ఇజ్రాయెల్ ఐక్యరాజ్యసమితి శాశ్వత ప్రతినిధి డ్యానీ డానాన్ కొనియాడారు. ఈ దాడులను ఆయన మానవాళికి ఉన్న అతిపెద్ద ముప్పును తొలగించే కీలక చర్యగా అభివర్ణించారు. అయినా దాన్ని కొన్ని దేశాలు దాన్ని తప్పుపడుతున్నాయని భద్రతా మండలి సభ్యులను ప్రశ్నించారు. ఇరాన్ పౌర వినియోగానికి మించిన స్థాయిలో యూరేనియం ఎన్ని టైమ్స్ శుద్ధి చేస్తే మీరు మౌనంగా అంటారని అడిగారు. ఖిఇజ్రాయెల్‌ను నాశనం చేయాలన్న వారి ఆలోచలన గురించి మీరు ఎందుకు స్పందించలేకపోయారని నిల దీశారు. ఇరాన్ చర్చల ముసుగులో రహస్యంగా రాకెట్లు నిర్మించడంలో యూరేనియం శుద్ధిలో పురోగమించిందన్నారు. వారికి అన్ని అవకాశాలు ఇచ్చామన్నారు.కానీ వారు మారకపోతే, మార్చాల్సిన అవసరమే వచ్చిందని స్పష్టం చేశారు.



## సిరియా చర్చిలో ఆత్మాహుతి దాడి: 24మంది మృతి

**డమాస్కస్:** సిరియా రాజధాని డమాస్కస్ శివారులో ఉన్న ఓ చర్చిలో ఆత్మాహుతి (Suicide Bombing) దాడి జరిగింది. డ్వెయిల్ ప్రాంతంలోని మార్ ఎలియాస్ చర్చిలో ఈ ఘటన చోటుచేసుకున్నది. కిక్కిరిసిన చర్చిలో జనం ప్రార్థనలు చేస్తుండగా ఓ వ్యక్తి తనను తాను పేల్చుకున్నాడు. దీంతో ఇప్పటివరకు 22 మంది చనిపోయారు.మరో 63 మంది గాయపడ్డారు. చనిపోయినవారులో చిన్నారులు కూడా ఉన్నారు. ఈ దాడికి సంబంధించి ఏ ఉగ్రసంస్థ బాద్యులమని ప్రకటించుకోలేదు. Damascus l చర్చిలో జనం మధ్యకు చేరుకున్న ఓ వ్యక్తి తొలుత తుపాకీతో కాల్పులు జరిపి, అనంతరం తనను తాను పేల్చుకున్నట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపినట్లు సిరియా అంతర్గత మంత్రిత్వ శాఖ వెల్లడించింది.దుండగుడు చర్చిలో గ్రెనేడ్ విసిరినట్లు చర్చి బిషప్ తెలిపారు. దాడికి పాల్పడినవ్యక్తిని తాను చూశానని, అతనితోపాటు మరో ఇద్దరు కూడా ఉన్నారని ప్రత్యక్ష సాక్షి పేర్కొన్నారు. ఈ దాడిని సిరియా సమాచార మంత్రిత్వశాఖ మంత్రి హమ్జా మొస్తాఫా ఖండించారు.దీనిని పిరికిపంద దాడిగా అభివర్ణించారు. కాగా,చర్చిల్లో దాడులు జరగడం సిరియాలో ఇటీవలి ఇదే మొదటిసారి కావడం గమనార్హం.

## హనీమూన్ మర్డర్‌కేసులో ప్రాపర్టీ డీలర్

### రఘువంశీ హత్యలో కొత్త ట్విస్ట్




**షిల్లాంగ్,జూన్ 23:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన మేఘాలయ హనీమూన్ హత్య కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. భర్త రాజా రఘువంశీని హత్య చేసిన కేసులో ప్రధాన నిందితురాలైన సోనమ్ రఘువంశీ, ఆమె అనుచరులు ఇండోర్‌లోని ఒక ఫ్లాట్‌లో తలదాచుకున్న విషయం తెలిసిందే. అయితే, ఇప్పుడు ఆ ఫ్లాట్ యజమాని లోకేంద్ర తోమర్‌పై మేఘాలయ ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) దృష్టి సారించింది. హత్యకు సంబంధించిన కీలక సాక్ష్యాధారాలను లోకేంద్ర తోమర్ మాయం చేశాడని పోలీసులు అనుమానిస్తున్నారు. పోలీసు వర్గాల సమాచారం ప్రకారం, సోనమ్ రఘువంశీ ఇండోర్‌లోని హీరాబాగ్ ప్రాంతంలో ఉన్న ఫ్లాట్ నుంచి వెళ్లేటప్పుడు ఒక బ్యాగ్‌ను అక్కడే వదిలేసింది. ఆ బ్యాగ్‌లో ఒక నాటు తుపాకీ, ఆమె ఫోన్, రాజాకు చెందిన కొన్ని నగలు, సుమారు ఐదు లక్షల రూపాయల నగదు ఉన్నాయని భావిస్తున్నారు. ఈ బ్యాగ్‌ను ఫ్లాట్ యజమాని, ఒక నిర్మాణ రంగ సంస్థ అధినేత అయిన లోకేంద్ర తీసుకెళ్లాడని సిట్ అనుమానిస్తోంది. ఈ కేసులో అరెస్టయిన ప్రాపర్టీ డీలర్ సిలోమ్ జేమ్స్‌ను విచారిస్తున్న సమయంలో లోకేంద్ర పేరు వెలుగులోకి వచ్చింది. హత్య నిందితులకు ఫ్లాట్‌ను అద్దెకు ఇప్పించింది ఈ సిలోమ్ జేమ్స్. సోనమ్ పోలీసులకు లొంగిపోయిన కాసేపటికి ఫ్లాట్ నుంచి ఆమె బ్యాగ్‌ను తీసేయమని లోకేంద్ర తనను అడిగాడని సిలోమ్ జేమ్స్ పోలీసులకు చెప్పాడు. అయితే, తాను తీయకపోవడంతో ఫ్లాట్ యజమానే స్వయంగా ఆ బ్యాగ్‌ను తీసుకెళ్లాడని జేమ్స్ తెలిపాడు. అంతేకాకుండా, తన ఫ్లాట్ సమీపంలోని ఒక కారు షోరూమ్ సీసీటీవీ ఫుటేజ్‌ను సంపాదించడానికికూడా తోమర్ ప్రయత్నించాడని పోలీసు వర్గాలు పేర్కొన్నాయి. ప్రస్తుతం లోకేంద్ర తోమర్ పరారీలో ఉన్నాడని, అతని ఫోన్ స్విచ్ ఆఫ్ అయిందని తెలిసింది. ఇండోర్ లో అతని కోసం పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు.

## సీటివ్వలేదని ప్రయాణికుడిపై బిజెపి ఎమ్మెల్యే దాడి



**న్యూఢిల్లీ,జూన్ 23:** వందే భారత్ రైలులో ఓ ఎమ్మెల్యే ప్రయాణికుడిపై దౌర్జన్యానికి పాల్పడ్డాడు. సీటు మార్చుకోలేదన్న కోపంతో తన అనుచరులతో కొట్టించాడు. ఎమ్మెల్యే అనుచరుల దాడిలో ఆ ప్రయాణికుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన ఢిల్లీ భోపాల్ వందే భారత్ రైలులో ఆలస్యంగా వెలుగుచూసింది. సంఘటనకు సంబంధించిన వివరాల్లోకి వెళితే ఉత్తర ప్రదేశ్, ఝూన్సీ ఎమ్మెల్యే రాజీవ్ సింగ్ తన భార్య, కొడుకుతో కలిసి ఢిల్లీభోపాల్ వందే భారత్ రైలు ఎక్కాడు. అయితే, ఆ ఎమ్మెల్యేకు కంపార్ట్ మెంట్ చివరన సీటు కేటాయించబడింది. ఆయన భార్య, కొడుకు కంపార్ట్‌మెంట్ ముందు భాగంలో సీట్లు కేటాయించబడ్డాయి.

భార్య, కొడుకు దగ్గర కూర్చోవాలని ఎమ్మెల్యే అనుకున్నాడు. వారి పక్క సీటులో ఉన్న వ్యక్తిని సీటు మారమని అడిగాడు. ఇందుకు అతడు ఒప్పుకోలేదు. దీంతో ఎమ్మెల్యే ఆగ్రహానికి గురయ్యాడు. తన అనుచరులకు విషయం చెప్పాడు. రైలు ఝూన్సీకి రాగానే ఎమ్మెల్యే అనుచరులు కంపార్ట్‌మెంట్‌లోకి వచ్చారు. సీటు మార్పుకు ఒప్పుకోని వ్యక్తితో గొడవ పెట్టుకున్నారు. తర్వాత విచక్షణా రహితంగా అతడిపై దాడి చేసి కొట్టారు. ఆ వ్యక్తిని చెప్పులతో కూడా కొట్టడం గమనార్హం. ఎమ్మెల్యే అనుచరుల దాడిలో ఆ వ్యక్తి ముక్కుకు దెబ్బ తగిలింది. రక్తం బొటబొటా కారింది. ఆ రక్తంతో చొక్కా మొత్తం తడిసిపోయింది. ఇక్కడ ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే దాడి తర్వాత ఎమ్మెల్యేనే బాధితుడిపై రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎమ్మెల్యే తన కంప్లైంట్‌లో నేను నా భార్య, కొడుకుతో రైలులో ప్రయాణిస్తూ ఉన్నాను. అతడు నా భార్యతో తప్పుగా ప్రవర్తించాడని పేర్కొన్నాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సీటు విషయంలోనే గొడవ జరిగినట్లు గుర్తించారు. సీసీటీవీ ఆధారంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రస్తుతం సంఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.




## ఇజ్రాయెల్ విద్యుత్ కేంద్రాలపై ఇరాన్ క్షిపణి దాడులు

### అంధకారంలో పలు ప్రాంతాలు

**టెహ్రాన్, జూన్ 23:** ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలు తారస్థాయికి చేరుకున్నాయి. ఇరాన్‌లోని బాలిస్టిక్ క్షిపణి స్థావరాలపై దాడులు చేసి ఇజ్రాయెల్ ధ్వంసం చేసింది. మరోవైపు తాజాగా ఇరాన్ క్షిపణులతో ఇజ్రాయెల్‌పై విరుచుకుపడింది. ఇరాన్ 15 బాలిస్టిక్ క్షిపణులతో పలు ప్రాంతాల్లో దాడులకు ఐడిఎఫ్ వెల్లడించింది. 40 నిమిషాలపాటు ఈ దాడులకు పాల్పడినట్లు తెలిపింది. పలు ప్రాంతాల్లో సైరన్లు మోగుతున్నట్లు వెల్లడించింది. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించింది. తాజా ఇరాన్ దాడుల్లో ఎవరూ గాయపడినట్లు సమాచారం లేదని అయితే పలుచోట్ల మౌలిక సదుపాయాలు దెబ్బతిన్నాయని పేర్కొంది.

ఇజ్రాయెల్‌లోని విద్యుత్ కేంద్రాలు లక్ష్యంగా ఇరాన్ క్షిపణి దాడులకు దిగినట్లు ఇజ్రాయెల్ పేర్కొంది. దక్షిణ ఇజ్రాయెల్‌లోని వ్యూహాత్మక విద్యుత్ కేంద్రాలై ఇరాన్ దాడులకు పాల్పడినట్లు ఇజ్రాయెల్ ఎలక్ట్రిక్ కార్పొరేషన్ తెలిపింది. ఈ కారణంగా పలు ప్రాంతాలు అంధకారంలోకి వెళ్లాయని పేర్కొంది. 'ఆ ప్రాంతాల్లో వీలైనంత త్వరగా విద్యుత్ సరఫరా పునరుద్ధరించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. మరమ్మతులు చేపడుతున్నాం. అయితే భద్రత కారణాల రీత్యా సెక్యూరిటీ ఫోర్సెస్‌తో సమన్వయం చేసుకుంటూ ఈ పనులు చేపడుతున్నాం' అని ఎలక్ట్రిక్ కార్పొరేషన్ వెల్లడించింది.

ఇరాన్ దాడుల నేపథ్యంలో సైరన్లు మోగుతున్న ప్రాంతాల్లో ప్రజలంతా బాంబు షెల్టర్ కేంద్రాల్లోనే ఉండాలని ఇజ్రాయెల్ అధికారులు సూచించారు. మరోవైపు ఇరాన్‌లోని బాలిస్టిక్ స్థావరాలే లక్ష్యంగా తాజాగా దాడులు చేసినట్లు ఐడిఎఫ్ పేర్కొంది. ఇజ్రాయెల్ వాయుసేన సోమవారం ఉదయం కెర్మాన్‌షా ప్రాంతంలో 15యుద్ధ విమానాలతో ఇరానియన్ బాలిస్టిక్ క్షిపణి ప్రయోగ స్థావరాలను ధ్వంసం చేసినట్లు వెల్లడించింది.




## ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం వేళ.. టెహ్రాన్‌లో భారతీయ ఇంజినీర్ అదృశ్యం

**న్యూఢిల్లీ, జూన్ 23:** పశ్చిమాసియాలో ఉద్రిక్తలు నానాటికీ పెరుగుతున్నాయి. అటు అమెరికా, ఇటు ఇజ్రాయెల్ దాడులతో ఇరాన్‌లో పరి స్థితులు భయానకంగా ఉన్నాయి. ఈ ఉద్రిక్తతల వేళ భారత్‌కు చెందిన ఓ ఇంజినీర్ ఇరాన్‌లో అదృశ్యమయ్యారు. దీనితో తమకు సాయం చేయాలని అతడి కుటుంబం కేంద్ర ప్రభుత్వాన్ని అభ్యర్థించింది. బీహార్‌లోని సివాన్ ప్రాంతానికి చెందిన సిరాజ్ అలీ అన్సారీ (25) ఓ ప్రైవేట్ కంపెనీలో క్వాలిటీ కంట్రోల్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. కొన్నిరోజుల క్రితం అతడితోపాటు మరో 30-35మంది సదరు కంపెనీ నెల రోజుల వర్క్ వీసాపై ఇరాన్‌లో అరాక్ ప్రాంతంలో ఓ ప్లాంట్ నిర్మాణం కోసం పంపించింది. దీంతో సిరాజ్ ఈ నెల9న సౌదీ అరేబియా మీదుగా ఇరాన్ చేరుకున్నాడు. ఆ తర్వాత కొన్ని రోజులకే ఇరాన్‌పై ఇజ్రాయెల్ 'ఆపరేషన్ రైజింగ్ లయన్' పేరుతో దాడులు చేపట్టింది.

వీరు ఉన్న అరాక్ ప్రాంతంలోనూ ఇజ్రాయెల్ క్షిపణి దాడులు చేసింది. దీంతో సిరాజ్‌తోపాటు మిగతా వారిని ఓ రిఫైనరీ ప్లాంట్ టౌన్‌షిప్‌కు తరలించారు. అయితే ఆ తర్వాత నుంచి తమ కుమారుడి ఆచూకీ తెలియరావడంలేదని సిరాజ్ తండ్రి హజ్రత్ అలీ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 17న అతడితో చివరిసారిగా మాట్లాడానని, ఆ తర్వాత నుంచి ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తోందని తెలిపారు. తాను ఉంటున్న ప్రాంతానికి కేవలం కిలోమీటరు దూరంలోనే పేలుడు సంభవించినట్లు సిరాజ్ తమతో చివరిసారిగా చెప్పినట్లు అతడి తండ్రి మీడియాకు వివరించారు. తమ కుమారుడి ఆచూకీ కోసం జిల్లా యంత్రాంగాన్ని ఆశ్రయించామని అన్నారు. అతడి ఆచూకీ గుర్తించి క్షేమంగా స్వదేశానికి తీసుకొచ్చేందుకు సాయం చేయాలని కేంద్ర విదేశాంగ శాఖను అభ్యర్థించారు. ఇరాన్-ఇజ్రాయెల్ ఉద్రిక్తతలతో పశ్చిమాసియా రగులుతోన్న సంగతి తెలిసిందే. దీంతో ఇరాన్‌లో చిక్కుకున్న భారతీయుల కోసం భారత్ 'ఆపరే షన్ సింధు' కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా ఆదివారం సాయంత్రం మరో 285 మందిని స్వదేశానికి తీసుకొచ్చింది. అలా ఇప్పటివరకు ఇరాన్‌నుంచి 1,713 మంది భారతీయులను క్షేమంగా స్వదేశానికి తరలించింది.

## ఇజ్రాయెల్‌కు గూఢచర్యం చేస్తున్నారని.. ఇరాన్‌లో వరుస ఉరిశిక్షలు!



**టెహ్రాన్, జూన్ 23:** ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య యుద్ధం తీవ్ర స్థాయికి చేరుకుంది. భీకర దాడులతో ఇరుపక్షాలు విరుచుకుపడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇజ్రాయెల్‌కు గూఢచర్యం చేస్తున్న ఓ వ్యక్తికి ఇరాన్ ఉరిశిక్షను అమలుచేసింది. ఇజ్రాయెల్ ఇంటెలిజెన్స్ సర్వీస్ మొస్సాద్‌కు కీలక సమాచారం అందించిన ఘటనలో మొహమ్మద్ అమీన్ అనే వ్యక్తిని సోమవారం ఉరి తీసినట్లు ఇరాన్ న్యాయవ్యవస్థ పేర్కొంది. ఇజ్రాయెల్ దాడులు ప్రారంభించిన తర్వాత.. సమాచారం లీక్ చేస్తున్న కారణాలతో ఇరాన్ ఇలా ఉరి తీయం ఇది మూడోసారి. మొస్సాద్ సహకారంతో మొహమ్మద్ అమీన్ ఓ సైబర్ నెట్‌వర్క్‌ను నడుపుతున్నాడని.. ఇరాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మీడియా ఆపరేషన్స్ చేపట్టినట్లు అధికారులు పేర్కొన్నారు అతడు పొరుగు దేశంలో ఇజ్రాయెల్ ఏజెంట్లతో భేటీ అయినట్లు ఆరోపించారు. ఇస్లామిక్ రిపబ్లిక్ సాయుధ దళాలకు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో ప్రచారం చేయడం అతడికి అప్పగించిన పని అని పేర్కొన్నారు. ఇలాంటి గూఢచర్య ఆరోపణలతోనే గతవారం మాజిద్ మొసయేబి, ఇస్మాయిల్ ఫక్రీ అనే వ్యక్తులను ఇరాన్ ఉరి తీసింది. ఈ ఘటనలపై ప్రపంచ మానవ హక్కుల సంఘాలు, పలు సంస్థలు తీవ్రంగా స్పందిస్తున్నాయి. ఇరాన్ న్యాయ ప్రక్రియలో పారదర్శకతను ప్రశ్నిస్తూ తీవ్ర విమర్శలు చేశాయి. ఎలాంటి ఆధారాలు చూపకుండా బహిరంగ విచారణలు చేపట్టకుండా ఉరి శిక్షలను అమలు చేస్తున్నారని మండిపడ్డాయి. ఇక ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలు తారస్థాయికి చేరుకున్నాయి. తాజాగా ఇరాన్‌లోని బాలిస్టిక్ క్షిపణి స్థావరాలై దాడు చేసి ఇజ్రాయెల్ ధ్వంసం చేసింది. మరోవైపు ఇరాన్ క్షిపణులతో ఇజ్రాయెల్‌పై విరుచుకుపడింది. ఇరాన్ 15 బాలిస్టిక్ క్షిపణులతో పలు ప్రాంతాల్లో దాడులకు దిగినట్లు ఐడిఎఫ్ వెల్లడించింది.

## సంపన్నులపై ఐదుశాతం ఆదాయపుపన్ను 2028నుంచి అమలుకు ఓమన్ నిర్ణయం

**మస్కట్,జూన్ 23:** ఒమన్ దేశం ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాల కోసం అన్వేషిస్తోంది. అందులో భాగంగా ఆదాయంపై పన్ను వేయాలనుకుంటోంది. ఇన్‌కమ్ ట్యాక్స్‌ను 2028 నుంచి అమల్లోకి తీసుకురావాలని చూస్తోంది. అయితే అధిక సంపాదన ఉన్న వారి నుంచి మాత్రమే ఒమన్ పన్ను వసూలు చేయాలని భావిస్తోంది. ఏడాదికి 42 వేల రియాల్స్ అంటే 1.09లక్ష డాలర్ల కంటే ఎక్కువ సంపాదించే వారిపై 5శాతం చొప్పున పన్ను వేయాలని ఒమన్ యోచిస్తోంది.

దాంతో పన్ను పరిధిలోకి వచ్చే వారి సంఖ్య 1 శాతంగా ఉండవచ్చునని అంచనా వేస్తోంది. ఇనకమ్ ట్యాక్స్ అమల్లోకి వస్తే ఆదాయంపై పన్ను వేస్తున్న తొలి గల్ఫ్ దేశంగా ఒమన్ నిలువనుంది. అయితే ఈ ఏడాది సౌదీ అరేబియా, బహ్రెయిన్ దేశాలు ద్రవ్యలోటు ఎదుర్కొనే అవకాశం ఉందన్న అంచనాలు వెలువడుతున్నాయి. అంతర్జాతీయంగా శిలాజ ఇంధనాలకు డిమాండ్ తగ్గుతున్నందున దీర్ఘ కాలంలో ఆదాయపు పన్ను లాంటి సంస్కరణలు తీసుకురావాల్సిన అవశ్యకత ఉంటుందని ఐఎంఎఫ్ పేర్కొంటోంది. ఈ నేపథ్యంలో చమురుపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలని ఒమన్ భావిస్తోంది. తద్వారా వచ్చే ఆదాయాన్ని సంక్షేమానికి వెచ్చించాలను కుంటున్నట్లు ఒమన్ ఆర్థికమంత్రి బిన్ మహ్మద్ అల్ సక్రి స్పష్టంచేసారు. జీసీసీలోని ఇతర దేశాలకు ఒమన్ తీసుకున్న నిర్ణయం ఆదర్శంకావొచ్చని ఆర్థికవేత్తలు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం గల్ఫ్ దేశాల్లో ఆదాయంపై పన్ను ఉండదన్న కారణంతోనే ఇతర దేశాల్లోని సంపన్నవర్గాలకు చెందిన వారు అక్కడ నివాసాలు ఏర్పరచుకుంటున్నారన్నది వాస్తవమే.

# జులై 6నుండి కపిలేశ్వరుని పవిత్రోత్సవాలు

**తిరుమల,జూన్ 23ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతిలో ప్రముఖశైవాలయం కపిలేశ్వరస్వామి ఆలయంలో జులై 6వతేదీ నుండి 9వరకు మూడురోజులు పవిత్రోత్స వాలు శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. ఇందుకు జులై 6వతేదీ ఆదివారం సాయంత్రం అంకురార్పణ జరుగుతుంది. ఏడాది పొడవునా ఆలయంలో జరిగే అర్చనలు ,ఉత్స వాలు,సేవల్లో తెలియక కొన్ని దోషాలు జరుగుతుంటాయి. వీటివల్ల ఆలయ పవిత్రతకు ఎలాంటి లోపం రానీయకుండా ఆగమశాస్త్రప్రకారం పవిత్రోత్స వాలు నిర్వహిస్తారు. ఈ ఉత్స వాల్లో జులై 7వతేదీ సోమవారం మొదటిరోజు ఉదయం కపిలేశ్వరుని ఉత్స వమూర్తులకు స్నపన తిరు మంజనం, సాయంత్రం కలశపూజ, హోమం, పవిత్ర ప్రతిష్ట చేపడతారు. రెండవరోజు 8వతేదీ ఉదయం గ్రంది పవిత్ర సమర్పణ, సాయంత్రం యాగశాలపూజ, హోమం చేపడతారు. చివరిరోజు జులై 9న బుధవారం ఉదయం మహాపూర్ణాహుతి, కలశోద్వాసన, పవిత్ర సమర్పణ నిర్వహిస్తారు. సాయంత్రం 6గంటలకు పంచమూర్తులైన కపిలేశ్వరస్వామి, కామాక్షి అమ్మ,విఘ్నేశ్వరస్వామి, సుబ్రమణ్య స్వామి, చండికేశ్వరస్వామి ఊరేగింపుగా ఆలయ పురవీధుల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

# బిజెపితో దేశానికి పొంచి ఉన్న ప్రమాదం




అనంతపురం నగర వీధిలో ర్యాలీ నిర్వహిస్తున్న కమ్యునిస్టు పార్టీ కార్యకర్తలు, నాయకులు

- బిజెపి పాలనలో పెరిగిన పేదరికం, నిరుద్యోగం, అవినీతి
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

**అనంతపురం, జూన్ 23 ప్రభాతవార్త బ్యూరో** ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో లౌకిక వాదానికి, అంబేద్కర్ రచించిన రాజ్యాంగానికి కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం విఘాతం, కలిగించే విధానాలను అనుసరిస్తోందని దీనివల్ల దేశానికి ప్రమాదకరమని, ఈ విధానాలకు వ్యతిరేకంగా కలిసికట్టుగా ముందుకు సాగాల్సి న అవసరం ఉందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. సోమవారం అనంతపురంలో సిపిఐ నగర కార్యదర్శి ఎన్.శ్రీరాములు అధ్యక్షతన జరిగిన నగర మహాసభలలో రామకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కుల, మతాల మధ్య ఘర్షణ సృష్టించి రాజకీయ లబ్ది పొందడానికి కుట్రలు, కుతంత్రాలు చేస్తుందని ఆయన ఆరోపించారు. బిజెపి పార్టీ అధికారంలోకి వచ్చి 11 సంవత్స రాలు అవుతున్నప్పటికీ ఒక్క మంచి పని కూడా చెప్పుకోవడానికి ఏమీ లేదని అన్నారు. అసత్యపు ప్రచారాలతో అధికారంలోకి వచ్చి దేశ ప్రజలను నిలువునా మోసం చేసిందన్నారు. తా ము అధికా రంలోకి వస్తే సంవత్స రానికి రెండు కోట్ల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తా మని ఇచ్చిన హామీ ని అమలు చేయ డంలో విఫల మైందన్నారు. రైతు లను కార్మి కులను అన్ని వర్గాల ప్రజ లను మోసం చేసిం దన్నారు. ప్రపం చంలోనే ఎక్కడా లేనివిధంగా భారతదేశంలో 14.60 కోట్ల మంది ప్రజలు ఇప్పటికీ పేదరికంలో మగ్గుతున్నారని అంతేకాకుండా విచ్చలవిడిగా అవినీతి, నిరుద్యోగం పెరిగిందన్నారు. దేశంలో ఒక శాతం ఉన్న సంపన్న వర్గాల వారికి దోచిపెట్టడానికి మోడీ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఒక శాతం కోటీశ్వరుల చేతిలోనే 40 శాతం దేశ సంపద ఉందని మోడీ ప్రభుత్వంలో వారు మరింత కోటీశ్వరులుగా పెరిగారని తెలిపారు. బిజెపి విధానాలను ప్రశ్నించే వారిపై నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం వల్ల దేశంలో అన్ని మతాలు, కులాలు వారు ప్రశాంతమైన జీవితాన్ని కొనసాగిస్తున్నారని అయితే బిజెపి ప్రభుత్వం మాత్రం భారత రాజ్యాంగాన్ని తొలగించి దేశంలోనే ప్రజల యొక్క ఐక్యతను చెడు కొట్టడానికి చర్యలు చేపడు తుందన్నారు. ప్రజలందరూ కూడా దీనిని ఐక్యతతో వ్యతిరేకించాలన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దుర్మార్గంగా వ్యవహరిస్తూ ప్రపంచాన్ని శాసించే స్థాయికి ఎదిగారని ట్రంపు విధానాలను కూడా వ్యతిరేకించాల్సి న అవసరం ఉందన్నారు. ప్రపంచంలో శాంతి నెలకునాలంటే కమ్యూనిస్టు పార్టీలు అధికారంలోకి రావలసిన అవసరం ఉందన్నారు. భారతదేశ స్వతంత్ర పోరాటంలో సిపిఐ అగ్రభాగాన నిలిచిందని స్వతంత్రం కోసం సిపిఐకి చెందిన ఎంతోమంది ప్రాణ త్యాగాలు చేశారని ఎంతోమంది అగ్ర నాయకులు జైలుకు కూడా వెళ్లారని తెలిపారు. భారతదేశంలో వంద సంవత్స రాల చరిత్ర కలిగిన పార్టీ సిపిఐ అనిప్రజల హక్కుల కోసం అలుపెరుగని పోరాటాలను నిర్వహించిందన్నారు.

# సిఎం కప్ పోటీలతో గ్రామస్థాయి క్రీడాకారుల ప్రతిభను వెలికితీస్తాం

**హైదరాబాద్, జూన్ 23, ప్రభాతవార్త:** సిఎం కప్ పోటీలు నిర్వహించి గ్రామస్థాయి క్రీడాకారుల ప్రతిభను వెలికితీస్తామని రాష్ట్ర క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. ప్రముఖ కోచ్‌లను నియ మిస్తామని చెప్పారు. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో ఒలింపిక్ డే వేడుకలు నిర్వహించారు. 14 ప్రాంతాల నుంచి ఒలింపిక్ రన్ ద్వారా విద్యార్థులు ఇక్కడికి చేరు కున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కొత్తగా తీసుకురానున్న క్రీడా పాలసీలో అన్ని రకాల క్రీడాకా రులకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఒలింపిక్స్‌లో పతకాలు సాధించిన క్రీడాకారులకు ప్రోత్సా హకాలు అందిస్తామని పేర్కొన్నారు.'క్రీడా రంగానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బడ్జెట్లో అధిక మొత్తం కేటాయించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకువస్తున్న క్రీడా పాలసీకి త్వరలో రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలపనుంది. నైపుణ్యమున్న యువతను బయటకు తీసుకొచ్చి జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొస్తామన్నారు. ఇటీవల ఉత్తరాఖండ్‌లో జరిగిన 38వ జాతీయ క్రీడలలో పాల్గొని తెలంగాణ రాష్ట్రానికి పతకాలు సాధించిన క్రీడా కారులకు నగదు రూ.84 లక్షలనగదు పురస్కారాన్ని అందజేశారు.

**త్వరలోనే రాష్ట్రంలో స్పోర్ట్స్ పాలసీ: జయేశ్ రంజన్**

ఒలింపిక్స్‌లో మన ప్రతిభను కనబరచడానికి కృషి చేయాలని ఐటీ,క్రీడల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ పిలుపు నిచ్చారు. ప్రపంచ వ్యాపనతంగా చాలా దేశాలు ఒలింపిక్స్‌లో తమ సత్తా చాటుతున్నా యన్నారు. క్రీడారంగంలో దేశం దూసుకు పోతోందని రాష్ట్ర ప్రభుత్వ క్రీడా సలహాదారు జితేందర్‌రెడ్డి అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి క్రీడా రంగంపై ఆసక్తిగా ఉన్నారని పేర్కొన్నారు.

**పతకాలు సాధించిన వారికి ఉద్యోగాలు: శివా సేనారెడ్డి**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా క్రీడా పాలసీని తీసుకు వస్తోందని రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి అన్నారు. దీని తర్వాత క్రీడాకారులకు మంచి ప్రోత్సా హకాలు ఉంటాయని చెప్పారు. పతకాలు సాధించిన క్రీడాకారులకు ఉద్యోగాలు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఒలింపిక్ పతక విజేత దీప్తి జీవాంజీ, ఐజి స్పోర్ట్స్ అండ్ వెల్ఫేర్ ఎం.రమేష్, డబుల్ ఒలింపియన్ మంజిత్, అర్జున అవార్డు గ్రహీతలు మిగతా దడ్ వే అనుప్‌కుమార్ యామ, ఇంటర్నేషనల్ అథ్లెట్ నందిని ఆగసర, మహిళా క్రికెటర్ గొంగిడి త్రిష వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.




# ఒక్క ప్లాట్ రూ.33 కోట్లు..

### గచ్చిబౌలిలో రికార్డు స్థాయి ధర పలుకుతున్న భూమి

### హౌసింగ్ బోర్డు స్థలాలకు డిమాండ్

**హైదరాబాద్, జూన్ 23, ప్రభాతవార్త:** రాజధాని పరిసరప్రాంతాల్లోని హౌజింగ్ బోర్డుకు చెందిన భూముల బహిరంగ వేలంలో మరోసారి రికార్డు స్థాయి ధరలు పలికాయి. గచ్చిబౌలి ప్రాంతం లోని ఒక కమర్షియల్ ప్లాట్‌ను ఏకంగా రూ.33 కోట్లకు కొనుగోలు చేయడానికి ముందుకు రాగా,మరో చోట రూ. 13.51 కోట్లు పలికింది. రెండు ఎంఐజి ప్లాట్లను కూడా సుమారు 4.50 కోట్లకు పైగా వెచ్చించి బహిరంగ వేలంలో దక్కించుకోడానికి పోటీపడ్డారు.అలాగే చింతల్ ప్రాంతంలోని ప్లాట్లను కూడా కోట్లాది రూపాయలు వెచ్చించి కొనుగోలు చేశారు.మొత్తం 11 ప్లాట్లను వేలం వేయగా రూ.65.02 కోట్ల మేర ఆదాయం వచ్చిందని హౌజింగ్ బోర్డు వైస్ చైర్మన్, హౌజింగ్ కమిషనర్ వి.పి.గౌతం తెలిపారు.నగరంలోని చింతల్, గచ్చిబౌలి, నిజాంపేట తదితర ప్రాంతాల్లో వివిధ రకాలైన ప్లాట్లకు సోమవారం నాడు హౌజింగ్ బోర్డు అధికారులు బహిరంగ వేలం నిర్వహించారు. చింతల్ ప్రాంతంలో 266 చదరపు గజాల విస్తీర్ణంలోని రెసిడెన్షియల్ ప్లాట్లు,గచ్చిబౌలి ప్రాంతంలో కమర్షియల్ ప్లాట్లు, నిజాంపేటలో 413 చదరపు గజాల ప్లాట్లు వీటిలో ఉన్నాయి.కూకట్ పల్లి కెపిహెచ్ బి కాలనీ కమ్యూనిటీ హాల్ లో నిర్వించిన ఈ స్థలాల వేలం పాటలో 55 మంది పాల్గొన్నారని హౌజింగ్ కమిషనర్ పేర్కొన్నారు.గచ్చిబౌలి ప్రాంతంలో 3271 చదరపు గజాల భూములు, చింతల్ ప్రాంతంలో 799.98 చదరపు గజాలు, నిజాంపేటలో 1653 చదరపు అడుగుల విస్తీర్ణంలో వేలం వేయగా రూ.65.02 కోట్లు బోర్డుకు ఆదాయంగా వచ్చింది. గచ్చిబౌలి హౌజింగ్ బోర్డు కాలనీలో ఉన్న 1487 గజాల కమర్షియల్ ల్యాండ్ ను గజానికి రూ.2.22 లక్షలు చొప్పున సుమారు రూ.33 కోట్లకు కొనుగోలు చేశారు.ఈ భూములకు చదరపుగజానికి 1.20 లక్షలను ఆఫ్‌సెట్ ధరగా నిర్ధారించగా వేలం పాటలో అది 2.22 లక్షలు పలికింది.అట్లాగే ఇదే ప్రాంతంలోని 1200 గజాల పాఠశాలభూములకు ఆఫ్ సెట్ ధర చదరపు గజానికి 80 వేలుగా నిర్ధారించగా, వేలంలో ఆ భూములకు రూ. 1.12 లక్షలకు కొనుగోలు చేశారు. అలాగే ఇక్కడి రెండు ఎంఐజి ప్లాట్లు చదరపు గజం రూ.1.86 లక్షలు, రూ.1.32 లక్షల ధరలు పలికాయి. ఒక్క గచ్చిబౌలి ప్రాంతానికి సంబంధించిన భూముల ద్వారానే రూ.55 కోట్ల 56 లక్షల 84 వేలు ఆదాయం హౌజింగ్ బోర్డుకు సమకూరింది. కుత్బు ల్లాపూర్ మండలంలోని చింతల్ ప్రాంతంలోని హౌజింగ్ బోర్డు ఎంఐజి ప్లాట్లు కూడా అత్యధిక ధరలతో బహిరంగ వేలంలో అమ్ముడు పోయాయి.ఈ ప్రాంతంలో మొత్తం10ప్లాట్లను వేలం వేయగా,వీటిలో ప్లాట్ నెం.113,114,115ల ద్వారానే సుమారు రూ. 8.11 కోట్లమేర ఆదాయంవచ్చింది. నిజాం పేట బాచుపల్లిలోని 4 ప్లాట్లను సుమారు రూ.70 లక్షలకు వేలం పాటలో కొనుగోలు చేశారు.

### ఫోన్ ట్యాపింగ్ కేసులో కొనసాగుతున్న

# బాధితుల వాంగ్మూలం నమోదు

### సిట్ ఎదుట హాజరైన కాంగ్రెస్ నేత సుధీర్‌రెడ్డి

### బిజెపి ఎంపి ఈటలకు పోలీసుల నోటీసులు

### నేడు విచారణకు హాజరు

**హైదరాబాద్, జూన్ 23, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో బాధితుల వాంగ్మూలం నమోదు కొనసాగుతోంది. జూబ్లీహిల్స్ ఎసి పి కార్యాలయంలో జరుగుతున్న వాంగ్మూలం నమోదుకు సోమవారం నాడు వరంగల్ జిల్లాకు చెందిన కాంగ్రెస్ నేత బిళ్ల సుధీర్ రెడ్డి నాటి ఫోన్ ట్యాపింగ్‌పై వాంగ్మూలం ఇచ్చారు. అప్పట్లో ఫోన్ ట్యాపింగ్ వల్ల తాను ఎదుర్కొన్న కష్టాలను ఆయన పోలీసులకు వివరించారు. తనతో పాటు అప్పట్లో చాలా మంది కాం గ్రెస్ నేతలు, ఇతరుల ఫోన్‌లను ట్యాపింగ్‌కు గురయ్యిందని ఆయన తెలిపారు. ఈ కేసుపై సమగ్రంగా విచారణ జరపాలని, దోషులను కఠినంగా శిక్షించాలని ఆయన సిట్ అధికా రులను కోరారు. ఈ కేసులో వున్న వారు ఎంతటి వారైనా వదల కూడదని ఆయన కోరారు. మరోవైపు ఫోన్ ట్యాపింగ్ కేసులో బిజెపి ఎం పి ఈటల రాజేందర్‌కు సిట్ అధికారులు సోమవారం నాడు నోటీసులు జారీ చేశారు. ఈ కేసులో మంగళవారం నాడు తమ ఎదుట విచారణకు హాజరై వాంగూ మ్లలం ఇవ్వాలని వారు కోరారు. ఇంకోవైపు ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి సిఎం రేవంత్ రెడ్డి సోదరుడు కొండల్ రెడ్డి, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ నేత సింగిరె డ్డి హరివర్ధన్ రెడ్డి ఫోన్‌లు సైతం అప్పట్లో ట్యాప్ అయినట్లు సిట్ అధికారులు గుర్తించారు. దీనిపై వారికి సిట్ అధికారులు నోటీసులు ఇచ్చి వాంగ్మూలం నమో దు చేయాలని నిర్ణయించారు.

# మహారాష్ట్రలో దారుణం.. నీట్‌లో ర్యాంకు రాలేదని కూతురును కొట్టి చంపిన తండ్రి

**హైదరాబాద్, జూన్ 23, ప్రభాతవార్త:** వైద్యవిద్య ప్రవేశపరీక్ష నీట్‌లో తక్కువ మార్కులు తెచ్చుకుందనే కోపంతో ఓ కిరాతక తండ్రి తన కుమార్తెను దుడ్డు కర్రతో చావబాది దారుణంగా హత్య చేసిన ఘటన మమారాష్ట్రలో వెలుగు చూసింది. వివరాలు ఇలావున్నాయి.

సాంగ్లీ జిల్లాకు చెందిన ధోండీరాం ఖోసలేలో ఒక పాఠశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నాడు. ధోండీరాం కూతురు ఇటీవల నీట్ పరీక్ష రాయగా ర్యాంకు రాలేదు.

దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన ధోండీరాం ఆదివారం కూతురును దుడ్డు కర్రతో చావబాదాడు. ఈ దెబ్బలకు తాళలేక ఆ బాలిక తీవ్రంగా గాయపడి ఇంట్లోనే స్పృహ కోల్పోయింది.

అయితే కుమార్తెను ఆసుపత్రికి కూడా తీసుకు వెళ్లకుండా అక్కడే పడవేసిన ధోండీరాం పాఠశాలకు వెళ్లిపోయాడు. కొన్ని గంటల తరువాత అతను ఇంటికి తిరిగివచ్చి చూడగా అచేతనంగా ఉన్న కుమార్తెను ఆసుపత్రికి తీసుకు వెళ్లగా అప్పటికే బాలిక మరణించినట్లు వైద్యులు ప్రకటించారు. ఈ కేసులో ధోండీరాంను పోలీసులు అరెస్టు చేశారు.

# అమెరికాకు సొంతగడ్డపైనే మిన్నంటిన నిరసనలు

### ఇజ్రాయెల్‌కు మద్దతు నిలిపివేయాలంటూ నినాదాలు




**న్యూయార్క్, జూన్ 23:** ఇరాన్‌పై యుద్ధానికి దిగిన అమెరికాకు సొంత దేశంలోనే నిరసనలు మిన్నంటాయి. ఇజ్రాయెల్‌కు మద్దతివ్వడం ఆపండి అంటూ ప్లకార్డులుధరించిన నిరసన కారులు ఆందోళనలుచేపట్టారు. శ్వేత సౌధం ముందే డొనాల్డ్ ట్రంప్‌కు వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తించారు. ఇక ఇరాన్‌పై యుద్ధం వద్దు. ఇజ్రా యెల్‌కు మద్దఉ ఇవ్వడం ఆపివేయండి గాజాలో నరమేధం ఆగిపోవాల్సిందే అని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నుద్దేశించి పలువురు ఇరాన్‌జెండాలను చేతబూని నినాదాలు చేసారు. అలాగేమరికొందరు ఇరాన్‌కు మద్దతుగా రోడ్లపైకి వచ్చి పాటలు పాడుతూ తమ నిరసనగళం విప్పారు. ప్రస్తుతం యుద్ధ వ్యతిరేక నినాదాలతో అమెరికా ప్రధాన నగరాలు బోస్టన్, చికాగో, న్యూయార్క్‌టైమ్ స్క్వేర్‌దగ్గర హ్యాండ్స్ఆఫ్ ఇరాన్ స్లోగన్లు ఉన్న బ్యానర్లను ప్రదర్శిస్తూ కొందరు నిరసన చేపట్టారు. వైట్‌హౌస్‌వద్ద ఉన్న నిరసనల్లో పశ్చిమాసియా ఉద్రిక్తతల్లో అమెరికా జోక్యం చేసుకోవద్దంటూ నినాదాలుచేయడం గమనార్హం.

టెహ్రాన్‌పై అమెరికాకు చెందిన బీ-2 బాంబర్లు దాడులుజరిపి సోమవారం ఉదయం వెనక్కి వచ్చేసాయి. ఆపరేషన్ మిడ్‌నైట్ హామర్ పేరుతో 25 నిమిషాల్లోనే ఇరాన్ అణుకేంద్రాలైన ఫోర్డో, ఇస్ఫాహాన్; నటాం జ్‌లపై దాడులు చేసామని అమెరికా ప్రకటించింది. ఈ క్రమంలోనే అమెరి కాలో యుద్ధ వ్యతిరేక నిరసనలు తీవ్రం అయ్యాయి. మరోవైపు ఆందోళనల నేపథ్యంలో అక్కడిభద్రతా బలగాలు అలర్ట్ అయ్యాయి. దౌత్య కార్యాల యాలతోపాటు మతపరమైన కేంద్రాలదగ్గర భద్రతను కట్టుదిట్టం చేసారు. ఇప్పటికే పలువురు ఆందోళన కారుల్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# ఎంపి రఘునందన్‌రావుకు బెదరింపు కాల్

### పోలీసు ఉన్నత అధికారులకు ఎంపి ఫిర్యాదు

**సంగారెడ్డి బ్యూరో, జూన్ 23, ప్రభాతవార్త:** బీజేపీ మెదక్ ఎంపీ రఘునందన్‌రావుని చంపేస్తామని పీపుల్స్ వార్ మావోయిస్టుల పేరుతో ఫోన్ బెదిరింపు కాల్ రావడం సోమవారం సంగారెడ్డి జిల్లాలో తీవ్ర చర్చనీయాంశమైంది.. సోమవారం సాయంత్రం లోగా చంపుతామంటూ ఎంపీని హెచ్చరించారు. తాను మధ్యప్రదేశ్‌కి చెందిన మావోయిస్టునని బెదిరింపులకు పాల్పడ్డాట్లు తెలుస్తోంది.సోమవారం మేడ్చల్ జిల్లాలోని దమ్మాయిగూడలో రఘునందన్ రావు పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఎంపీ పాల్గొన్నారు. ఈ సమయంలోనే రఘునందన్‌రావుకి ఆగంతకుడి నుంచి ఫోన్ వచ్చింది.అయితే ఆ ఫోన్ కాల్‌ని రఘునందన్‌రావు పీఏ ఎత్తాడు. 912143352974 నంబర్ నుంచి ఫోన్ కాల్ వచ్చినట్లు గుర్తించారు. వెంటనే రఘునందన్ రావు అప్రమత్తమై తెలంగాణ డీజీపీ జితేందర్‌కి, సంగారెడ్డి ఎస్పీకి, ఇతర ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. రఘునందన్ రావు ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కాల్ నెంబర్ ఆధారంగా విచారణ చేస్తున్నారు. ఎక్కడ నుంచి ఈ కాల్ వచ్చిందనే దానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఈ విషయంపై బీజేపీ అగ్రనేతలు ఎంపీ రఘునందన్‌రావుకి ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు.ఈ సంఘటన స్థానికంగా కలకలం సృష్టించింది.

# తిరుమల సమాచారం

## ప్రపంచస్థాయి ఆధ్యాత్మిక ప్రదర్శనశాలగా ఎస్వీ మ్యూజియం

### -అభిప్రాయసేకరణకు ఫీడ్‌బ్యాక్ కియోస్క్

### - పనుల తనిఖీలో అదనపు ఇఒ వెంకయ్యచౌదరి



**తిరుమల,జూన్ 23ప్రభాత వార్తప్రతినిధి:** అఖి లాండకోటి బ్రహ్మాండ నాయకుడు తిరుమల శ్రీవేంక టేశ్వరస్వామి ఆలయం చరిత్ర, స్వామివారి ఆభరణాలు, స్వామి వారి ఆలయంలో రాజుల కాలం నాటి విశేషాలు,పురాతనగ్రంథాల విషయాలు తెలిసేలా తిరుమలలో ఎస్వీమ్యూజియంను ప్రపంచ స్థాయి ఆధ్యాత్మిక ప్రదర్శనశాలగా తీర్చిదిద్దాలని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి సూచించారు. ఇక్కడి మ్యూజియాన్ని అన్ని విధాలా అభివృద్ధిచేయడంతోబాటు భద్రత పరంగా తీసుకోవాల్సి న చర్యలు, ఆధునిక సాంకేతికత ఆధారంగా సిసికెమెరాలు, హెడ్‌కౌంట్ సెన్సార్లు, గార్డులు, గైడులు తదితర ఏర్పాట్లుపై అధికారులకు ఆదేశాలిచ్చారు. తిరుమల ఎస్వీమ్యూజియం అభివృద్ధి,పనులు త్వరగా పూర్తిచేయడం అంశాలపై సోమవారం అన్నమయ్యభవనంలో ఇన్‌ఛార్జి చీఫ్ మ్యూజియం అధికారి సోమన్‌నారాయణ ఆధ్వర్యంలో అధికారులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అదనపు ఇఒ వెంకయ్యచౌదరి మాట్లాడుతూ ఎస్వీమ్యూజియంకు ఎంతో చరిత్ర ఉందని, తిరుమల ఆలయంలో స్వామివారిని దర్శించుకున్న భక్తులు ఇక్కడ మ్యూజియం సందర్శిస్తే అదే అనుభూతికలిగాంచాలన్నారు. ఇందుకు అవసరమైన పనులను సకాలంలో పూర్తిచేయాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. మ్యూజియం ప్రాంగణంలో సందర్శకులనుండి అభిప్రాయసేకరణకు ఫీడ్‌బ్యాక్ కియోస్క్‌ను ఏర్పాటుచేయాలని సూచించారు.

## భారీ వర్షాలకు తట్టుకునేలా కాలువల ఆధునీకరణ



**తిరుమల,జూన్ 23ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగ వైకుంఠం తిరుమలకొండపై చిన్నపాటి వర్షం కురిసినా వర్షపునీరు ఆలయం ముందు, ఆలయానికి చేరుకునే రాంభగీచా అతిధిగృహాల ప్రాంతంలో చిన్నపాటి చెరువులా నిలిచిపోతున్నాయి. ఈ నీటిలో భక్తులు అడుగుతీసి అడుగువేయాలన్నా.. నడచివెళ్ళాలన్నా చివరకు వాహనాల్లో రాకపోకలు సాగించడానికి ఇబ్బందిగా మారింది. అంతేగాక వర్షమొస్తే ఎక్కడ నీరు అక్కడ నిలిచిపోయి చిన్నపాటి చెరువులను తలపింపజేస్తున్నాయి. దీంతో భక్తుల నుండి కూడా విమర్శలు వ్యక్తమయ్యాయి. దీనికి ప్రధాన కారణం ఎప్పుడో నిర్మించిన కాలువలను ఆధునీకరించక పోవడం, వెడల్పు చేయకపోవడంతో నీరు నిలచిపోతోంది. దీన్ని గమనించిన టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ఆలయం ముందు, ఆలయానికి వచ్చే ప్రవేశగేట్ వద్ద వర్షపునీరు నిలవకుండా చూడాలని ఇంజనీరింగ్ అదికారులను ఆదేశించారు. సిఇ సత్యనారాయణ పర్యవేక్షణలో ఇంజనీరింగ్ అధికారులు పనులు చేపట్టేందుకు సిద్ధమయ్యారు. ఇప్పుడు ఏకంగా ఆలయానికి ప్రధానద్వారంగా ఉన్న రాంభగీచా అతిధిగృహాల ప్రాంతంలో కాలువలను వెడల్పుచేయడం, ఎత్తునుండి కొంత దిగువకువర్షపునీరు వచ్చేలా పనులు మరమ్మతులు మొదలుపెట్టారు. దీనివల్ల ఎంతభారీవర్షమొచ్చినా నీరు కాల్వుల్లోకి చేరి డ్రైనేజీల్లో కలిసిపోయేలా పనులు చేస్తున్నారు. దీంతో కొంతవరకు వర్షపు నీరు నిలబడదు. ప్రతిరోజూ తిరుమలేశుని దర్శనానికి విఐపిలుతోబాటు సామాన్యభక్తులు కూడా ఆలయంలోనికి చేరకోవడం, తిరిగి వెలుపలకు వచ్చి ప్రధాన రోడ్డుపైకి రావడానికి రాంభగీచా అతిదిగృహాల మార్గం కీలకం. ఈ మార్గంలో ఇంజనీరింగ్ పనులు జరుగుతుండటంతో ఇకపై వర్షమొచ్చినా ఇబ్బంది ఉండదు.ఈ కాల్వల వెడల్పుతో దానిపైన ఇనుపజాలీలులాగా ఏర్పాటుకానున్నాయి.

## ఎస్వీ ప్రాణదాన ట్రస్ట్‌కు భారీ విరాళాలు

### - ముగ్గురు దాతలు రూ.40.59 లక్షలు అందజేత



**తిరుమల,జూన్ 23ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల తిరుపతిదేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలు ట్రస్ట్‌లు, పథకాలకు భక్తులైన దాతలు తమవంతుగా విరాళా లందించి అవసరమైన వారికి సేవ లందిం చేందుకు ముందుకు వస్తున్నారు. ఇందులో భాగంగా పేదవారికి ఉచితంగా అవసరమైన శస్త్రచికిత్సలు, గుండె ఆపరేషన్లు ఇతరత్రా మెరుగైన వైద్యసేవలందించేందుకు వీలుగా టిటిడి అమలుచేస్తున్న ఎస్వీప్రాణదానట్రస్ట్‌కు సోమవారం ముగ్గురు దాతలు తమవంతు విరాళాలందించారు. కర్నాటక బెంగుళూరుకు చెందిన అగర్వాల్ ఇండెక్స్ ఫర్నేస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ 20లక్షలు రూపాయలు విరాళాల డిడిని ప్రతినిధి రాఘవేంద్ర ద్వారా టిటిడికి అందజేశారు.

రాజస్థాన్‌కు చెందిన ఏకె ఇంజనీరింగ్ కంపెనీ 10,59,000లక్షలు డిడిని, కోనసీమజిల్లాకు చెందిన దండుమేనే శశాంక్ కృష్ణ 10,00,006లక్షలు రూపాయలు మొత్తం 40,59,006లక్షలు రూపాయలు డిడిలను టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరికి అందించారు. దాతలను ఆయన అభినందించారు.

## పేదరికంలేని సమాజంకోసమే పి4 విధానం: మంత్రి కొల్లురవీంద్ర



**తిరుమల,జూన్ 23ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో పేదరికంలేని సమాజాన్ని చూడాలనే మంచి లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పి4 విధానం అమలుచేస్తున్నారని రాష్ట్రమంత్రి కొల్లురవీంద్ర తెలిపారు. ఏడాది కూటమి ప్రభుత్వం పాలనలో స్వర్ణాంధ్ర సాధనకు విజన్ 2047 అమలు, ప్రతి పేదకుటుంబం ఆర్థికంగా అభివృద్ధి, యోగాంధ్ర వంటి కార్యక్రమాలకు సిఎం చంద్రబాబు శ్రీకారంచుట్టారన్నారు. ప్రజలకు మంచి చేయాలనే ఆశయం,కుటుంబసంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు అమలుచేస్తున్నారన్నారు. ఏడాదికాలంలోనే ప్రజలు ఆశించిన విధంగా పాలనసాగిస్తున్నామన్నారు. అన్ని విధాలా రాష్ట్రం అభివృద్ధికోసం ముఖ్యమంత్రి దృష్టిపెట్టారని, ఇందుకు కలియుగప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సు లందించాలని కోరానన్నారు. స్వామివారి దర్శనం అద్భుతంగా జరిగిందన్నారు. తెలుగుప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. సోమవారం ఉదయం మంత్రి కొల్లురవీంద్ర తిరుమలకు చేరుకుని ఉదయం విఐపి బ్రేక్‌లో శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి దర్శనం చేయిం తీర్థప్రసాదాలు అందజేశారు.

## భక్తులకు సౌకర్యాలు అద్భుతంగా ఉన్నాయి

### - తెలంగాణ మాజీ మేయర్ బొంతు రామ్మోహాన్



**తిరుమల,జూన్ 23ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనానికి విచ్చేస్తున్న భక్తులకు సౌకర్యాలు అద్భుతంగా ఉన్నాయని, దేవుని దర్శనం బావుందని జిహెచ్‌ఎంసి మాజీ మేయర్ బొంతు రామ్మోహాన్ తెలిపారు. వేంకటేశ్వరస్వామి కృప, దయ ఆశీస్సు లు అందరిపై ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. తిరుమలలో భక్తులకు కల్పించిన సౌకర్యాలు బావున్నాయని కితాబిచ్చారు.

## మొదటి రెండు నెలల్లోనే 70 శాతం పూర్తి

## పనిదినాల రెట్టింపునకు కేంద్రాన్ని కోరతాం: మంత్రి సీతక్క

# తెలంగాణలో జోరుగా ఉపాధి పనులు

**హైదరాబాద్, జూన్ 23, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఉపాధి హామీ పనులు జోరుగా సాగుతున్నాయి. కేంద్రం కేటాయించిన ఆరున్నర కోట్ల పనిదినాల్లో ఇప్పటికే 4.53 కోట్ల పనిదినాలను తెలంగాణ పూర్తి చేసింది. అంటే మొత్తం కేటా యించిన పనిదినాల్లో 70 శాతం లక్ష్యాన్ని తెలంగాణ సాధించింది. అయితే గతంలో మాదిరిగా 12 కోట్ల పనిదినాలు తెలంగాణకు కేటాయించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క కేంద్ర ప్రభుత్వానికి ఇప్పటికే లేఖ రాశారు. పనిదినాలు రెట్టింపు చేయాలని కేంద్రాన్ని కోరనున్నట్లు మంత్రి ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్రం నుంచి అనుమతులు వస్తాయన్న నమ్మకంతో ఉపాధి హామీ పనులను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వేగవంతం చేసింది. ఈ ఏడాది ఇప్పటి వరకు 18.9 లక్షల కుటుంబాల్లోని 28.48 లక్షల మంది ఉపాధి కూలీలకు పని కల్పించారు. ఒక్కో కుటుంబం సగటున 24 రోజుల పని దినాలను పూర్తి చేసుకుంది. 1127 కుటుంబాలు వంద రోజుల పనిదినాలను పూర్తి చేసుకున్నాయి. అయితే సగటున ఒక్కో కూలీకి రూ. 250.75 రోజువారి వేతనం లభిస్తుంది. అయితే రోజు వారి వేతనం రూ.307 దక్కేలా చర్యలు తీసుకుంటున్నారు. ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయి సిబ్బందిని అప్రమత్తం చేస్తూ కూలీ గిట్టుబాటు అయ్యేలా చర్యలు చేపడుతున్నారు. ఉపాధి హామీ పనుల్లో భాగంగా వ్యవసాయ అనుబంధ పనులకు తెలంగాణ ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోంది.

ఉపాధి హామీ పనుల్లో 60 శాతం పనులు వ్యవసాయ అనుబంధ పనులు చేయించాలని లక్ష్యం పెట్టుకోగా.. వ్యవసాయ అనుబంధ పనులు 50 శాతంగా నమోదయ్యాయి. ఇందులో ప్రధానంగా ఫాం పాండ్స్, పశువుల కొట్టాలు, మొక్కల నాటింపు వంటి పనులు లక్షకు పైగా కొనసాగుతున్నాయి. జీపీ భవనాలు, అంగన్వాడీ భవనాలు, సీసీ రోడ్ల వంటి మౌళిక వసతుల కల్పన పనులు లక్షా 31 వేలకు పైగా కొనసాగు తున్నాయి.

అయితే ఉపాధీ హామీ పనుల్లో ఉపాధి కల్పన తో పాటు గ్రామీణ ప్రాంతాల్లో సదుపాయాల కల్పన, ఆస్థుల సృష్టి కి తెలంగాణ ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోంది. మే మాసం ముగిసే నాటికి ఉపాధి హామీలో భాగంగా రూ. 1416 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేసింది. అందులో రూ.1151.67 కోట్లు వేతనాలు కాగా, రూ.191.03 కోట్లు మేటిరియల్ కాంపోనెంట్ గా నమోదు అయ్యింది. అయితే కేంద్రం నుంచి నిధుల విడుదలతో జాప్యంమైనా కూలీలకు ఇబ్బందులు లేకుండా రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు వేతనాలను ఉపాధి కూలీల ఖాతాల్లో జమచేస్తోంది.

ఇప్పటి వరకు కూలీల ఖాతాల్లో 733.52 కోట్లు జమ అయ్యాయి. అయితే ఉపాధి హామీ పనులకు తెలంగాణలో భారీ డిమాండ్ ఉంది. మరీ ముఖ్యంగా వ్యవసాయ అనుబంధ పనులకు ప్రభుత్వం ప్రాధాన్యత నిస్తుండటంతో, ఉపాధి పనులకు ప్రజలు మొగ్గు చూపు తున్నారు. అయితే గత యేడాదితో పోలిస్తే ఉపాధి పనిదినాలను సగానికి కేంద్ర ప్రభుత్వం కుదించింది. దీనిపై తన అసంతృప్తిని వ్యక్తం చేస్తూ.. కేంద్ర ప్రభుత్వానికి మంత్రి సీతక్క ఇప్పటికే లేఖ రాశారు. అపాయింట్‌మెంట్ రాగానే కేంద్ర పెద్దలను కలసి.. ఉపాధి పని దినాలను కనీసం 12 కోట్లకు పెంచాలని విజ్ఞప్తి చేయనున్నారు.




## బిసి బిల్లు అంశానికి రాజకీయ రంగు పులుముతున్న ఎమ్మెల్సీ కవిత

### రవాణ బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, జూన్23,ప్రభాతవార్త:** బిసి బిల్లు అంశానికి రాజకీయ రంగు కవిత, ఆర్.కృష్ణయ్యలు పులుముతున్నారని,ప్రధానమంత్రితో చట్టసభల్లో తెలంగాణ రాష్ట్రం చేసిన బిల్లుకు చట్టబద్ధత తీసుకొని రావడానికి ఆర్ కృష్ణయ్య చొరవచూపాలని రవాణ బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభా కర్ కోరారు. గాంధీభవన్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం మాట్లా డుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రాహుల్ గాంధీ మార్గదర్శకం లో సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో బిసి బిల్లును చట్టం రూపంలో చేసుకొని గవర్నర్ పంపినామని తెలిపారు. బిఆర్ ఎస్ హయంలో బలహీన వర్గాల తరఫున గొంతెత్తని కవితకు బిసి గురించి మాట్లాడే అర్హత లేదని ఆయన అన్నారు. రాజ్యసభ సభ్యులు, బిసి నేత ఆర్.కృష్ణయ్య అంటే గౌరవం మేం ఢిల్లీ వస్తాం, మీరు ప్రధాని అపాయింట్‌మెంట్ తీసుకోండి అందరం కలిసి వెళదాం మీ తమ్ముడిగా రిక్వెస్ట్ చేస్తున్నా అంటూ పొన్నం అభ్యర్థించారు. మా నాయ కుడు రాహుల్‌గాంధీ పార్లమెంట్ సాక్షి గా బిసి విజన్ గురించి బల్ల గుద్ది చెబు తున్నారని ఆయన వివరించారు. కవిత సత్రంలో భోజనం పెడుతుంటే కూడా సిఫార్సు లెటర్ కావాలి అనే రకం అని ఎద్దేవా చేశారు. బిసి రిజర్వే షన్ల విషయంలో ఇప్పుడు అడ్డగోలుగా మాట్లాడుతూ, జరుగు తున్న మం చిపై కూడా సన్నాయి నొక్కులు నొక్కితే అర్థమే లేదు అని పొన్నం అన్నారు. బిసిల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో

## 27న ఎస్ఎస్‌సి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

**హైదరాబాద్, జూన్ 23, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఈ నెల 3 నుంచి 13 వరకు జరిగిన ఎస్ఎస్‌సి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలను ఈ నెల 27న విడుదల చేయనున్నారు. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 13 వరకు జరిగాయి. రాష్ట్ర వ్యాప్తంగా అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు 42,832 మంది దరఖాస్తు చేసుకోగా వారికోసం 150 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షలను ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు నిర్వహించారు. ఈ నెల 13తో పరీక్షలు పూర్తికాగా జవాబు పత్రాల మూల్యాంకన ప్రక్రియను ఇప్పటికే ప్రారంభించి ముగించినట్టు తెలిసింది. మూల్యాంకనం అనంతర పనులను చేపట్టిన అధికారులు.. ఈ నెల 27న ఫలితాలను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఎస్ ఎస్‌సి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాల అనంతరం రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో అడ్మిషన్ల సంఖ్య పెరిగే అవకాశం ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# అనుమానాస్పద లబ్ధిదారులకు రేషన్ నిలిపివేత

### రాష్ట్రానికి 1,62,773 మంది జాబితా పంపిన కేంద్రం

**హైదరాబాద్, జూన్ 23, ప్రభాతవార్త:** జాతీయ ఆహారభద్రత కార్డులు అనర్హులను తొలగించాలని కేంద్రప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలమేరకు తెలంగాణ లోని సివిల్స్ సప్లయ్‌శాఖ తహశీల్దార్లతో క్షేత్ర స్థాయిలో విచారణ జరిపి 96240 కార్డులను అనుమానస్పద కార్డులుగా గుర్తించారు. జిల్లా పౌరసరఫరాల అధికారికి, తహశీల్దార్లకు డాటాలో లాగిన్ కావడానికి అవకాశం ఇచ్చి రాష్ట్రంలో అను మానాస్పద రేషన్ కార్డులపై క్షేత్రస్థాయి విచారణ ప్రక్రియను విజయవంతంగా ముగించారు. వరుసగా ఆరు నెలల్లో రేషన్ తీసుకోనివారి వివరా లను అధికార యంత్రాంగం పరిశీలించింది. ఈ కార్డులలో 1,62,773 మంది లబ్ధిదారులు ఉన్నారు. ఆరోగ్యశాఖ,ఐసిడిఎస్ సర్వే ప్రకారం మృతులను, వలసవెళ్ళినవారిని, డబుల్ కార్డులు కలిగిన లబ్ధిదారుల్లో 76.842 మంది గుర్తించి వారిని అనర్హులుగా గుర్తించారు .ఈ వివరాలను పౌర సరఫరాలశాఖ జిల్లాలవారీగా కలెక్టర్లకు పంపించింది. కొద్ది రోజుల్లోనే వారిని రేషన్ లబ్దిదారుల జాబితా నుంచి తొలగించనున్నట్లు తెలిసింది. ఇకనుంచి వారికి రేషన్ కోటా నిలిపివేయనున్నట్లు పౌర సరఫరాలశాఖ వర్గాలు తెలిపాయి. రేషన్ లబ్దిదారులకు ఉచితంగా బియ్యం ఇస్తున్నప్పటికీ చాలామంది తీసుకోవడం లేదు. కేంద్రప్రభుత్వం అనుమానాస్పద రేషన్ లబ్దిదారులుగా గుర్తించి వారి వివరాల్ని రాష్ట్ర ప్రభుత్వానికి పంపించి విచారణ కోరింది. పౌర సరఫరాలశాఖ ఈ వివరాల్ని జిల్లా కలెక్టర్లకు, డిఎస్‌వోలకు సమాచారం అందించి మండల స్థాయిలో రెవెన్యూ యంత్రాంగం ద్వారా స్థానికం గా విచారణ జరిపించింది. ఇందులో అర్హులు. అనర్హులను గుర్తించి ఆ వివరాల్ని పౌర సరఫరాల శాఖకు పంపించగా, రేషన్ జాబితా నుంచి తొలగించాలని నిర్ణయించింది. అనుమా నాస్పద లబ్దిదారుల్లో 60 శాతం మంది అనర్హు లుగా తేలారు. ఇందులో ఇతర ప్రాంతాలకు వలస వెళ్లినవారు, చనిపోయినవారు, రెండుచోట్ల రేషన్ కార్డుల్లో పేర్లున్నవారు ఉన్నట్లు గుర్తించారు. క్షేత్రస్థాయి వివరాల ఆధారంగా పంపిన నివేదికలతో వారిపేర్లను తొలగించాలని నిర్ణయం తీసుకున్నారు. కేంద్ర సివిల్ సప్లయ్‌శాఖ 96వేలకు పైగా కార్డులపై అనుమానం వ్యక్తం చేయడంతో విచారణ చేయగా అనర్హులుగా తేలినవారు హైదరాబాద్, రంగారెడ్డి, నల్గొండ, మేడ్చల్ జగిత్యాల, జిల్లాల్లో ఎక్కువగా ఉన్నారు. కేంద్రప్రభుత్వం చాలా కాలంగా రేషన్ సరుకులు తీసుకోకుండా కార్డులను నిరుపయోగంగా ఉంచుతున్న వారిపై దృష్టి సారించింది.

## బిసిల చేతివృత్తులకు చేయూత

### కళాకారుల ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకం

### 25 నుంచి 29 వరకు ఎగ్జిబిషన్: మంత్రి పొన్నం

**హైదరాబాద్, జూన్ 23, ప్రభాతవార్త:** రాష్ట్రంలో బిసిల చేతివృత్తులకు చేయూత నివ్వనున్నట్టు బిసి సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. బోనాల ఉత్సవాల సందర్భంగా చేతివృత్తుల కళాకారుల ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకం చేపట్టనున్నట్టు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పర్యావరణహితమైన చేతివృత్తుల వారి ఉత్పత్తులకు మార్కెటింగ్ చేయ నున్నట్టు తెలిపారు. ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకంపై బిసి కుల సంఘాలు పెద్ద ఎత్తున పాల్గొనాలని.. చేతివృత్తుల వారిని ప్రోత్సహించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. బోనాల ఉత్సవాల సందర్భంగా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 25 నుండి 29 వరకు 5 రోజులు చేతివృత్తుల కళాకారులచే తయారుచేసిన వివిధ వస్తువుల ప్రదర్శన, అమ్మకం ఎగ్జిబిషన్‌ను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఎగ్జిబిషన్‌ను ట్యాంక్‌బండ్, అంబేద్కర్ విగ్రహం పక్కనున్న చోట ప్రతిష్టాత్మకంగా ఏర్పాట్లు జరుగు తున్నాయని తెలిపారు. ఈ ప్రదర్శనలో కుమ్మరులు తయారుచేసిన మట్టి పాత్రలు, గౌడన్నలచే నీరా, మేదరివారు తయారు చేసిన వెదురు వస్తువులు, పూసలవారి సామగ్రి.. అలాగే పోచంపల్లి, గద్వాల, నారాయణ పేట మొదలైన చేనేత ఉత్పత్తులు, ఇతర బిసి వర్గాలచే తయారుచేసిన వస్తు వులు అందుబాటులో ఉంటాయన్నారు. వాటితోపాటు తెలంగాణ వంటకాలు, బెస్త సోదరులచే చేప వంటకాలు, ఇతర భోజన స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ప్రదర్శన ప్రతిరోజు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 9:30గంటల వరకు ఉంటుందని.. ఉచితప్రవేశం కల్పించినట్టు తెలిపారు.

## పాత ఫ్యాన్ కావడంతోనే ఊడింది

### ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఘటన..

### ఆదిలాబాద్ డిఎంహెచ్ఓ వివరణ

**హైదరాబాద్, జూన్ 23, ప్రభాతవార్త:** ఆదిలాబాద్‌లో గుడిహత్నూర్ మండలం లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కింద పడిన ఫ్యాన్ సంఘటనపై జిల్లా వైద్యశాఖ అధికారి వివరణ ఇచ్చారు. ఆసుపత్రిలో ఫ్యాన్ ఊడి పడి చిన్నారికి గాయాలు అని పలు వార్తా పత్రికలు ప్రచురించాయిని అయితే ఈ సంఘటపై దర్యాప్తు చేసినట్లు తెలిపారు. ఈ సంఘటనపై మెడికల్ ఆఫీసర్ శ్యామ్‌ను స్టాఫ్ నర్స్ తిరుమల రాణిని, రోగి సహాయకుడు నుంచి తగిన సమాచారం సేకరించామన్నారు. ఫ్యాన్ ఊడిపడేందుకు గల కారణాలను తెలుసుకున్నామని, సీలింగ్ ఫ్యాన్ పాతది కావడమే కాకుండా అది తుప్పు పట్టడంతోనే ఫ్యాన్ పడిందని తన విచారణలో తేలిందన్నారు. తుప్పు పట్టిన ఫ్యాన్ కింద పడటంతో నవజాత శిశువుకు గాయమైనట్లు తెలిపారు.

# గాంధీభవన్‌లో గొర్రెల మంద ధూంధాం




### గాంధీభవన్‌లోకి వదలిన రెండు ట్రక్కుల గొర్రెలు

### మంత్రిమండలిలో చోటుదక్కలేదని గొల్ల కురుమల నిరసన

### పిసిసితో చర్చలకు పట్టుబట్టిన యాదవులు

**హైదరాబాద్, జూన్ 23, ప్రభాతవార్త:** గాంధీభవన్‌లో సోమవారం గొర్రెల మంధ ధూంధాం సృష్టిం చాయి. గొల్ల కురుమలకు మంత్రి మండలిలో ప్రాధాన్యత దక్కలేదని గొల్లకురుమలు పెద్ద ఎత్తున గాంధీభవన్‌కు తరలివచ్చి గొర్రెలతో నిరనస తెలిపారు. గాంధీభవన్‌లో గొర్రెల అరుపులు ఒకవైపు బీర్ల ఐలయ్యకు మంత్రిమండలిలో అవ కాశం కల్పించాలని గొల్ల కురుమలు నినాదాలతో ఆ ప్రాంతం హోరెక్కింది. కాంగ్రెస్ పార్టీ స్టేట్ ఆఫీస్ గాంధీభవన్ గొర్లను పంపి గొర్ల కాపరుల సంక్షేమ సంఘం నేతలు వినూత్న నిరసన చేయ డం అందరిని ఆకర్షిం చింది. కాంగ్రెస్ పార్టీలో, ప్రభుత్వంలో గొల్ల, కురు మలకు ప్రాధాన్యత దక్కడం లేదంటూ యాద వులు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కేబినెట్లో యాదవ సమాజిక వర్గానికి అవకాశం ఉండే దని వారు గుర్తుకు చేశారు. మొదటిసారి కేబినెట్లో గొల్ల, కురుమలకు అవకాశం రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు కార్పొరేషన్ చైర్మన్ పదవుల్లోనూ అవకాశం దక్కలేదన్నారు. ఈ నేపథ్యంలోనే గొర్రెలతో వినతిపత్రం ఇచ్చేందుకు వచ్చి నట్లు మీడియాతో గొల్ల, కురుమ సంఘం నేతలు మీడియాతో మాట్లాడుతూ మంత్రి వర్గంలో అవకాశం కల్పించడంతో పాటు, ప్రాధాన్యత కలిగిన నామినేటెడ్ పోస్టులు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్‌తో చర్చలు జరిపేవరకు గాంధీ భవన్ నుంచి వెనక్కి వెళ్లమని వారు మొండికేసి అక్కడే గొర్రెల మందతో కూర్చొన్నారు. గాంధీ భవన్‌లో నిరసన నేపథ్యంలో గొల్ల, కురుమల సామాజికవర్గ నేతలతో టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ చర్చలు జరిపారు. వారి వినతి పత్రం స్వీకరించి వారి గోడును విన్నారు. అలాగే పశుసంవర్ధక శాఖ మంత్రి వాకాటి శ్రీహరితో మాట్లాడి సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని పీసీసీ చీఫ్ హామీ ఇచ్చారు. మీ సమస్యలను గొల్ల కురుమ నాయకులతో కలిసి కూలంకశంగా చర్చించి పరిష్కారం కోసం మంత్రితో మాట్లాడామన్నారు. కార్పొరేషన్ చైర్మన్లతో పాటు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గొల్ల కురుమలకు అవకాశం కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు. మంత్రివర్గంలో చోటు గురించి మీరు చేసిన విన్న పాలను హైకమాండ్ దృష్టికి తీసుకెళ్తాఅని అన్నారు. పశుసంవర్ధశాఖ మంత్రి వాకిటి శ్రీహరి వారితో చర్చించాలని పిసిసి చీఫ్ సూచించడంతో యాదవులు శ్రీహరికి తమ సమస్యలు వివరించారు.

## స్కూళ్ల పర్యవేక్షణకు టీచర్ల నియామకం ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలి

### పాఠశాల విద్య డైరెక్టర్‌కు టిఆర్‌టిఎఫ్ విజ్ఞప్తి

**హైదరాబాద్, జూన్ 23, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల, విద్యా బోధన పర్యవేక్షణకు ప్రస్తుతం ఉన్న విధానాన్నే పటిష్టపరచాలని.. కొత్త విధానం అనవసర గందరగోళానికి దారితీస్తుందని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్(టిఆర్‌టిఎఫ్) డిమాండ్ చేసింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్‌ని సోమవారం టిఆర్‌టిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కటకం రమేష్ కలిసి విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేసిన విధంగా పర్య వేక్షణకు ఒక డిఈఓ, పరిపాలనకు మరొక డిఈఓను నియమించాలని దాంతోపాటు మండలానికి ఇద్దరు ఎంఈఓలను నియ మించాలని డైరక్టర్‌కి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో 33 జిల్లాలు ఏర్పడినప్పటికీ.. ఇప్పటి వరకు 20 డీఈవో పోస్టులు కేటాయించలేదని.. అలాగే నూతన మండలాలకు మండల విద్యాధికారుల పోస్టులు కేటాయించలేదన్నారు. పూర్తిస్థాయి జిల్లా విద్యాధి కారులను కేటాయించాలన్నారు. విద్యాశాఖ అను మతితో అప్‌గ్రేడ్ అయిన పాఠశాలలు నేటికీ మండల పరిషత్ హైస్కూల్‌గా 1 నుండి 10వ తరగతులు కొనసాగుతున్నాయని.. వాటిని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలుగా, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బైఫర్‌కేట్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని డైరెక్టర్‌ని కోరినట్టు తెలిపారు. ప్రస్తుతం ఉన్న వ్యవస్థను పటిష్ట పరుస్తూ ప్యానెల్ ఇన్స్‌పెక్షన్‌ను చేయడం ద్వారా పూర్తిస్థాయి పర్యవేక్షణ జరుగుతుందని.. కానీ నూతన విధానం గందరగోళానికి దారితీస్తుందని ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని కోరారు. ఉపాధ్యాయుల బదలీలు, పదోన్నతుల షెడ్యూల్ జారీ చేయాలని కోరినట్టు కటకం రమేష్ తెలిపారు.

## కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో బిఆర్ఎస్ నేతలకు ముచ్చెమటలు

### బిజెపి ఎమ్మెల్యే రాజాసింగ్

**హైదరాబాద్ (గోషామహల్), జూన్ 23,ప్రభాతవార్త:** గోషామహల్ నియోజకవర్గం బిజెపి శాసనసభ్యులు టి.రాజాసింగ్ బిఆర్ఎస్ నేతలకు కాళేశ్వరంలో విషయంలో స్ట్రాంగ్ హెచ్చరిక చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆధారాలతో సహా బయటపెట్టగానే గులాబిపార్టీ నాయకులు, అవాక్కులు, చెవాక్కులు పేల్చుతున్నారని ఆయన ఒక ప్రకటనలో మండిపడ్డారు. బండిసంజయ్‌పై చేస్తున్నవ్యాఖ్యలను తాను ఖండిస్తున్నట్లు తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు ముమ్మాటికి అవినీతి ప్రాజెక్టేనని ఆయనఆరోపించారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చెప్పినట్లుగా కాళేశ్వరం ప్రాజెక్టు ఎటిఎంలా బిఆర్ఎస్ నేతలు వాడుకున్నట్లు తెలిపినట్లు గుర్తు చేశారు. 38వేల కోట్లతో పూర్తయ్యే ఈ ప్రాజెక్టు రీడిజైన్ పేరుతో లక్షల20వేల కోట్ల పెంచలేదా అని నిలదీశారు. అనాడు స్వయం ప్రకటిత ఇంజనీర్‌గా అవతారం ఎత్తిన మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్, నేడు కెటిఆర్ ఎన్డీఎస్ఏ కంటే తానే తెలివైన మేధావిగా ప్రవర్తించడం సిగ్గుచేటు అన్ని ఎమ్మెల్యే రాజాసింగ్ విమర్శించారు.




తెలంగాణ రాష్ట్రీయ లోక్‌దళ్ చేపట్టిన దీక్షకు మద్దతుగా ప్రసంగిస్తున్న రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

# ప్రత్యేక జర్నల్‌ను ప్రారంభించిన ఉన్నత విద్యామండలి

### టెక్నాలజీ-ఉన్నత విద్యపై ప్రారంభ సంచిక

### వర్చువల్‌గా ప్రారంభించిన మండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డి

**హైదరాబాద్, జూన్ 23, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఉన్నత విద్యను బలోపేతం చేయడానికి ఉన్నత విద్యా మండలి ఇప్పటికే చర్యలు ప్రారంభించింది. అందులో భాగంగా పరిశోధనల్లోనూ విద్యార్థులు ముందుండాలని భావించిన ఉన్నత విద్యా మండల ప్రత్యేకంగా తెలంగాణ జర్నల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ (టిజెహెచ్ఈ)ని ప్రారంభించింది. ప్రారంభ సంచికను ఛైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి సోమవారం ప్రారంభించారు. జర్నల్‌ను వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ విద్యావేత్తలు, పరిశోధ కులు, ఉన్నత విద్యా మండలి వైస్‌చైర్మన్లు ప్రొఫెసర్ ఇటికాల పురుషోత్తం, ప్రొఫెసర్ ఎస్‌కె మహమూద్, కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేష్ పాల్గొన్నారు. తెలంగాణలో పరిశోధనా పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడానికి ఇది ఒక మైలురాయిగా నిలుస్తుందని ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి అన్నారు. బలమైన పరిశోధన సంస్కృతిని పెం పొందించడానికి, విద్యా నైపుణ్యాన్ని నడిపిం చడానికి, ఉన్నత విద్యలో సాక్ష్యం ఆధారిత విధానాన్ని ప్రోత్సహించడానికి టిజెహెచ్ఈ ఉపయోగపడుతుందన్నారు.

ఉన్నత విద్యా మండలి 6 నెలలకొక జర్నల్‌ను ప్రచురించ నున్న ట్టు తెలిపారు. తెలంగాణ విద్యా భవిష్యత్తును రూపొందించడంలో సహాయ పడటానికి ఒక శక్తివంతమైన వేదికగా టిజె హెచ్ఈ పనిచేస్తుందన్నారు. రాష్ట్రంలోని ఉన్నత విద్యా సంస్థలలో పరిశోధన కోసం జర్నల్ ఏర్పాటు ఒక బెంచ్‌మార్క్‌లాగా ఉంటుందని బాల కిష్టారెడ్డి అన్నారు.

జాతీయ స్థాయిలో విద్యా ప్రమాణాలను పెంచాలనే లక్ష్యంతో జర్నల్‌ను తీసుకొస్తున్నట్టు తెలిపారు. కొత్తగా వస్తున్న టెక్నాలజీ, ఆధుని కతలను విద్యార్థులకు పరిచయం చేయడం, ఏడాదికి రెండు జర్నల్స్‌ను తీసుకు రావడంతో పాటు జాతీయస్థాయి సంస్థలతో అవ గాహన ఒప్పందాల(ఎంవోయు)ను చేసుకొని విద్యాసంస్థల సామర్థ్యంతోపాటు విద్యార్థుల సామర్థ్యాన్ని పెంపొందించుకోనున్నట్టు తెలిపారు.




ప్రెస్‌క్లబ్‌లో నిరసన తెలుపుతున్న పిఒడబ్ల్యు రాష్ట్ర కార్యవర్గం

## నకిలీ విత్తనాలు అమ్మేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

### తెలంగాణ రాష్ట్రీయ లోక్‌దళ్ చేపట్టిన దీక్షకు మద్దతు తెలిపిన రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

### 25శాతం ఉచితవిద్యపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి

### టిఆర్ఎల్‌డి రాష్ట్ర అధ్యక్షుడు కపిలవాయి దిలీప్‌కుమార్

**హైదరాబాద్ (ధర్నాచౌక్), జూన్ 23, ప్రభాతవార్త:** రైతులకు నకిలీ విత్తనాలు అమ్ముతూ మోసం చేస్తున్న వారిపై కఠినచర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో తెలంగాణ రాష్ట్రీయ లోక్‌దళ్ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వ తీరును నిరసిస్తూ దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు సంఘీభావం తెలిపి, ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ రైతులకు నాణ్య మైన విత్తనాలు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నప్పటికీ, రేవంత్ సర్కార్ దాన్ని మరిచి, రైతులను కష్టాల సుడిగుండంలోకి నెట్టిందని ఆరోపించారు. రైతుల సమస్యపై అన్ని పార్టీలు స్పందించాల్సిన అవసరం ఉందని అన్నారు. మాజీమంత్రి విజయరామారావు మాట్లాడుతూ రాజకీయ అవినీతి వ్యవహారాన్ని ఒక అంశంగా తీసుకుని టీఆర్ఎల్‌డీ ఆధ్వర్యంలో దీక్ష చేయటం శుభపరిణామమన్నారు. టీఆర్ఎల్‌డి రాష్ట్ర అధ్యక్షులు కపిలవాయి దిలీప్‌కుమార్ మాట్లాడుతూ కొంతమంది మంత్రులపై అవినీతి ఆరోపణలు ఉన్నా ముఖ్యమంత్రి ఎందుకు చర్యలు తీసుకోవటం లేదని ప్రశ్నించారు. ఈ అవినీతి అంశంపై త్వరలో గవర్నర్‌ను కలుస్తామని స్పష్టం చేశారు. పార్టీ ఉపాధ్యక్షులు డాక్టర్ కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ బీసీ విద్యార్థులకు 25 శాతం ప్రైవేట్ పాఠశాలలో సైతం ఉచిత విద్య అందించాలని చట్టం ఉన్నప్పటికీ పాలకులు పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

# ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపాలి

### రాజ్‌భవన్ ముట్టడికి ఎఐవైఎఫ్ యత్నం

### అడ్డుకున్న పోలీసులు.. అరెస్ట్‌చేసి స్టేషన్‌కు తరలింపు

**హైదరాబాద్, జూన్ 23, ప్రభాతవార్త:** ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం అవలంబి స్తున్నదని భయంకరమైన నరమేధ చర్యలు వెంటనే ఆపాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ఖైరతాబాద్ చౌరస్తా నుండి రాజ్ భవన్ కు ర్యాలీగా వెళ్తున్న కార్యకర్తలను అడ్డుకుని, పోలీసులు అక్రమ అరెస్టు చేశారు. తోపులాటలో పలువురు నేతలకు గాయాలు అయ్యాయి. అరెస్ట్ చేసిన నేతలను పంజాగుట్ట పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర మాట్లాడుతూ దండ కారణ్యం తుపాకుల గర్జనతో దద్దరిల్లుతున్నదని, మావోయిస్టులతో పాటు అమాయక ఆదివాసీల నెత్తురు ఏరులై పారుతున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. ఆరు నెలలుగా ఏకధాటిగా కొనసాగుతున్న కూంబింగ్ ఆదివాసీ గూడాలకు కంటిమీద కునుకు లేకుం డా చేస్తున్నదని, మావో యిస్టు రహిత భారత్ కోసమంటూ చేపట్టిన ఆపరేషన్ కగార్ మానవ హక్కుల్ని ఉల్లంఘిస్తూ చేస్తున్న మారణ హోమం వెనుక ఉన్న ఉద్దేశ మేంటి? ప్రశ్నించారు. అడవుల్లో మావోయిస్టు ప్రాబల్య ప్రాంతాల్లో ఉన్న ఖనిజ నిక్షేపాలు. అదానీ, అంబానీ లాంటి కార్పొరేట్లకు అటవీ సంపదను దోచి పెట్టేందుకే ఈ నరమేధం అని విమర్శించారు.




రాజ్‌భవన్ ముట్టడికి వెళ్తున్న ఎఐవైఎఫ్ నాయకులు

## కాళేశ్వరం ప్రాజెక్టుపై సిబిఐ విచారణ జరిపించాలి

### బిజెపి నేతల డిమాండ్

**హైదరాబాద్, జూన్ 23, ప్రభాతవార్త:** కాళేశ్వరం అవినీతి నుండి బయటపడేందుకు బిఆర్ఎస్ నేతలు అపసోపాలు పడుతున్నారని బిజెపి నేతలు ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై బిఆర్ఎస్ నేతలు చేస్తున్న ఆరోపణలపై బిజెపి ఎమ్మెల్యేలు పాల్వాయి హరీష్, రామారావు పటేల్, అంజిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎన్‌విఎస్ఎస్ ప్రభాకర్‌లు ఒక ప్రకటన విడుదల చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టును నిపుణుల బృందం సంద ర్శించి ప్రాజెక్టు లోపాలను ఎత్తి చూపిందన్నారు. కాళేశ్వరంలో జరిగిన అక్రమాలు, నాణ్యతా లోపాలు, మొరాయించిన మోటార్లు, ప్రభుత్వ నిరక్ష్యాన్ని ఎన్‌డిఎస్‌ఏ స్పష్టంగా చెప్పిందని, అయినా ఎన్‌డిఎస్‌ఏ నివేదికను బిఆర్ఎస్ నేతలు తప్పుపట్టడాన్ని ఖండిస్తున్నామని అన్నారు. పిసి ఘోష్ కమిషన్ విచారణ సందర్భంగా బిఆర్ఎస్ నేతలు కారుకూతలు కూశారని అన్నారు. బిఆర్ఎస్ నేతల అవినీతిని బిజెపి పార్టీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని, కాళేశ్వరంపై సిబిఐ విచారణ జరగాలని రాహుల్ గాంధీ చెప్పిన మాటలను మార్చిపోయారా అంటూ ప్రశ్నించారు. బిఆర్ఎస్ చేసిన తప్పులకు శిక్ష అనుభవించక తప్పదన్నారు. కాళేశ్వరంపై సిబిఐ విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

## నిరసనకారులపై పోలీసుల దాష్టీకానికి ఖండన

### పోలీసుల దాడిలో వి.సంధ్యకు తీవ్రగాయాలు

**హైదరాబాద్ (సైఫాబాద్), జూన్ 23, ప్రభాతవార్త:** ప్రజాస్వామిక పాలనను అంది స్తామని వాగ్దానం చేసిన సిఎం రేవంత్‌రెడ్డి పాలనలో పోలీసులు నిరసన కారులపై చేస్తున్న దాష్టీకాన్ని, క్రూరంగా హించడాన్ని తీవ్రంగా ఖండి స్తున్నా మని ప్రగతిశీల మహిళా సంఘం (పిఓడబ్ల్యూ) రాష్ట్ర కార్యవర్గం తీవ్రంగా ఖండించింది. ఇటీవల అమెరికా కాన్సులేట్ కార్యాలయం ఎదుట జరిగిన నిరసన కార్యక్రమంలో పిఓడబ్ల్యూ జాతీయ నాయకురాలు వి.సంధ్య, మహిళా కార్యకర్తలపైన, వయోధికులపై పోలీసుల దాష్టీకాన్ని కార్యవర్గం నిరసించింది. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు అనసూయ, ప్రధాన కార్యదర్శి అంది మంగ తదితరులు మాట్లాడుతూ ఈ నెల 19న వామపక్ష పార్టీలు దేశవ్యాప్తంగా ఇచ్చిన పిలుపులో భాగంగా వివిధ ప్రజాసంఘాలు, ప్రజా స్వామిక వాదులు అమెరికా కాన్సులేట్ ఎదురుగా నిరసన ప్రదర్శన చేస్తున్న వారిని పోలీసులు అడ్డుకుని దౌర్జన్యపూరితంగా వ్యవహరించారని ఆరోపిం చారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న ఉద్యమకారులను గచ్చిబౌలి పోలీస్ అధికారులు బలవంతంగా ఈడ్చుకుంటూ రెక్కలు విరిచి వ్యాన్‌లో పడేశారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆ సమయంలో వి.సంధ్య తీవ్రంగా గాయపడ్డారన్నారు. నిరసన కారులపై అనుచితంగా ప్రవర్తించిన పోలీస్ అధికారులపై చర్యలు తీసు కోవాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# 'పెద్ది' హ్యూజ్ యాక్షన్ నైట్ సీక్వెన్స్ షూటింగ్

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హైలీ యాంటిసిపేటెడ్ పాన్ఇండియా ప్రాజెక్ట్ పెద్ది. నేషనల్ అవార్డ్ విన్నింగ్ ఫిలిం మేకర్ బుచ్చి బాబు సానా దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే సినిమా ఫస్ట్ షాట్ గ్లింప్స్ తో దేశవ్యాప్తంగా హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. పవర్ ఫుల్ కొలాబరేషన్, అద్భుతమైన టీంతో పెద్ది భారతీయ సినిమాలో కొత్త ప్రమాణాలను నెలకొల్పడానికి చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ప్రస్తుతం భారీ యాక్షన్ నైట్ సీక్వెన్స్ షూటింగ్ జరుగుతోంది. స్టార్ డీవోపీ రత్నవేలు ఖిపెద్దిఖి సెట్స్ నుంచి పవర్ ఫుల్ మోమెంట్‌ను షేర్ చేశారు. గ్లోబల్ స్టార్‌తో భారీ నైట్ యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరిస్తున్నట్లు తెలియజేశారు. డీవోపీ రత్నవేలు షేర్ చేసిన స్టిల్ లో రామ్ చరణ్ ఇంటెన్స్ అండ్ బీస్ట్ మోడ్‌లో కనిపించారు. ప్రస్తుతం ఈ స్టిల్ సోషల్ మీడియాలో వైరల్ 'పెద్ది' హ్యూజ్ యాక్షన్ నైట్ సీక్వెన్స్ షూటింగ్అవుతోంది. సినిమాలో ఈ సీక్వెన్స్ మేజర్ హైలెట్‌గా ఉండబోతోంది. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, శివరాజ్ కుమార్, జగపతి బాబు, దివ్యేంద్రు శర్మ ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. చిత్రానికి స్టార్ డివోపీ ఆర్.రత్నవేలు సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, ఆస్కార్ అవార్డు విజేత ఏఆర్ రెహ్మాన్ సంగీతం



అందిస్తున్నారు. జాతీయ అవార్డు గెలుచుకున్న నవీన్ నూలి ఎడిటర్. వినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైన్ చేశారు. ఈ చిత్రం 2026 మార్చి 27న రామ్ చరణ్ పుట్టినరోజున ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. తారాగణం: రామ్ చరణ్, జాన్వి కపూర్, శివ రాజ్ కుమార్, జగపతి బాబు, దివ్యేందు శర్మ, సాంకేతిక సిబ్బంది: రచన, దర్శకత్వం: బుచ్చి బాబు సానా, సమర్పణ: మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్: వృద్ధి సినిమాస్, నిర్మాత: వెంకట సతీష్ కిలారు సంగీతం: ఎఆర్ రెహమాన్, డిఒపి: ఆర్ రత్నవేలు ప్రొడక్షన్ డిజైన్: అవినాష్ కొల్లా, ఎడిటర్: నవీన్ నూలి, ప్రొడక్షన్ డిజైన్: అవినాష్ కొల్లా ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: వి.వై ప్రవీణ్ కుమార్, మార్కెటింగ్: ఫస్ట్ షో పీఆర్వో: వంశీ శేఖర్.

సిద్ధంగా ఉంది. ప్రముఖ పాన్ఇండియా నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో విజనరీ వెంకట సతీష్ కిలారు తన ప్రతిష్టాత్మక బ్యానర్ వృద్ధి సినిమాస్ బ్యానర్ పై భారీ స్థాయిలో ఈ

# ఆడియన్స్‌ను ఆకట్టుకున్న కుబేర: మెగాస్టార్ ప్రశంసలు

సూపర్ స్టార్ ధనుష్, కింగ్ నాగార్జున, రష్మికమందన్న లేటెస్ట్ యునినామస్ బ్లాక్ బస్టర్ శేఖర్ కమ్ముల కుబేర. శేఖర్ కమ్ముల అమిగోస్ క్రియేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో కలిసి ఎస్‌విసిఎల్ఎల్‌పిపై సునీల్ నారంగ్, పుస్కుర్ రామ్ మోహన్ రావు ఈ చిత్రాన్ని హై బడ్జెట్ హై ప్రొడక్షన్ వాల్యూస్‌తో నిర్మించారు. కుబేర తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషలలో జూన్ 20న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదలై యునానిమస్ బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకొని హౌస్ ఫుల్ బుకింగ్స్ తో సక్సెస్ ఫుల్‌గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ బ్లాక్ బస్టర్ కుబేర సక్సెస్



మీట్ నిర్వహించారు. మెగాస్టార్ చిరంజీవి చీఫ్ గెస్ట్‌గా హాజరైన ఈ వేడుక చాలా గ్రాండ్‌గా జరిగింది. బ్లాక్ బస్టర్ కుబేర సక్సెస్ మీట్‌లో మెగాస్టార్ చిరంజీవి మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. ఇది నా సక్సెస్ మీట్ లా అనిపిస్తుంది. అలాంటి ఆనందాన్ని ఇక్కడ పొందుతున్నాను. ఇక్కడ ఉన్నవాళ్లంతా నాకు కావలసిన వాళ్లు. వాళ్ళ మొహంలో ఆనందం చూస్తుంటే ఇది నా సక్సెస్ మీట్ అనిపిస్తోంది. ఇక్కడకి నేను గెస్ట్‌గా రాలేదు. మీలో ఒకడిగా, ఆత్మీయుడుగా వచ్చాను. నాగార్జున ఈ సినిమాకు ముందు ఒకసారి కలిశారు. కుబేర గురించి అడిగాను. ఇందులో ఒకడిఫరెంట్ క్యారెక్టర్ చేశాను. ధనుష్ లీడ్ క్యారెక్టర్ అని చెప్పారు. ఎలా ఒప్పుకున్నావు అని అడిగాను. నాకు ఎక్కడో డిఫరెంట్‌గా చేయాలని ఉంది. కొత్త గేట్స్ ఓపెన్ చేయాలనిపిస్తుంది అలా ఈ సినిమాఉపయోగపడుతుందని చెప్పారు. నేను సినిమా చూశాను. ఆయన చెప్పినది 100శాతం కరెక్ట్. ఈ సినిమా తర్వాత తను మరో 40 ఏళ్ల అద్భుతంగా రాణిస్తారనేది వాస్తవం. ఈ క్యారెక్టర్ శేఖర్ రాయడం, అది నాగార్జున గారుప్పుకొని చేయడం ఇదే ఫస్ట్ సక్సెస్‌గా భావిస్తున్నాను. దేవ క్యారెక్టర్‌లో ధనుస్‌ని తప్ప ఇంకెవరిని ఊహించుకోలేం. ఆక్యారెక్టర్ చూసిన తర్వాత అలా అనిపించింది. సినిమా చూస్తున్నప్పుడు ధనుష్‌ని గుర్తించలేకపోయాను. అంతలా క్యారెక్టర్‌లో ఇన్వాల్వ్ అయిపోయారు. ఈ సినిమాని ఒక సినిమాలా కాకుండా ఒక ఎక్స్పీరియన్స్ లా చూశాను. వాస్తవంగా జరుగుతున్నట్టుగా అనిపించింది. ఒక్కొక్క సినిమాని ఆణిముత్యం లాగా చేస్తూ ప్రేక్షకుల గుండెల్లో ఒక సుస్థిరమైన స్థానాన్ని ఏర్పరచుకున్నా శేఖర్ కమ్ముల. స్టేట్ రౌడీ షూటింగ్ జరుగుతున్నప్పుడు శేఖర్ కమ్ముల నన్ను ఓ అభిమానిలా కలిశారు. ఆరోజే సినిమా ఇండస్ట్రీలో స్థిరపడిపోవాలని నిర్ణయించుకున్నారు. ఈరోజు ఇలాంటి ఆణిముత్యాలు లాంటి సినిమాలు తీసి ప్రేక్షకుల మన్ననలని పొందుతున్న దర్శకుడిగా ఆయన ఉండడం నిజంగా నాకు చాలా గర్వంగా ఉంది. ఈ సిల్వర్ జూబ్లీ ఇయర్ సందర్భంగా ఆయనకి మరొకసారి నా అభినందనలు తెలియజేస్తున్నాను. శేఖర్‌కమ్ముల సినిమాలో వాస్తవానికి దగ్గరగా ఉంటాయి. ఈ సినిమాల పాత్రలు కూడా దేవ దీపక్ అనే గుర్తు పెట్టుకుంటాం. నాగ్ అనుకున్నట్లుగా ఇది ఆయనకి మరో డోర్ ఓపెన్ అయింది. మరిన్ని ఫెంటాస్టిక్ క్యారెక్టర్స్ ఆయనకి వస్తాయి. ఆయన దోవలో కూడా నేను వస్తానని అనుకుంటున్నాను.

# మాళవికకు 'పర్సనాలిటీ ఆఫ్ ది ఇయర్' అవార్డ్

బ్యూటిఫుల్ టాలెంటెడ్ హీరోయిన్ మాళవికమోహనన్ మరో ఘనత దక్కించుకుంది. ఆమె ముంబైలో జరిగిన ఐడబ్ల్యూఎంబజ్ డిజిటల్ అవార్డ్స్‌లో పర్సనాలిటీ ఆఫ్ ది ఇయర్‌గా అవార్డ్ దక్కించు కుంది. ఓటీటీ, వెబ్ ఎంటర్‌టైన్ మెంట్‌కు సంబంధించిన బిగ్గెస్ట్‌అవార్డ్స్ గా ఈ సంస్థకు పేరుంది. ఐడబ్ల్యూఎంబజ్ డిజిటల్ అవార్డ్స్ ఈవెంట్ లో రెడ్ కార్పెట్‌పై నడిచిన మాళవిక మోహనన్ ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మాళవిక మోహనన్ ప్రస్తుతం ప్రభాస్ సరసన రాజా సాబ్ చిత్రంలో నటిస్తోంది. ఈ సినిమాతో ఆమె టాలీవుడ్‌లోకి గ్రాండ్‌ఎంట్రీఇస్తోంది. రీసెంట్‌గా రిలీజ్ చేసిన రాజా సాబ్ టీజర్‌లో మాళవిక స్టన్నింగ్ లుక్స్ తో



ఆకట్టుకుంది. ఈ సినిమాతో తెలుగు ఆడియెన్స్ కు మరింత దగ్గర కానుంది మాళవిక.

# 'ఐకాన్స్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డ్స్' ప్రదానం

వివిధ రంగాల్లో ప్రతిభ చూపించిన వారి కృషికి మంచి గుర్తింపు ఇవ్వాలనే ప్రయత్నంతో విజన్ స్టూడియోస్ 11వ వార్షికోత్సవం సందర్భంగా ఐకాన్స్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డ్స్ 2025 పేరుతో అవార్డ్స్ అందించారు. సినీ, విద్యా, వైద్యం, రియల్ ఎస్టేట్..ఇలా పలు రంగాల్లో ఈ అవార్డ్స్ అందించారు. విజన్ స్టూడియోస్ వారు మొదటి సారిగా నిర్వహించిన ఈ అవార్డ్స్ ఈవెంట్ హైదరాబాద్ లోని ఓహోటల్లో ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సినీ రంగంతో పాటు ఇతర రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు ఈ ఈవెంట్‌లో అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, రమేష్ కింద స్థాయి నుంచి ఎదిగిన వ్యక్తి. పట్టుదలతో కష్టపడే తత్వం కలవాడు. ఆయన విజన్ స్టూడియోస్ స్థాపించి 11 ఏళ్లుగా సక్సెస్‌ఫుల్‌గా నిర్వహిస్తున్నాడు. ఈ అవార్డ్స్ కార్యక్రమానికి అతిథిగా రావడం సంతోషంగా ఉంది. హైదరాబాద్‌ను



బాలీవుడ్‌సహా అన్ని సినిమాలకు కేంద్రంగా మార్చాలని తెలంగాణ ప్రభుత్వం కృషిచేస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు హైదరాబాద్‌లో సినీ రంగాన్ని మరింతగా అభివృద్ధి చేయబోతున్నాం. హైదరాబాద్ ఇన్ ఛార్జ్ మంత్రిగా నేను ఆ బాధ్యత వహిస్తాను. విజన్ స్టూడియోస్‌లో పనిచేస్తున్న ప్రతి ఒక్కరికీ నా అభినందనలు తెలియజేస్తున్నా అన్నారు. విజన్ స్టూడియోస్ అధినేత రమేష్ మాట్లాడుతూ, కింద స్థాయి నుంచి నా ప్రస్థానం మొదలైంది. చిన్న బిజినెస్ నుంచి స్టూడియో స్థాపించే దాకా ఒక లక్ష్యంతో పట్టుదలగా పనిచేశాను.

# ఆగస్టు 30న దుబాయ్‌లో 'గామా' అవార్డ్స్

ఆగస్టు 30న టాలీవుడ్ అవార్డ్స్‌తో పాటు ఆగస్టు 29న ఎక్సలెన్స్ అవార్డ్స్ వేడుకను నిర్వహించేలా భారీ సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమానికి టాలీవుడ్ హీరోలు సిద్దు జొన్నలగడ్డ, తేజ సజ్జ, కిరణ్ అబ్బవరం, శ్రీ విష్ణు, రోషన్.. హీరోయిన్స్ మీనాక్షిచౌదరి, దక్ష నాగర్కర్‌తో పాటు.. తెలుగు చలనచిత్ర పరిశ్రమ నుంచి అగ్ర కథానాయకులు, టాప్ టెక్నీషియన్స్ పాల్గొనబోతున్నారు. అలాగే హీరోయిన్స్ ఊర్వశి రౌతేలా, కేతిక శర్మ, ఫరియా అబ్దుల్లా, ప్రియా హెగ్డే, శ్రీదేవి స్పెషల్ పర్ఫార్మెన్స్‌లతో అలరించనున్నారు. ప్రత్యేక అతిధులుగా బ్రహ్మానందం, దర్శకులు సుకుమార్, బుచ్చి బాబు, బాబీ, సాయి రాజేష్, సంగీత దర్శకులు దేవిశ్రీప్రసాద్, తమన్, నిర్మాతలు అశ్విని దత్, డివివి దానయ్య, చంద్రబోస్, వెన్నెల కిషోర్ తదితర ప్రముఖులు హాజరవనున్నారు. వీరితో పాటు పలువురు టాలీవుడ్ అగ్రశ్రేణి నటీనటులు సర్ ప్రైజ్ గెస్ట్ లుగా హాజరు కానున్నారు. అతిరథ ప్రముఖుల మధ్య



అంగరంగ వైభవంగా జరగనున్న ఈఅవార్డ్స్ వేడుక కోసం చిత్ర పరిశ్రమతో పాటు ప్రేక్షకులు సైతం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తు న్నారు. టాలీవుడ్ 24 క్రాఫ్ట్స్ కు ఈ అవార్డ్స్ ను అందించనున్నారు. 2024లో విడుదలైన చిత్రాల్లో నామినేటె అయిన విభాగాలకు, పబ్లిక్ ఓటింగ్ ప్రక్రియ ద్వారా సెలెక్ట్ చేస్తున్నారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా జరగనున్న ఈ వేడుకకు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సంగీత, కళా రంగ ప్రముఖులు, ప్రతిభావంతులు, సినీ పరిశ్రమకు చెందిన లెజెండ్స్ ఈ గామా అవార్డ్స్ 2025 లో పాల్గొననున్నారు. ఈ ఏడాది కూడా పలు పాపులర్ చిత్రాలు, స్టార్ హీరోలు, స్టార్ హీరోయిన్స్, టాప్ టెక్నీషియన్స్ గామా అవార్డులను అందుకోనున్నారు. ఇటీవల ఈ కార్యక్రమానికి సంబంధించి గ్రాండ్ రివీల్ ఈవెంట్‌ను దుబాయ్‌లో నిర్వహించగా అద్భుతమైన స్పందన వచ్చింది. మైత్రి ఫార్మ్‌లో గామా అవార్డ్స్ 5వ ఎడిషన్ టిక్కెట్లను మహిళలు విడుదల చేశారు. గామా అవార్డ్స్ 2025 జ్యూరీ చైర్ పర్సన్స్ ప్రముఖ సినీ దర్శకులు ఏ.కొదండ రామిరెడ్డి, ప్రముఖ సంగీత దర్శకులు కోటి, ప్రముఖ సినీ దర్శకులు బి. గోపాల్ ఆధ్వర్యంలో వివిధ రంగాలకు ఎంపిక అయిన టాలీవుడ్ కళాకారులకు, సినిమాలకు గామా అవార్డ్స్ బహుకరించబడతాయి.




# 'డ్యూడ్' నుంచి మమిత బైజూ స్పెషల్ బర్త్‌డే పోస్టర్

వరుస విజయాలతో దూసుకుపోతున్న యంగ్ సెన్సేషన్ ప్రదీప్ రంగనాథన్ ప్రస్తుతం మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న పాన్ ఇండియా చిత్రం డ్యూడ్‌లో నటిస్తున్నారు. కీర్తిశ్వరన్ దర్శకత్వంలో ఈ చిత్రం యువతకు నచ్చే ఎంటర్టైనర్‌గా ఉండనుంది. ప్రదీప్‌కు జోడీగా ప్రేమలు ఫేమ్ మమిత బైజూ కథానాయికగా నటిస్తుండగా, సీనియర్ నటుడు శరత్ కుమార్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే రిలీజైన ప్రదీప్ రంగనాథన్, మమిత బైజూకు ఫస్ట్‌లుక్ పోస్టర్స్‌కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. మేకర్స్ మమిత బైజూ బర్త్ డే విషెస్‌ని అందిస్తూ ఆమె పాత్రని కురళ్‌గా పరిచయం చేస్తూ స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ పోస్టర్‌లో మమిత బైజూ తన బ్యూటీ అండ్ చార్మ్‌తో కట్టిపడేశారు. ఈ పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ప్రేమలులో తన ఎనర్జిటిక్ పెర్ఫామెన్స్‌తో క్రేజ్ తెచ్చుకున్న మమిత డ్యూడ్‌తో అద్భుతంగా అలరించడానికి రెడీ అవుతున్నారు. ఈ చిత్రానికి ట్యాలెంటెడ్ టెక్నిషియన్స్ పని చేస్తున్నారు. యంగ్ సెన్సేషన్ సాయి అభ్యాంకర్ మ్యూజిక్ అందిస్తుండగా, నికేత్ బొమ్మి సినిమాటోగ్రఫీని నిర్వహిస్తున్నారు. లతా నాయుడు ప్రొడక్షన్ డిజైనర్‌గా, భరత్ విక్రమన్ ఎడిటర్‌గా పని చేస్తున్నారు. ప్రొడక్షన్ ఇప్పటికే పూర్తి స్థాయిలో జరుగుతుండటంతో దీపావళికి సరైన ఎంటర్టైనర్‌ను అందించడానికి టీం జెట్ స్పీడ్‌లో వర్క్ చేస్తోంది. డ్యూడ్ చిత్రం తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషలలో విడుదల కానుంది. తారాగణం: ప్రదీప్ రంగనాథన్, శరత్ కుమార్, మమిత బైజు, హృదు హరూన్, ద్రవిడ్ సెల్వం, సాంకేతిక సిబ్బంది: రచన, దర్శకత్వం: కీర్తిశ్వరన్, నిర్మాతలు: నవీన్ యెర్నేని, వై రవిశంకర్ సిఇఒ: చెర్రీ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: అనిల్‌యెర్నేని, సంగీతం: సాయి అభ్యంకర్, సినిమాటోగ్రాఫర్: నికేత్ బొమ్మి, ప్రొడక్షన్ డిజైనర్: లతానాయుడు.



# ప్రిన్స్ హీరోగా నూతన చిత్రం షురూ

హీరో ప్రిన్స్, సుహానా ముద్వాన్ హీరోయిన్‌గా, సునైనా, నెల్లూరు సుదర్శన్, ప్రధాన పాత్రలలో కుమార్ రవికంటి దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కుతోంది. ప్రముఖ నిర్మాణ సంస్థ అయిన లైట్ స్టోర్మ్ సెల్లులోయిడ్స్‌పై కుమార్ రవి కంటి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కెఎల్ స్టూడియోలో జరిగిన పూజా కార్యక్రమాలకు సినీ పరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు హాజరు అయ్యారు. చిత్ర బృందాన్ని అభినందించారు. కుమార్ రవి కంటి మాట్లాడుతూ, ఈ చిత్రం జూన్ జూలై మరియు ఆగస్టులో ఏకధాటిగా సినిమా చిత్రీకరణ జరుపుకుని విదేశాలలో సాంగ్స్ షూటింగ్ జరుపుకోనుంది. అద్భుతమైన సాంకేతిక విలువలు



కలిగిన చిత్రం ముహూర్తపు సన్నివేశానికి క్లాప్ బేబీ దియ రవికంటి కొట్టారు మరియు కెమెరా స్విచ్ ఆన్ శ్రీమతి సుమ రవికంటి, బేబీ మాయ రవికంటి మొదటి దర్శకత్వం వహించారు. ఇన్వెస్టిగేషన్ అండ్ థ్రిల్లర్‌గా ఈ చిత్రం తెరకెక్కనుంది. చక్కటి హాస్యం, హృదయాన్ని హత్తుకునే భావోద్వేగాల కలయికగా ఈ సినిమా రూపుదిద్దుకోనున్నట్లు చిత్ర బృందం తెలిపింది. నటీనటులు: ప్రిన్స్, సుహాన ముద్వాన్, సునైనా, నెల్లూరు సుదర్శన్, సతీష్ సారెపల్లి, శ్రీమని సాంకేతిక నిపుణులు: బ్యానర్: లైట్ స్టోర్మ్ సెల్లులోయిడ్స్, నిర్మాత: కుమార్ రవికంటి, రచన, దర్శకత్వం: కుమార్ రవికంటి, కెమెరామెన్: జి.అమర్, మాటలు: భవాని ప్రసాద్, ప్రొడక్షన్ డిజైనర్: అర్జున్ సూరిశెట్టి, కో డైరెక్టర్: జే.జి.రాజు, ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్: భిక్షపతి తుమ్మల, పీఆర్ఒ: శ్రీపాల్ చొల్లేటి.

# 'మిత్ర మండలి' నుంచి ఫస్ట్ సాంగ్

బన్నీ వాస్ నూతన నిర్మాణ సంస్థ బి.వి. వర్క్స్ సమర్పణలో సప్త అశ్వ మీడియా వర్క్స్, వైరా ఎంటర్టైన్మెంట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం మిత్ర మండలి. అభిరుచి గల నిర్మాతలు కళ్యాణ్ మంతిన, భాను ప్రతాప, డా. విజయేందర్ రెడ్డి తీగల నిర్మిస్తున్నారు. ప్రియదర్శి, రాగ్ మయూర్, విష్ణు ఓయ్, ప్రసాద్ బెహరా ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రంతో సోషల్‌మీడియా సంచలనం నిహారిక ఎన్.ఎం. తెలుగు తెరకు పరిచయమవుతున్నారు. నూతనదర్శకుడు విజయేందర్ ఎస్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇటీవల విడుదలైన టీజర్‌కు విశేష స్పందన లభించింది. ఈ చిత్రం అపరిమిత వినోదాన్ని అందించనుందనే నమ్మకాన్ని టీజర్ కలిగించింది. తాజాగా మిత్ర మండలి నుంచి మొదటి గీతం కత్తందుకో జానకిని నిర్మాతలు విడుదల చేశారు. రెబల్ స్టార్ కృష్ణంరాజు ఐకానిక్ డైలాగ్ కత్తందుకో జానకిని తీసుకొని, ఈ తరం మెచ్చేలా అద్భుతమైన పాటగా మలిచారు. ఆర్.ఆర్. ధృవన్ స్వరపరిచిన ఈ గీతం.. వినసొంపుగా, అందరూ సరదాగా పాడుకునేలా ఉంది. కాసర్ల శ్యామ్ మరోసారి తన కలం బలం చూపించారు. ఈ సరదా గీతాన్ని ఎంతో అందంగా, అర్థవంతంగా వ్రాశారు. ఇక రాహుల్ సిప్లిగంజ్ తన గాత్రంతో పాటకు మరింత జోష్ తీసుకొచ్చారు. మిత్ర మండలి మొదటి గీతం ఖికత్తందుకో జానకిఖికి అద్భుతమైన స్పందన లభిస్తోంది. ప్రధాన పాత్రధారులు ప్రియదర్శి, విష్ణు ఓయ్, రాగ్ మయూర్, ప్రసాద్ బెహరాల ప్రపంచాన్ని పరిచయం చేస్తూ గీతం సాగింది. తమ గురించి తాము ఉల్లాసంగా పాడుతూ.. నేటి జెన్‌జెడ్ అలవాట్లయిన రీల్స్, రిలేషన్స్, పబ్జీ గేమింగ్ ఇలా ప్రతిదానిని ప్రస్తావిస్తూ కత్తందుకో జానకి గీతం నడిచిన తీరు కట్టిపడేసింది. ఓ వైపు యువత తమ అలవాట్లను చెప్పుకుంటుంటే, మరోవైపు తల్లిదండ్రులు వారిని తరుముతూ కత్తందుకో జానకి అనడం ఆకట్టుకుంది. అమలాపురం కిమ్స్ కాలేజ్ లో జరిగిన కత్తందుకో జానకి గీతావిష్కరణ వేడుకకు ముఖ్య అతిథిగా అమలాపురం ఎంపీ జి.ఎం. హరీష్ బాలయోగి హాజరయ్యారు. అలాగే కిమ్స్ చైర్మన్ చైతన్య రాజు, ఎండీ రవివర్మ ఈ వేడుకలో పాల్గొన్నారు. ఘనంగా జరిగిన ఈ కార్యక్రమంలో చిత్ర సమర్పకులు బన్నీ వాస్, నిర్మాతలు కళ్యాణ్ మంతిన, భాను ప్రతాప, డా. విజయేందర్ రెడ్డి తీగల, నటీనటులు ప్రియదర్శి, నిహారిక, రాగ్ మయూర్, విష్ణు ఓయ్, ప్రసాద్ బెహరా, దర్శకుడు విజయేందర్ ఎస్, సంగీత దర్శకుడు ఆర్.ఆర్. ధృవన్ తదితరులు సందడి చేశారు. కత్తందుకో జానకి గీతం యువత మెచ్చేలా ఉందని ప్రశంసించిన అతిథులు.. మిత్ర మండలి సినిమా ఘన విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలియజేశారు. బాధలన్నీ మర్చిపోయి, థియేటర్లలో మనస్ఫూర్తిగా నవ్వుకునేలా మిత్ర మండలి సినిమా ఉంటుందని చిత్ర యూనిట్ తెలిపింది.



# కళాకారులకు ఆర్థికసాయం



సుస్మిత

గొప్ప కళలకు పుట్టినిల్లు భారతదేశం. అలాంటివి ఇక్కడే ప్రాచీన కళలు అంతరించిపోతుంటే తట్టుకోలేక పోయారు సుస్మితా కనేరి. అందుకు తన ఉద్యోగాన్ని సైతం పక్కనపెట్టి 'గుల్లక్ క్రౌడ్ ఫండింగ్' ద్వారా విరాళాలు సేకరిస్తున్నారు. వాటితో అంతరించి పోతున్న కళలకు ప్రాణం పోస్తున్నారు.

సుస్మిత పుట్టిపెరిగింది మహారాష్ట్రలోని పుణె. అక్కడే విట్ కాలేజీలో ఇంజినీరింగ్ పూర్తిచేశారు. వృత్తి రీత్యా సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అయినప్పటికీ కళలపై మక్కువ ఎక్కువ. సుస్మితకి చిన్నప్పటినుంచి సేవ చేయడం ఇష్టం. దీంతో చదువుకుంటున్న రోజుల్లోనే అనేక సామాజిక కార్యక్రమాలు నిర్వహించేవారు. అంతేకాదు, 'క్రౌడ్ ఫండింగ్' పేరుతో విరాళాలు సేకరించి అనాథ పిల్లలకు చదువు చెప్పించడం, పుస్తకాలు కొనివ్వడం చేసేవారామె. 2021లో నిర్మల్ పెయింటింగ్స్‌ని చూడటానికి తెలంగాణ వచ్చారు. బొమ్మల్లో కథ మొత్తాన్ని చెప్పే ఈ ఆర్ట్ తనకెంతో నచ్చిందట. దాంతో వాటి చరిత్ర తయారీ విధానం అడిగి తెలుసుకున్నారట. ఈ కళను మీ పిల్లలకు నేర్పిస్తున్నారా? మీ తర్వాత వారు దాన్ని కొనసాగిస్తారా? అని అడిగా ఆయన వెంటనే 'నాలా నా పిల్లలు కూడా కష్టపడాలా? వాళ్ల ఉద్యోగం చేస్తారు. ఆదాయం లేదు సరే, విలువలేని పని చేయడం ఎందుకు? అంటూ బాధ పడ్డారు. చేతివృత్తులు చేసే అందరూ ఇలానే అనుకుంటే కొన్నాళ్లకు ఈ కళలు అంతరించిపోతాయి. అందుకే ఆ కళలకు ప్రాణం పోయాలనుకున్నా అంటారామె. అందుకే చేతివృత్తుల వారికి ఉపాధి కల్పించాలనుకున్నారు.

**గుల్లక్.. ఇద్దరి మధ్యా వారధి...** నగరవాసులు వైవిధ్యభరిత కళలతో ఇంటి సొబగులు కోరుకుంటున్నారు. వాళ్లకు నేరుగా కళాకారుల ఉత్పత్తులు అందేలా చేస్తే ఇద్దరికీ మేలని భావించి 'గులక్.ఓఆర్‌జి'ని ఏర్పాటు చేశారు. సంప్రదాయ, గిరిజన, చేతి కళలలో నైపుణ్యం ఉండి ఆదరణ కరువైన కళాకారులకు ఇది ఓ మంచి వేదిక. ఇందులో సంప్రదాయ, గిరిజన కళాఖండాలను ఆన్‌లైన్‌లో ఉంచుతారు. నచ్చినవారు వాటిని కొనుగోలు చేసుకుంటారు. ఈ రకంగా కళాకారులని, కస్టమర్లని ఏకం చేస్తున్నారామె. ఓ పక్క వారికి ఉపాధి



కల్పిస్తూనే కళలను కాపాడుతున్నారు. అంతేకాదు, గులక్ క్రౌడ్ ఫండింగ్‌తో విరాళాలు సేకరించి ఉపాధి కోల్పోయిన కళాకారులకు ఆర్థికసాయం అందిస్తున్నారు సుస్మితా కనేరి.

# రొట్టెలతో ఉపాధి పొందుతూ..

**జొన్న లేదా సజ్జ పిండితో రొట్టెలు వేరుశనగ పొడి, ఇంకా పెరుగు కలబురగిలోని మహిళల రోజువారీ వంటలో ఇవి తప్పనిసరి పూరి గుడిసె. దాబా అన్న తేడా లేదు. కానీ అవే ఇప్పుడు వారిని ఆదుకునే మార్గమవుతాయని అక్కడి మహిళలూ ఊహించి ఉండరు వారిని ఆర్థిక స్వావలంబన దిశగా నడిపిస్తోన్న ఆ కలబురగి రొట్టె గూర్చి తెలుసుకుందాం.**

ఒకరికి అనారోగ్య సమస్యలు మరొకరికి పిల్లల చదువులెలా అన్న బెంగ. ఇంకొకరికి ఇల్లు ఎలా గడపాలో తెలియక తికమక. ఏడాదిన్నర క్రితం వరకూ కర్ణాటకలోని కలబురగి జిల్లా మహిళల జీవన సమస్యలివి. కర్ణాటకలోనే కాదు దేశంలోనే అత్యంత వెనకబడిన జిల్లాల్లో కలబురగి ఒకటి మహిళల అక్షరాస్యత చాలా తక్కువ అత్యల్ప వర్షపాతం కారణంగా ఇక్కడ ప్రధాన వ్యవసాయ పంట చిరుధాన్యాలే. దీంతో ఇక్కడి ఆహారం రొట్టెలే. వారి ఆకలి తీర్చే ఆ ఆహారమే ఆర్థిక చైతన్యానికి కారణమైంది. ఇందుకు పునాది వేసింది అక్కడి జిల్లా యంత్రాంగం అక్కడి మహిళలకు బాగా తెలిసిన రొట్టెల తయారీతోనే ఉపాధి మార్గాన్ని చూసి ఓ బ్రాండ్ సృష్టించి పేద మహిళలను భాగస్వాములను చేసింది. జిల్లాలోని ఏడు తాలూకాల్లో 175కుపైగా మహిళా స్వయం సహాయక బృందాలతో కలబురగి రొట్టె ఉత్పాదక సహకార సంఘాన్ని ఏర్పాటు చేసింది.


**అలా మొదలైంది....** కలబురగి జిల్లా కలెక్టర్ ఫౌజియా తరను ఓసారి నగర పర్యటనలో భాగంగా కారులో వెళ్తున్నప్పుడు ప్రతి బస్టాండ్ వద్ద కొందరు మహిళలు రొట్టెలను విక్రయించడం గమనించారు. వాటిని కళాశాల విద్యార్థులు, ఉద్యోగులు కొంటుండటం చూసి.. ఓ మహిళతో మాట్లాడారు. రోజువారీ ఎంత సంపాదిస్తారో కనుక్కున్నారు. వచ్చేది నామమాత్రపు మొత్తమే. దీంతో వీటికి ఒక బ్రాండ్ సృష్టిస్తే ఈ మహిళల ఆదాయాన్ని మరింత పెంపొచ్చు అన్న ఆలోచనను జిల్లా మంత్రి ప్రియాంక్ ఖర్గేతో పంచుకున్నారు. ఆపై జిల్లా వ్యవసాయ శాఖ అధికారులతో వ్యాపార ప్రణాళిక సిద్ధం చేయించి. 2024 నవంబరులో కలబురగి రొట్టె బ్రాండ్‌ను ఆవిష్కరించారు. సాధారణంగా కర్ణాటక వ్యాప్తంగా ఉత్తర కర్ణాటక వంటకాలకు ప్రసిద్ధి చెందిన హోటళ్లు, రెస్టరంట్లలో కలబురగి, విజయపుర బీదర్ వంటి జిల్లాల మహిళలు పని చేస్తుంటారు. అలా పొట్ట కూటికోసం వలస వెళ్లే ఈ కార్యక్రమం అడ్డుకుని, మహిళా సంఘాలుగా ఏర్పాటుచేశారు. ఒక్కో సంఘం రోజుకు 3 వేల రొట్టెలను తయారుచేస్తోంది. జొన్న, సజ్జ ఇతర మిల్లెట్ రొట్టెలను ఒక్కోటీ రూ.5కొని సహకార సంఘం బ్రాండ్ ద్వారా రూ.10కు విక్రయిస్తుంటుంది. వాటితో పాటు వేరుశనగ, కంది పొడి, పెరుగు, పచ్చళ్లనూ ప్యాకెట్లుగాచేసి అమ్ముతున్నారీ మహిళలు. నెలకు ఒక్కొక్కరూ సుమారు రూ.10 వేలు వరకూ అందుకుంటున్నారు. వ్యక్తిగతంగా ఆసక్తి ఉన్నవారూ వీటిని తయారుచేస్తున్నారు. అలా వీటికోసం ప్రస్తుతం 50 వేల మంది మహిళలు శ్రమిస్తున్నారు.





**ఆన్‌లైన్‌లోనూ...** స్విగ్గీ, జొమాటోల్లో కొద్ది రోజుల్లోనే కలబురగి రొట్టెలకు ఆదరణ పెరిగింది. జిల్లా, రాష్ట్ర స్థాయి హోటళ్లలోనే కాదు. ఈ కామర్స్ వేదికల్లోనూ అందుబాటులోకి తెచ్చారు. పండుగల వేళ 'కలబురగి బుట్ట' పేరుతో ప్రత్యేక ప్యాకేలు బెంగళూరు, మైసూరుతోపాటు ఇతర 15 నగరాల్లో ప్రత్యేక ఔట్‌లెట్లలో విక్రయిస్తున్నారు. ఇటీవల జిల్లా యంత్రాంగం ఈ బ్రాండ్ కోసం ప్రత్యేక క్యూఆర్ కోడ్‌ని తయారుచేసింది. దాన్ని స్కాన్ చేస్తే ఈ రొట్టెల ద్వారా అంటే పోషకాలను తెలుసుకోవచ్చు. ఈ అవగాహనతో అమ్మకాలు మరింత పెరిగాయి. ఇప్పటికే కలబురగి కందులు, కొబ్బరికాయకు భౌగోళిక గుర్తింపు (జిఐ) వచ్చింది. కలబురగి రొట్టెకీ అంతటి గుర్తింపు తేవాలన్నది జిల్లా యంత్రాంగం లక్ష్యమట.

# సమన్వయాన్ని పెంచే స్విస్ బాల్ !




**బరువు తగ్గాలి.. ఆరోగ్యం మెరుగుపడాలి. ఇకనైనా వర్కవుట్లు చేద్దాం అని చాలాసార్లే అనుకుంటాం. కానీ అమలు చేయం. ఈ స్విస్ బాల్‌ని ఇంటికి తెచ్చుకుని చూడండి.**

బోలెడన్ని ప్రయోజనాలు.

- స్విస్‌బాల్‌తో పొట్ట, వీపు, పొత్తికడుపునకు ప్రయోజనం ఇచ్చే కసరత్తులు సులువుగా చేయెచ్చు. దీతో శరీరాన్ని బ్యాలెన్స్ చేయగలరు. మెరుగైన పోశ్చర్ కూడా వస్తుంది. ఉదాహరణకు బాల్‌పై సిట్-అప్స్, ప్లాంక్స్ ప్రయత్నించి చూడండి.
- గర్భిణులు, వర్క్‌ఫ్రమ్ హోమ్ చేసేవారు, డెస్క్ ఉద్యోగులు.. ఈ స్విస్ బాల్‌పై వ్యాయామం చేయడం వల్ల వెన్ను కండరాలు బలపడతాయి. గర్భిణులకు ప్రసవ సమయంలో ఎదురయ్యే ఇబ్బందులు తగ్గుతాయి.
- రోజువారీ పనులు చేసుకోవడం కష్టంగా ఉందా? అయితే, మీ శరీరం ఫ్లెక్సిబుల్‌గా మారాలంటే స్విస్‌బాల్‌తో వ్యాయామాలు మొదలుపెట్టండి. ఒత్తిడీ అదుపులో ఉంటుంది.

# అరటి చెక్కుతో పపితా ఖార్ !

**ఆస్సామీలు ఎంతో ఇష్టంగా తినే సంప్రదాయ వంటకం పపితా ఖార్.** దీన్నే అమితా ఖార్, పపయా ఖార్ అనికూడా పిలుస్తారు. వీళ్ల భోజనాన్ని దీంతోనే మొదలు పెట్టడానికి ఇష్టపడతారు. ఎవరికివాళ్లు ఇంట్లో చేసుకోవడమే కాదు. హోటళ్లలోనూ వండి వడ్డిస్తారు. ఇంతకీ దీన్నెలా చేస్తారంటే.. ముందుగా అరటికాయ చెక్కు తీసి కాల్చి, పది నిమిషాల పాటు వేడి నీళ్లలో నానబెట్టి, వడకట్టి ఖార్ తయారుచేస్తారు. దీన్ని బంగాళదుంపలతోనూ వండుతారు. అయితే పచ్చి బొప్పాయితో కలిపి చేసేది ఇంకా రుచిగా ఉంటుంది. కడాయిలో నూనె, మెంతులు, వెల్లుల్లి తరుగు, పసుపు, ఉప్పు, బొప్పాయి ముక్కలు, చెక్కు తీసిన బంగాళ దుంప ముక్కలు, సిద్ధంగా ఉన్న ఖార్, వంటసోడా వేసి వేయించాలి. మిశ్రమం గోధుమ రంగులోకి మారాక.. అరకప్పు నీళ్లు పోసి..సెగ తగ్గించి మూత పెట్టాలి. మధ్యలో కలియబెడుతూ దగ్గరపడ్డాక దించేస్తే 'పపితా ఖార్' తయారైపోతుంది. ఇది రుచికే కాదు ఆరోగ్యానికీ మంచిదే. దీన్ని తినడం వల్ల పొట్ట శుభ్రపడటంతోపాటు కంటిచూపూ మెరుగుపడుతుంది. అన్నిటికంటే ముఖ్యంగా బరువూ పెరగరని నమ్ముతారు.



# ఆలోచించండి !



పెళ్లిళ్ల సీజన్‌లో మొహందీ, హల్దీ, పెళ్లి, రిసెప్షన్... ఇలా వేడుకలమీద వేడుకలు. అతిథి మర్యాదలు ఎక్కడా తగ్గకూడదని రకరకాల వెరైటీలు పెడతారు. అన్నీ టేస్టు చేద్దామని ప్లేటు. నిండా పెట్టుకుంటారు కొందరు. సగం కూడా తినరు, తినలేరు. పిల్లల కోసమూ ప్రత్యేకంగా ప్లేటు తీసుకుంటారు. ఏదో ఒకటి తింటారని కనిపించినవన్నీ వడ్డిస్తారు. తీరా వాళ్ళు తినేదీ నాలుగు మెతుకులే ఎంత వృథా? కానీ ఏమాత్రం గిల్టీ లేకుండా ఆ ప్లేటుని అలాగే తీసుకెళ్లి వేస్ట్ డబ్బాలో పెట్టేస్తారు. దానికోసం లక్షలు ఖర్చుపెట్టిన యజమాని కాదు, ఎంతమంది ఎన్ని రకాలుగా కష్టపడితే అది మన ప్లేటులోకి వచ్చిందో అని కనీస స్పృహ ఉన్న వాళ్లవారికైనా బాధగానే అనిపిస్తుంది. అలాగని నచ్చకున్నా తినమని చెప్పడంలేదు. తినలేనన్ని వెరైటీలు అక్కడ ఉన్నా మీరేది తినగలరో ఏ మేరకు తినగలరో అవే పెట్టుకోండి కొత్త వెరైటీల్ని రుచి చూశాకే వడ్డించుకోండి. నచ్చితే మరింత పెట్టుకోవచ్చు. అలాగే రెస్టరెంట్లకు వెళుతుంటారు. ఎవరైనాకొద్దీ ఆర్డరు చేస్తారు. అది కాస్తా ఇది కాస్త కెలికినట్లుగా తిని పక్కన పెట్టేస్తారు. అదంతా వెళ్లేదీ చెత్తలోకే కోట్లాది మంది ఆకలితో అలమటిస్తే.. ఆహారాన్ని ఈ స్థాయిలో వేస్ట్ చేయడం ఎంతవరకూ కరెక్టో ఒక్కసారి ఆలోచించండి, అంతేకాదు, ఆతిథ్యం ఇచ్చేవాళ్లూ తిన్న ప్లేట్లను పెట్టి కొందరిని ఉంచాలి. మనం ఉంటే మరొకరు గమనిస్తున్నారన్న స్పృహతో అయినా ఎంత కావాలో అంతే పెట్టుకోవడం అలవాటవుతుంది. రెస్టరెంట్లలో సైతం ప్లేటులో ఆహారం వదిలేస్తే జరిమానా విధించాలి. ఆహార వృథా హాస్టళ్లలోనూ ఎక్కువే అక్కడ కూడా వదిలేసిన ఆహారాన్ని లెక్కించేలా డిజిటల్ మానిటరింగ్ ట్రాకర్లని పెట్టాలి. అలాగైనా ఆహార వృథా తగ్గుతుందేమో!

# చిన్నారులను ఫుడీగా..



ఏడాది నిండుతున్న బుజ్జాయిలకు ఆహారాన్ని అందించడమనేది ప్రతి తల్లికీ ఒక సవాలే. పోషకాలతో చిన్నారుల పొట్టనెలా నింపాలని సతమతమయ్యే తల్లులకు నిపుణులు కొన్ని సూచనలిస్తున్నారు. బుజ్జాయిని ఫుడీగా ఎలా మార్చొచ్చనేదీ వివరిస్తున్నారు.

ఆహారంలో ఏదో ఒకటి కాకుండా ఆరోగ్యానిచ్చేవాటిని పిల్లలతో ఎలాగైనా తినిపించాలనే ప్రయత్నంలో చిన్నారులు అయిష్టపడుతున్నా కూడా తినిపిస్తారు కానీ ఈ పద్ధతి సరైనది కాదంటున్నారు నిపుణులు. దీనివల్ల భోజనంపై పుర్తిగా ఆసక్తి తగ్గిపోయే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. మరికొందరైతే ఆహారాన్ని మెత్తగా చేసి పిల్లలకు బలవంతంగా అందిస్తారు. ఈ విధానం కూడా తప్పే అంటున్నారు. ఇలా చేస్తే నమలడమనే ప్రక్రియ పిల్లలకు పరిచయం కాదు. మింగేస్తుంటారు కొత్తగా దంతాలొస్తున్న ఆ వయసులో చిన్నారులు వాటిని ఉపయోగించక పోవడంనఆహారంతో లాలా జలం కలవక జీర్ణసమస్య ఎదురవుతుంది. ఇలా మెత్తగా చేసిచ్చే ఆహారంలో పీచు, పోషకాలు అందక, మెరుగైన జీర్ణశక్తిని కోల్పోతారు.

**సహనంతో తినిపించాలి..** పోషకాహారంవైపు చిన్నారులను అడగు వేయించడంలో కాస్తంత సహనాన్ని పాటించాలి. అలాకాకుండా ఆసక్తిగా తింటున్నారని అదే రకమైన ఆహారాన్ని ప్రతి రోజూ అందిస్తే పిల్లలు దానివైపు కన్నెత్తికూడా చూడరు. అప్పుడు మరొక కొత్తరకాన్ని తినిపించడానికి ప్రయత్నించినా అయిష్టత ప్రదర్శిస్తారు. ఈ దశనే వైద్యులు 'నియో ఫోబియో' అంటున్నారు. కొత్త ఆహారాలపై ఉండే ఈ భయాన్ని దాటించడానికి పెద్దవాళ్లు ప్రయత్నింస్తూనే ఉండాలి. సలాడ్స్ చేసేటప్పుడు వారినీ భాగస్వాములను చేయాలి. పండ్లతో రకరకాల ఫుడ్ ఆర్ట్ నేర్పించాలి. చిన్న మొత్తంలో అందించాలి. ఇవన్నీ వాళ్లలో ఆహారంపై ఆసక్తిని పెంచుతాయి.

**రంగుల మయంగా కనిపించాలి..** ఆహారంపై ఆసక్తిని పెంచాలంటే వాళ్లెదుట ఉంచే బౌల్ లేదా ప్లేటు ఆకర్షణీయంగా ఉండాలి. భోజనం ప్లేటులో స్ట్రాబెర్రీలు, ఉడికించిన క్యారెట్ వంటివి వాళ్లకు కలర్‌ఫుల్‌గా కనిపిస్తాయి. ప్లేటుతోపాటు చుట్టూ వాతావరణం కూడా ప్రోత్సహించేలా ఉండాలి. కుటుంబసమేతంగా భోజనం చేయాలి. పిల్లలు వాళ్ల తల్లిదండ్రులను ఎక్కువగా అనుకరిస్తుంటారు. అందుకే పెద్దవాళ్ల పోషకాలున్న ఆహారానికి ప్రాధాన్యతనిస్తూ, వాటిని ఆస్వాదిస్తూ తీసుకోవాలి. వాటి రుచిని మాటల్లో చెబుతుండాలి. ఇప్పుడు చిన్నారులను తప్పక ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకునే ఫుడీగా మారుస్తాయి.

# అర్ధ నారీశ్వరుడు



అర్ధ నారీశ్వర అంటే 'భగవంతుడు, అతను సగం స్త్రీ'అని అర్థం. లయకారునిగా భావింపబడే ఈశ్వరుడిని సాధారణంగా లింగ రూపంలో పూజిస్తారు. శబ్దవ్యుత్పత్తి పరంగా శివ మరియు లింగ అనే రెండు పదాల అర్థం విశ్వం దానిలో కరిగిపోతుంది అందువలన శివుడు సమస్త సృష్టికి అంతిమ మూలం అని వేదాలుచెబుతున్నాయి. పురాణాలలో, దేవుడు విశ్వాన్ని సృష్టించి, నిలబెట్టి, లయం చేయడానికి ఉపయోగించే శక్తి లేదా శక్తిని దేవతగా చిత్రీకరించారు. ఈశ్వరుడి భార్య పార్వతి. అయితే ఈశ్వరుడు తనను తాను వ్యక్తపరచుకున్న అనేక రూపాలలో అర్ధనారీశ్వరుడు ఒకటి మరియు ముఖ్యమైనదిగా చెప్పబడుతోంది. శివుడు తన మొత్తం శరీరంలోని ఎడమ అర్ధభాగాన్ని పార్వతి దేవికి ఇచ్చాడని తద్వారా వారివురూ అన్ని విధాలుగా సమానమని సూచిస్తుంది. ఈ సిద్ధాంతాన్ని నేటి భార్యాభర్తలందరికీ ఆదర్శప్రాయం. అర్ధనారీశ్వర తత్వంపై శ్రీ అర్ధ నారీశ్వర స్తోత్రం శ్రీ ఆది శంకరాచార్యులచే రచించబడింది. ఆయన స్తోత్రంలో శివుడు మరియు పార్వతి దేవి ఇద్దరి గుణాలను వర్ణించాడు. శ్రీ అర్ధ నారీశ్వర స్తోత్రం కూడా భక్తులు దేవుడిని మరియు దేవతను పూజించడంలో ఎలాంటి వివక్షతను పాటించకూడదని సూచిస్తుంది. శ్రీ శివపురాణం ప్రకారం, శివుడు మొదట శ్రీ అర్ధ నరీశ్వర రూపంలో శ్రీ బ్రహ్మకు ముందు ప్రత్యక్షమై సృష్టి భావనను బోధించాడు. బృంగి మహర్షి కూడా శ్రీ అర్ధ నరీశ్వర రూపంలో శివుని దర్శనం చేసుకున్నాడని కొన్ని పురాణ కథనాలు వున్నాయి. అర్ధ అంటే సగం..నారి+ఈశ్వర అంటే శివ పార్వతులు.. ఇద్దరూ అంటే స్త్రీ, పురుషులిద్దరూ కలిస్తే సృష్టి ప్రారంభమవుతుందని అర్ధనారీశ్వరుని తత్వం బోధిస్తుంది.

- సి.హెచ్. ప్రతాప్.

ఆధ్యాత్మికం

# సైంధవలవణం మంచిది..



**ఉప్పు వీలైనంత తగ్గంచమని పదేపదే హెచ్చరిస్తోన్న ఆహార నిపుణులు సైంధవ లవణం చాలా మంచిదని చెబుతున్నారు. పెద్ద పెద్ద చెఫ్‌లు ఇది ఆరోగ్యకరమని, కొన్ని వంటల్లో ప్రత్యేకంగా దీన్నే ఉపయోగించమంటున్నారు. ఇంతకీ సైంధవ లవణం ఎందుకు మంచిదో, దాని వల్ల ఏమేం లాభాలున్నాయో చూద్దాం.**

పింక్‌సాల్ట్‌లో సోడియం, క్లోరైడ్, సల్ఫర్, ఐరన్, పొటాషియం,మెగ్నీసియం, మాంగనీస్, కాపర్, జింక్‌లు ఉన్నాయి. మామూలు ఉప్పు వాడటం వల్ల వచ్చే అనారోగ్యాలు దీని వల్ల రావు. సైంధవలవణాన్ని ఉపయోగించడం వల్ల ఆహారం చక్కగా జీర్ణమవుతుంది. కీళ్లనొప్పులు, మెకాళ్ల నొప్పుల నుంచి ఉపశమనం కలిగిస్తుంది. సాధారణ ఉప్పుతో పోలిస్తే ఇందులో సోడియం పరిమాణం తక్కువ. కనుక శరీరంలో సోడియం పేరుకోదు. ఇది ఒంట్లో పేరుకున్న కొవ్వును కరిగిస్తుంది. కుదుళ్లను ఆరోగ్యంగా ఉంచి, జుట్టు రాలకుండా కాపాడుతుంది. శరీరంలో చేరిన అనేక రకాల సూక్ష్మక్రిములను నశింపచేస్తుంది. ఇందులో యాంటీఆక్సిడెంట్ గుణాలున్నాయి. ఎనీమియాతో బాధ పడుతున్న వారికి ఎంతో మేలు చేస్తుంది. గృహచిట్కాల్లో ఇదిముందుంటుంది. కడుపునొప్పి, మలబద్ధకం, గుండెమంట, కడుపుబ్బరం లాంటి ఇబ్బందులను నివారిస్తుంది.

# ఉద్యోగం మారాల్సిందేనా?



**ఎంత చేసినా బూడిదలో పోసిన పన్నీరే!........** వచ్చిన ఉద్యోగం వచ్చింది. ఇక నా పనితనమేంటో చూపిస్తా.. అంటూఎంతో ఉత్సాహంగా తాము కోరుకున్న జాబ్‌లో జాయినవుతుంటారు చాలామంది. అయితే అక్కడికెళ్లి కొన్నాళ్ల పాటు ఉద్యోగం చేస్తే గానీ తెలియదు ఆ కంపెనీ పని వాతావరణం గురించి! ఈ క్రమంలో ఎంత పని చేసినా సరైన ప్రోత్సాహకాలు లేకపోవడం, కొన్ని కంపెనీల్లోనైతే పనిచేసే వారికంటే చేయని వారికే అధిక ప్రాధాన్యమిస్తూ వారికే పై అధికారుల నుంచి ప్రోత్సాహం లభించడం..వంటివి కూడా జరుగుతుంటాయి. అయితే ఇలాంటి వాతావరణం ప్రత్యక్షంగా మనం చేసే పనిపైన కూడా ప్రతికూల ప్రభావం చూపుతుంటుంది. 'ఛ..ఛ.. ఎంత పని చేసినా బూడిదలో పోసిన పన్నీరే! అన్న భావన కలిగేలా చేస్తుంది. నిజానికి ఆ ఫీలింగ్ వచ్చిందంటే అలాంటి చోట పని చేయలేమని అర్థం. అందుకే అక్కడే రోజులు గడిపేయడం కాకుండా సత్వరమే వేరే ఉద్యోగంలోకి మారిపోవమే మంచిదంటున్నారు నిపుణులు. దీనివల్ల ఆ సమయాన్ని వేరే కంపెనీలో కరీర్‌లో ఉన్నతి సాధించడానికి వినియోగించుకోవచ్చు.

**పనిభారమంతా మీదేనా ?...** చేసే ఉద్యోగమేదైనా సరే.. మనకు అప్పగించిన పనికే పరిమితం కాకుండా.. ఫలానా పనిని నేను చేయగలను అన్న ఆత్మవిశ్వాసంతో, యాక్టివ్‌గా ఆ పనిని స్వీకరించాలి. ఈ క్రమంలో మీలోని సృజనాత్మకతను చాటుకుంటే మరి మంచిది అయితే ఈ చురుకుదనం ఒక్కోసారి మన తలపై భారంగా మారే అవకాశాలూ లేకపోలేదు. ఎలాగూ ఈ అమ్మాయి యాక్టివ్‌గా పనిచేస్తుంది కదా అని కొంతమంది అధికారులు సహోద్యోగుల పనిని కూడా వారి నెత్తినేస్తుంటారు. దీనివల్ల మోయలేని భారం మీపై పడడంతో పాటు అంతిమంగా ఇది మీపై ఒత్తిడిని తీసుకొస్తుంది. తద్వారా మీరు చేసే పనిలో నాణ్యత లోపిస్తుంది. అందుకే ఇలా పని విషయంలో మీ తలకు మించిన భారం అనిపిస్తే 'నో' చెప్పడానికి ఎనకాడకూడదని చెబుతున్నారు నిపుణులు. కొలీగ్ రానప్పుడు అత్యవసరంగా చేయాల్సిన పనో, ఏవైనా అరుదైన సందర్భాల్లో అదనపు పనిని తీసుకోవడంలో తప్పులేదు. అంతేకానీ.. అదే నిత్యకృత్యం అయితే నిర్మొహమాటంగా నేనే చేయనని చెప్పడం..ఎంత చెప్పినా వినకుండా మీపై ఒత్తిడి తెస్తే మాత్రం ఆ ఉద్యోగానికి గుడ్‌బై చెప్పడమే మంచిదని చెబుతున్నారు నిపుణులు. సహోద్యోగులపై చేసే చెడు ప్రచారాలు, పనిచేసే చోట లైంగిక వేధింపులు సెలవు తీసుకున్నా పనిచేయాల్సి రావడం, పై అధికారుల ప్రోత్సాహం కరువవడం.. వంటివి కూడా అటు పని వాతావరణాన్ని, ఇటు ఉద్యోగుల కెరీర్ ఉన్నతిని దెబ్బతీస్తాయి. అందుకే ఇలాంటి విషపూరిత వాతావరణానికి టాటా చెప్పి.. కొంచెం లేటైనా సరే సౌకర్యవంతంగా, అభివృద్ధి ఉన్న చోటికి రెక్కలు కట్టుకొని వాలిపోవడమే అన్ని విధాలా శ్రేయస్కరమని చెబుతున్నారు నిపుణులు.

నచ్చిన చోట, ఉన్నతి లేని చోట పనిచేయడం కంటే ప్రత్యామ్నాయం వెతుక్కొని కెరీర్‌లో అభివృద్ధిని సాధించడం ఇటు వ్యక్తిగతంగా, అటు వృత్తిపరంగా మంచిదంటున్నారు. మరి, ఇంతకీ పని వాతావరణాన్ని నెగటివ్‌గా ప్రభావితం చేసే కొన్ని అంశాలేంటో తెలుసుకుందాం..

**మిమ్మల్ని దూరం పెడుతున్నారా? ....** ఒక బృందం ప్రాజెక్ట్ మీద పని చేస్తోందంటే దానికి సంబంధించిన ప్రతి విషయం, ప్రతి అప్‌డేట్ ఆ గ్రూప్‌లో ఉన్న అందరికీ తెలిస్తేనే కలిసికట్టుగా ముందుకెళ్లగలం.. అనుకున్న సమయానికి చక్కటి అవుట్‌పుట్‌ని కంపెనీకి సమర్పించవచ్చు. అయితే బాగా పనిచేసే వాళ్లపై ఇతర కొలీగ్స్‌కి ఉండే అసూయ, సహోద్యోగుల మధ్య కమ్యూనికేషన్ లోపం, గ్రూపిజం.. వంటి అంశాలు పని వాతావరణాన్ని దెబ్బతీస్తుంటాయి. ఇలాంటి చోట మీరు పని చేస్తున్నా, చక్కటి నైపుణ్యాలను ప్రదర్శిస్తున్నా మిమ్మల్ని వేరు చేసి చూడడం, పనికి సంబంధించి మీకు ఎలాంటి అప్‌డేట్ చెప్పకపోవడం..వంటి అంశాలు మీ వ్యక్తిగత పనితీరుపై ప్రతికూల ప్రభావం చూపుతాయి. ఇది క్రమంగా మీ మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. అంటే అంతిమంగా మీ కెరీర్ ఉన్నతికి గండి పడ్డటే! కాబట్టి ఇలాంటి వాతావరణంలో పనిచేస్తున్నప్పుడు మీ వెనక జరిగే గ్రూపిజం, ఆఫీస్ రాజకీయాల గురించి మీ తీరు గురించి ముందుగా పై అధికారులకు తెలియజెప్పే ప్రయత్నం చేయండి. అయిన లాభం లేదనుకుంటే అందులోనే వేరే విభాగానికి మారడం లేదంటే వేరే ఉద్యోగం వెతుకోనకవడం వల్ల కెరీర్ ముందుకెళ్లచ్చు.



## రెండోసారి క్వీన్స్ రాజుగా అల్కరాజ్

### లెహెక్కాను ఓడించి 21వ టైటిల్ కైవసం

**న్యూఢిల్లీ:** స్పానిష్ యువ టెన్నిస్ స్టార్ కార్లోస్ అల్కరాజ్ ఈ ఏడాది తన హాట్ రన్‌ను కొనసాగించి ఛాంపియన్‌గా నిలిచాడు. క్వీన్స్ క్లబ్ ఛాంపియన్‌షిప్ ఫైనల్లో ప్రపంచ నెంబర్ 2 ఆటగాడు జిరి లెహెక్కాను ఓడించి, ఈ సీజన్‌లో తన ఐదవ టైటిల్‌ను అల్కరాజ్ కైవసం చేసుకున్నాడు. పశ్చిమ లండన్‌లో రెండు గంటల 10 నిముషాల్లో అల్కరాజ్ 33 విన్నర్లు, 18 ఏస్‌లు కొట్టి చెక్ ప్రపంచ 30వ ర్యాంక్ క్రీడాకారుడిని ఓడించాడు. 22 ఏళ్ల స్పానియార్డ్ 7-5, 6-7 (5), 6-2 తేడాతో విజయం సాధించి, క్వీన్స్ క్లబ్‌లో తన 21వ టూర్ లెవల్ టైటిల్‌ను సాధించాడు. 2 గంటల 8 నిముషాల్లో అల్కరాజ్ తన విజయాన్ని సాధించాడు. నోవాక్ జోకోవిచ్ (8), మాటియో బెరెట్టిని (4), టేలర్ ఫ్రిట్జ్ (4), నికోలస్ మహుత్ (4) తర్వాత నాలుగు లేదా అంతకంటే ఎక్కువ గ్రాస్-కోర్ట్ టైటిళ్లను సాధించిన క్రియాశీల ఆటగాళ్లలో ఐదవ వ్యక్తిగా నమోదయ్యాడు.

రెండు సార్లు డిఫెండింగ్ వింబుల్డన్ ఛాంపియన్ అయిన ఈ టోర్నమెంట్‌లో 18 మ్యాచ్‌ల విజయాల పరంపరతో ఇది అల్కరాజ్‌కు పెద్ద విజయం కావడం విశేషం. మయామిలో జరిగిన ఎటిపి మాస్టర్స్ 1000లో డేవిడ్ గోఫిన్ చేతిలో తొలి రౌండ్ ఓటమి తర్వాత, అల్కరాజ్ ఈ పోటీల్లో తనను తాను తిరిగి నిరూపించుకున్నాడు. అప్పటి నుండి 27-1 రికార్డును, మోంటో కార్లో, రోమ్, ఫ్రెంచ్ ఓపెన్, క్వీన్స్ క్లబ్‌లలో టైటిల్ విజయాలను సాధించాడు. ఎటిపి లైవ్ రేస్ టు టురిన్‌లో రెండవ స్థానంలో ఉన్న జానిక్ సిన్నర్‌పై అల్కరాజ్ తన ఆధిక్యాన్ని 2240 పాయింట్లకు పెంచుకున్నాడు.

## అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో భారత్‌కు పతకాల వెల్లువ

### బంగారు, కాంస్య, రజతాలతో మెరిసిన అథ్లెట్లు





**న్యూఢిల్లీ:** జాతీయ అండర్ 20 అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో భారత్‌కు పతకాలు వెల్లువెత్తాయి. ఈ టోర్నమెంట్‌లోని వివిధ విభాగాల్లో భారత్ అథ్లెట్స్ రాణించి గతంలో నమోదైన రికార్డులను బద్దలు కొట్టారు. ఉత్తరప్రదేశ్‌లో 23వ జాతీయ జూనియర్ (అండర్ 20) ఫెడరేషన్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో సుదూర రన్నర్లు మరియు స్ప్రింటర్ల వేగం, స్టామినా మరియు రికార్డు బద్దలు కొట్టే విన్యాసాలతో అద్భుతమైన ప్రదర్శనలు ఇచ్చారు. పురుషుల 3000 మీటర్ల ఈవెంట్‌లో 8 మంది పురుష అథ్లెట్లు మునుపటి మీట్ రికార్డును అధిగమించారు. 2021లో పంజాబ్‌లోని సంగ్రూర్‌లో అజయ్ నెలకొల్పిన 8:26.72 పాత రికార్డును మధ్యప్రదేశ్‌కు చెందిన వినోద్ సింగ్ 8:14.22 సమయంతో బంగారు పతకం సాధించడంతో వెనుకబడిపోయారు. గుజరాత్‌కు చెందిన వివేక్ చంద్ (8:14.81) మరియు ఛత్తీస్‌గఢ్‌కు చెందిన రాహుల్ కుమార్ (8:15.25) అతని తర్వాతి స్థానాల్లో నిలిచారు. మరో రికార్డు సృష్టించిన ప్రదర్శనలో, తమిళనాడుకు చెందిన కవిన్‌రాజా ఎస్ పురుషుల పోల్ వాల్ట్‌లో 5.11 మీటర్లు సాధించి, 2024లో కుల్దీప్ కుమార్ నెలకొల్పిన 5.10 మీటర్ల మార్కును తృటిలో మెరుగుపరుచుకుని బంగారు పతకాన్ని సాధించాడు. అలాగే పురుషుల 100 మీటర్ల స్ప్రింట్‌లో హర్యానాకు చెందిన హిమాన్షు 10.49 సెకన్లలో గమ్యాన్ని చేరుకుని స్వర్ణం సాధించాడు, 2018మీట్ రికార్డు అయిన గురిందర్‌వీర్ సింగ్ 10.47 సెకన్లలో తృటిలో అధిగమించాడు. మధ్యప్రదేశ్‌కు చెందిన అభయ్ సింగ్ (10.50 సెకన్లు) మరియు తమిళనాడుకు చెందిన వరుణ్ ఊరి (10.54 సెకన్లు) వరుసగా రజత, కాంస్య పతకాలను గెలుచుకున్నారు. మహిళల్లో, ఉత్తరప్రదేశ్‌కు చెందిన నిపమ్ 100 మీటర్ల పరుగులో 11.86 సెకన్ల సమయంతో ఆధిపత్యం చెలాయించింది, పశ్చిమ బెంగాల్‌కు చెందిన అర్చితా బెనర్జీ (11.90సె) మరియు ఢిల్లీకి చెందిన సంజన (12.01సె) వెనుకబడి ఉన్నారు. మహిళల 3000 మీటర్ల ఫైనల్లో, హర్యానాకు చెందిన సంజనసింగ్ 9:51.77సమయంలో గమ్యస్థానంలో నిలిచి, గుజరాత్‌కుచెందిన శిల్పాదిహోరా (9:53.19) మరియు ఉత్తరప్రదేశ్‌కు చెందిన అన్షు (9:53.44)లను తృటిలో ఓడించి అగ్రస్థానాన్ని దక్కించుకుంది. ఫీల్డ్ ఈవెంట్లలో, హర్యానాకు చెందిన అనిషా మహిళల డిస్కస్‌త్రోలో ఆకట్టుకుంది, డిస్క్‌ను 49.62 మీటర్ల దూరం విసిరి స్వర్ణం గెలుచుకుంది, ఆ తర్వాత సహచరురాలు రిద్ధి (47.68 మీ) మరియు విదివీని పాటియాలా నుండి సుప్రియా అత్రి (44.74 మీ) ఉన్నారు.

## సీషెల్స్ బాక్సింగ్ టోర్నీలో.. ఫైనల్స్‌కు ఏడుగురు భారత్ బాక్సర్లు

**న్యూఢిల్లీ:** సీషెల్స్ బాక్సింగ్ టోర్నమెంట్-2025లో ఏడుగురు భారత బాక్సర్లు ఫైనల్స్‌కు చేరుకున్నారు. వీరిలో ఆదిత్య (65 కిలోలు), నీరజ్ (75 కిలోలు), హిమాన్షు (50 కిలోలు), ఆశిష్ (55 కిలోలు), అన్మోల్ (60 కిలోలు), కార్తీక్ దలాల్ (70 కిలోలు) మరియు గౌరవ్ (90+ కిలోలు) స్వర్ణ పతాకాలకు చేరువలో ఉన్నారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఆదిత్య ప్రతాప్ (65 కిలోలు) మూడో రౌండ్‌లో హోమ్ ఫేవరెట్ జోవానీ బౌజిన్‌పై ఆర్ఎస్‌సి (రిఫరీ స్టాప్స్ కాంటెస్ట్) విజయంతో ఆకట్టుకున్నాడు. ప్రతాప్ కజకిస్తాన్‌లో జరిగిన ఎలోర్డా కప్‌లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించాడు. అలాగే 75 కిలోల విభాగంలో, నీరజ్ తన ప్రత్యర్థిపై ఆర్ఎస్‌సి రెండవ రౌండ్ విజయంతో ఆ ప్రయత్నానికి అద్దం పట్టాడు. నీరజ్ నేషనల్ కంబైన్డ్ ఫైనల్స్ రజత పతక విజేత కూడా. 50 కిలోల విభాగంలో, మాజీ బెల్‌గ్రేడ్ బాక్సింగ్ ఛాంపియన్ మరియు 6వ ఎలైట్ నేషనల్స్‌లో కాంస్య పతక విజేత అయిన హర్యానాకు చెందిన హిమాన్షు శర్మ, మారిషస్‌కు చెందిన మాథ్యూ సూప్రయెన్‌పై 4:1 తేడాతో ఆత్మవిశ్వాసంతో విజయం సాధించాడు. 55 కిలోల బౌట్‌లో, ప్రస్తుత జాతీయ కంబైన్డ్ ఛాంపియన్ ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఆశిష్ ముద్దానియా, మారిషస్‌కు చెందిన గుయిలామ్ ఫ్రాన్సిస్‌పై 4:1 తేడాతో ఘన విజయం సాధించాడు. హర్యానాకు చెందిన అన్మోల్ (60 కిలోలు), సీషెల్స్‌కు చెందిన డారియో గబెరియల్‌పై 4:1 స్ప్లిట్ డెసిషన్ విజయాన్ని సాధించాడు.



## మహిళల ఆసియా కప్ క్వాలిఫయర్స్‌లో.. భారత్ రికార్డు

### రాణించిన తెలంగాణ అమ్మాయి సౌమ్య

### 13-0 తేడాతో మంగోలియా ఓటమి

**న్యూఢిల్లీ:** ఎఫ్‌సి మహిళల ఆసియా కప్-2026 క్వాలిఫయర్స్ మ్యాచ్‌లో మంగోలియాను ఓడించి భారత్ రికార్డు విజయం సాధించింది. భారత్ తరపున ఆడిన తెలంగాణలోని నిజామాబాద్ జిల్లాకు చెందిన గగులోత్ సౌమ్య ఈ మ్యాచ్‌లో రాణించింది. చియాంగ్ మాయి స్టేడియంలో సోమవారం జరిగిన క్వాలిఫయర్స్‌లో భారత్ మహిళల ఫుట్‌బాల్ జట్టు మంగోలియాపై 13-0 తేడాతో విజయం సాధించింది. ప్యారీ క్సాక్సా ఐదుసార్లు నెగ్గగా, సౌమ్య, ప్రియదర్శిని సెల్లాదురై చెరో రెండు రెట్లు సాధించి కీలకమయ్యారు. సంగీత బస్‌ఫోర్, రింప హల్దార్, మాళవిక మరియు గ్రేస్ డాంగ్‌మీలు ఒక్కొక్కరు ఒక్కో గోల్ చేసి ఆధిక్యాన్ని నిలిపారు. సౌమ్యఇచ్చిన క్లోజ్‌రేంజ్ క్రాస్‌ను బాస్ఫోర్ ద్వారా స్కోరింగ్‌ను ప్రారంభించడంతో, మ్యాచ్ ప్రారంభం నుంచే భారత్ ఆధిపత్యం చెలాయించింది. ఆ తర్వాత రింపా క్రాస్‌ను శక్తివంతమైన వాలీతో సౌమ్య భారత్ ఆధిక్యాన్ని రెట్టింపు చేసింది. హాఫ్ టైమ్‌కు ముందే ప్యారీ రెండు రెట్లు ఎక్కువ గోల్స్ చేసింది, మొదట సౌమ్య చేసిన కట్‌బ్యాక్ ద్వారా, తరువాత టాప్ కార్నర్ లోకి శక్తివంతమైన లాంగ్‌రేంజ్ షాట్‌ద్వారా బ్లూ టైగ్రెస్‌లు తొలి అర్ధభాగంలో వేగంగా ఆడితే, రెండో అర్ధ భాగంలో వారు మరింత వేగంగా ఆడారు. ప్యారీ గ్రేస్ క్రాస్ ద్వారా తన హ్యాట్రిక్‌ను పూర్తి చేసుకుంది. 55వ నిమిషం నాటికి భారత స్ట్రైకర్ మరో రెండు గోల్స్ జోడించడంతో, మ్యాచ్‌లో ఆమె మొత్తం గోల్స్ ఐదుకు చేరుకుంది. గోల్ కీపింగ్ తప్పిదాన్నే సౌమ్య సద్వినియోగం చేసుకుని భారత్ తరఫున ఎనిమిదో గోల్ చేసిన తర్వాత, రింపా, మాళవిక, ప్రియదర్శిని వరుసగా ఒక్కో గోల్‌చేసి భారత్ స్కోరును రెండంకెలకుచేర్చారు. గ్రేస్‌డాంగ్మీ పెనాల్టీతో భారత్ 12గోల్స్ సాధించింది. మ్యాచ్ ముగిసే సమయానికి, ప్రియదర్శిని తన రెండవ మరియు భారత్ 13వ గోల్స్‌సాధించి బ్లూ టైగ్రెస్‌కు ఘన విజయాన్ని అందించింది.

## హాకీ ప్రో లీగ్‌లో.. భారత్ థ్రిల్లింగ్ విక్టరీ

### 4-3 తేడాతో బెల్జియం ఓటమి



**న్యూఢిల్లీ:** ఇంటర్నేషనల్ హాకీఫెడరేషన్ (ఎఫ్ఐహెచ్) ప్రో లీగ్-2024-25 సీజన్‌లోని చివరి మ్యాచ్‌లో భారత్ పురుషుల హాకీ జట్టు థ్రిల్లింగ్ విక్టరీని సాధించింది. భారత్ పురుషుల హాకీ జట్టు తమ చివరి మ్యాచ్‌లో బెల్జియంను 4-3 తేడాతో ఓడించి ఉత్సాహభరితమైన పునరాగమనాన్ని కనబరిచింది, సుఖ్జీత్ సింగ్ (21వ నిముషం, 35వ నిముషం), అమిత్ రోహిదాస్ (36వ నిముషం), మరియు హార్మన్‌ప్రీత్ సింగ్ (59వ నిముషం) గోల్స్ చేయడం ద్వారా భారతదేశం విజయం సాధించింది. బెల్జియం తరపున ఆర్థర్ డి స్లూవర్ (8వ నిముషం), థిబ్యూ స్టాక్‌బ్రోక్స్ (34వ నిముషం) మరియు హ్యూగో లాబౌచెరే (41వ నిముషం) గోల్స్ చేశారు. ఆంట్వెర్ప్‌లో బుధవారం జరిగిన హాకీ ప్రో లీగ్‌లో ఇప్పటి వరకూ వరుస పరాజయాలతో ఘోరంగా విఫలమైన భారత్ జట్టు చివరి మ్యాచ్‌లో చెత్త ముగింపును తప్పించింది, బెల్జియం 8వ నిమిషంలో ఆర్థర్ డి స్లూవర్ గోల్ చేయడంతో బలంగా ప్రారంభమైంది. భారత్ రెండవ క్వార్టర్‌లో సుఖ్జీత్ సింగ్ ప్రతిస్పందించించాడు. అతను 21వ నిమిషంలో గోల్ చేసి స్కోరును సమం చేశాడు. రెండవ అర్ధభాగంలో ఎండ్ టు ఎండ్ యాక్షన్ కనిపించింది. బెల్జియం 34వ నిమిషంలో థిబ్యూ స్టాక్‌బ్రోక్స్ ద్వారా ఆధిక్యాన్ని తిరిగి పొందింది. కానీ భారత్ నుండి ఆ వెనువెంటనే బెల్జియంకు ఎదురుదెబ్బ తగిలింది. ఒక నిమిషం తర్వాత సుఖ్‌జీత్ మళ్లీ గోల్ చేశాడు. మళ్లీ 36వ నిముషం అర్ధభాగంలో అమిత్ రోహిదాస్ పెనాల్టీ కార్నర్‌లో గోల్ చేసి స్కోరును 3-2కి పెంచాడు. అయినప్పటికీ బెల్జియం ఆట పూర్తి చేయలేదు. యువ ఆటగాడు హ్యూగో లాబౌచెర్ పెనాల్టీ కార్నర్ ద్వారా తన తొలి అంతర్జాతీయ గోల్ సాధించడం ద్వారా వారు 41వ నిముషంలో స్కోరును సమం చేశారు. 59వ నిమిషంలో చివరి మలుపు తిరిగింది, అయితే భారత్‌కు పెనాల్టీ స్ట్రోక్ ఇవ్వబడింది. కెప్టెన్ హార్మన్‌ప్రీత్ సింగ్ ముందుకు వచ్చి గోల్‌గా మలచడంతో 4-3 తేడాతో భారత్ హాకీ జట్టు నాటకీయ విజయాన్ని సాధించింది. కాగా ఈ విజయంతో పాయింట్ల పట్టికలో ఎనిమిదో స్థానంలో ముగించింది. ఐర్లాండ్ కంటే 14 పాయింట్లు ఆధిక్యంలో ఉంది.

## 1.5 బిలియన్ డాలర్లకు ఫోన్‌పే ఐపిఒ

### ఆగస్టులో డిఆర్‌హెచ్‌పి దాఖలుకు కసరత్తు


**ముంబై, జూన్ 23:** దేశంలోని అగ్రగామి డిజిటల్ చెల్లింపుల సంస్థ ఐపిఒకు వస్తోంది. వాల్‌మార్ట్ అనుబంధంగా ఉన్న ఈ సంస్థ ఐపిఒద్వారా 1.5బిలియన్ డాలర్లు సమీకరించాలని నిర్ణయించింది. ఈ ఐపిఒకోసం బ్యాంకర్లు సంస్థ విలువలను 15 బిలియన్ డాలర్లుగా అంచనా వేసారు. ఈ ఫిన్‌టెక్‌సంస్థ సెబీకి డిఆర్‌హెచ్‌పిని ఆగస్టులో దాఖలు చేయాలని నిర్ణయించింది.



ఇప్పటికే చర్చలు జరుగుతున్నాయి. ఐపిఒను నిర్వహించేందుకు పర్యవేక్షణ చేసేందుకుగాను ఈ సంస్థను అన్ని టాప్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్స్‌లో లిస్టింగ్‌చేసింది. వాటిలో కోటక్ మహీంద్ర కేపిటల్, జెపిమోర్గాన్‌ఛేజ్, సిటీగ్రూప్, మోర్గాన్ స్టేన్లీ సంస్థలు కూడా ఉన్నాయి. 2015లో స్థాపించిన ఫోన్‌పే రానురాను భారత్‌లో యుపిఐ వ్యవస్థల్లో అగ్రగామిగా నిలిచింది. సుమారు 610 మిలియన్ల మంది రిజిస్టరయిన కస్టమర్లు ఉన్నారు. రోజువారి లావాదేవీలే సుమారు 34కోట్ల డాలర్లవరకూ ఉన్నాయి. రిబ్బిట్ క్యాపిటల్, టైగర్ గ్లోబల్ మేనేజ్‌మెంట్, టివిఎస్ కేపిటల్ ఫండ్స్‌ల నుంచి గత ఏడాది ఈ కంపెనీ 100 మిలియన్ డాలర్లను పెట్టుబడులుగా సేకరించింది. ఆటైమ్‌లో కంపెనీ విలువలు 12 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ఫోన్‌పే సుమారు 12.56 లక్షలకోట్ల లావాదేవీలను నిర్వహించినట్లు యుపిఐ గణాంకాలే చెపుతున్నాయి. గూగుల్‌పే ఆ తర్వాత 8.85లక్షల కోట్లు లావాదేవీలు చేస్తే పేటిఎం 1.27 బిలియన్ లావాదేవీలు నిర్వహించింది. దీనితో ఫోన్‌పే, గూగుల్‌పేలు 80శాతం యుపిఐ లావాదేవీలు నిర్వహిస్తున్నట్లు తేలింది. 2022లో భారత్‌లోనే రిజిస్టరు చేసుకుంది. ఈనెలలోనే స్టాండర్డ్ ఛార్టర్డ్ బ్యాంకు మాజీ సీఈఓ జరిన్ దారువాలాను బోర్డులోకి తీసుకుంది. ఐపిఒ విజయవంతం అయితే భారత్ ఫిన్‌టెక్ కంపెనీల్లో ఫోన్‌పే ఐపిఒ సూపర్‌సక్సెస్ అయిన సంస్థగా నిలుస్తుంది.

## స్టాక్ సూచీలపై వార్ ఎఫెక్ట్

**ముంబై, జూన్ 23:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మరోసారి అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. ఇజ్రాయెల్ ఇరాన్ మధ్య పోరులో అమెరికా జోక్యం చేసుకోవడంతో పాటు అక్కడి అణు కేంద్రాలే లక్ష్యంగా దాడులు నిర్వహించడంతో ప్రపంచ మార్కెట్లతో పాటు మన మార్కెట్లూ అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి. చమురు ధరలకు రెక్కలు రావడంతో ద్రవ్యోల్బణం మళ్లీ పెరుగుతుందన్న భయాలు కూడా ఇందుకు తోడయ్యాయి. ఐటీ షేర్లు ప్రధానంగా నష్టపోగా.. నిఫ్టీ స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ సూచీలు మాత్రం భౌగోళిక ఉద్రిక్తతలను తట్టుకుని నిలబడడం విశేషం. ఇంట్రాడేలో భారీ నష్టాలు చవిచూసిన సూచీలు.. ఆఖర్లో కాస్త కోలుకున్నాయి. ఓ దశలో 900



పాయింట్లకు పైగా నష్టపోయిన సెన్సెక్స్ చివరికి 500 పాయింట్ల నష్టంతో గట్టెక్కింది. నిఫ్టీ మళ్లీ 25 వేల దిగువన ముగిసింది. సెన్సెక్స్ ఉదయం 81,704.07 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 82,408.17) భారీ నష్టాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 81,476.76 వద్ద కనిష్ఠాన్ని తాకింది. రోజంతా నష్టాల్లో కొనసాగిన సూచీ.. మధ్యాహ్నం తర్వాత కాస్త కోలుకుంది. చివరికి 511.38 పాయింట్ల నష్టంతో 81,896.79 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 140.50 పాయింట్ల నష్టంతో 24,971.90 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 86.76గా ఉంది. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఇన్ఫోసిస్, ఎల్అండ్‌టీ, మహీంద్రా అండ్ మహీంద్రా, హిందుస్థాన్ యూనిలీవర్ ప్రధానంగా నష్టపోయాయి. ట్రెంట్, బీఈఎల్ బజాజ్ ఫైనాన్స్, కోటక్ మహీంద్రా బ్యాంక్, బజాజ్ ఫిన్‌సర్వ్ షేర్లు రాణించాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 77.35 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 3,381 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## కొత్తగా ఇపిఎఫ్‌ఒ చందాదారులు 8.49 లక్షల మంది



**న్యూఢిల్లీ, జూన్ 23:** ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ పరిధి లోకి ఏప్రిల్ నెలలో 19.14 లక్షల మంది చేరారు. ఈ యేడాది మార్చి నెలలో చేరికతో పోలిస్తే 31శాతం, 2024 ఏప్రిల్ నెల గణాంకాలతో పోలిస్తే ఒకశాతం వృద్ధి నమోదైంది. ఈ వివరాలను కేంద్ర కార్మిక శాఖ విడుదల చేసింది. ఏప్రిల్‌లో కొత్త సభ్యుల చేరిక 8.49 లక్షలుగా ఉంది. మార్చి నెలలో కొత్త సభ్యుల చేరిక కంటే 12.39 శాతం ఎక్కువ. అంటే వీరు మొదటిసారి సంఘటిత రంగంలో ఉపాధి పొందినట్లు తెలుస్తోంది. ఇందులో మహిళా సభ్యులు అధికంగా 3.95 లక్షలుగా ఉంది. ఏప్రిల్‌లో సుమారుగా 15.77 లక్షల మందిసభ్యులు ఒక సంస్థలో ఉద్యోగం మానేసి, మరో సంస్థలో చేరారు. మార్చి నెలతో పోలిస్తే 19శాతం పెరిగింది. నికర చేరికలో అత్యధికంగా 21శాతం సభ్యులు మహారాష్ట్ర నుంచి ఉన్నారు. 2.45 లక్షల మంది ఉన్నారు. మార్చి నెలతో పోలిస్తే 17.63శాతం పెరిగారు. కొత్తసభ్యుల్లో 57శాతం మేర అంటే 4.89 లక్షల మంది వయసు 18-25 యేళ్ల మధ్య ఉంది. మహిళా సభ్యుల నికర చేరిక మాత్రం మార్చి నెలతో పోలిస్తే 35శాతం

## పెరగనున్న సిలిండర్ల ధరలు!

**ముంబై, జూన్ 23:** ఇరాన్ - ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న యుద్ధం ప్రభావాన్ని మీ వంటగదిపై పడవచ్చు. రాబోయే కాలంలో దేశంలో ఎల్‌పిజిసిలిండర్ల ధరలు పెరగవచ్చు. మధ్యప్రాచ్యంలో పెరుగుతున్న ఉద్రిక్తత ప్రభావం సిలిండర్ల ధరలపై చూడవచ్చు. ఎందుకంటే దేశంలోని ప్రతి 3 ఎల్‌పీజీ సిలిండర్లలో 2 పశ్చిమాసియా నుండి వస్తాయి. ఇటి నివేదిక ప్రకారం.. ఇరాన్ అణు కేంద్రాలపై అమెరికా దాడులు ప్రపంచంలోనే అతిపెద్ద చమురు ఉత్పత్తి ప్రాంతమైన పశ్చిమాసియా నుండి సరఫరా అంతరాయాల భయాలను పెంచాయి. గత 10 సంవత్సరాలలో భారతదేశంలో ఎల్‌పిజి వినియోగం రెండింతలు పెరిగింది. ఇప్పుడు ఎల్‌పిజి 33 కోట్ల ఇళ్లకు చేరుకుంటోంది. దాదాపు 66శాతం ఎల్‌పిజి విదేశాల నుండి వస్తుంది. దానిలో 95శాతం సౌదీ అరేబియా, యుఎఇ, ఖతార్ వంటి పశ్చిమాసియా దేశాల నుండి వస్తుంది. అయితే పెట్రోల్, డీజిల్ విషయంలో భారతదేశం స్థానం చాలా మెరుగ్గా ఉంది. భారతదేశం రెండింటినీ నికర ఎగుమతిదారు, అంటే, పెట్రోల్‌లో 40శాతం, మనం ఉత్పత్తి చేసే డీజిల్‌లో 30శాతం ఎగుమతి అవుతాయి. అవసరమైతే, ఈ ఎగుమతి పరిమాణాన్ని దేశీయ మార్కెట్‌కు మళ్లించవచ్చు. శుద్ధి కర్మాగారాలు, పైపులైన్‌లు, నౌకలు, నేషనల్ స్ట్రాటజిక్ పెట్రోలియం రిజర్వ్ (ఎస్‌పిఆర్)లో ముడి చమురు కోసం 25 రోజుల నిల్వ ఉంది. మీరు ఇప్పుడు ఆర్డర్ చేసినా, డెలివరీ వచ్చే నెల లేదా తరువాత వస్తుందని ఒక ఎగ్జిక్యూటివ్‌చెప్పినట్లు ఇటి పేర్కొంది. అదనపు నిల్వ కోసం మా వద్ద తక్కువ సామర్థ్యం కూడా ఉంది. అంతరాయం కలిగించే ప్రమాదం తక్కువగా ఉన్నప్పుడు, ఎక్కువ కొనుగోలు చేసి డబ్బు పెట్టుబడి పెట్టడంలో అర్థం లేదు. జాగ్రత్తగా ఉండటం, దేశీయ వినియోగదారులను రక్షించడం ముఖ్యమన్నారు. చమురు ధరల పెరుగుదల స్వల్పకాలంలో శుద్ధి కర్మాగారాల మార్జిన్లపై ప్రభావం చూపవచ్చు. కానీ పెట్రోల్, డీజిల్ రిటైల్ ధరలు మారే అవకాశం లేదు. ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ కంపెనీలు గత 3 సంవత్సరాలుగా పంపు ధరలను స్థిరంగా ఉంచుతున్నాయి. అలాగే ప్రపంచ మార్కెట్లో హెచ్చుతగ్గులు ఉన్నప్పటికీ అలాగే కొనసాగుతాయి.



## గుజరాత్‌లో తొలి గ్రీన్ హైడ్రోజన్ యూనిట్: అదానీ గ్రూప్

**న్యూఢిల్లీ, జూన్ 23:** గ్రీన్ హైడ్రోజన్ మిషన్‌లో కీలక ముందడుగు పడింది. ప్రముఖ వ్యాపారవేత్త గౌతమ్ అదానీకి చెందిన అదానీ గ్రూప్ భారత్ లోనే తొలి ఆఫ్‌గ్రిడ్ 5 మెగా వాట్ గ్రీన్ హైడ్రోజన్ పైలట్ ప్లాంట్‌ను గుజరాత్‌లోని కచ్‌లో ప్రారంభించింది. ఈమేరకు కంపెనీ సోమవారం ఓ ప్రకటన విడుదల చేసింది. సోలార్, విండ్ వంటి పునరుత్పాదక వనరులను ఉపయోగించుకొని నీటిని ఎలక్ట్రోలైసిస్ ప్రక్రియ ద్వారా విభజించి హైడ్రోజన్ ఉత్పత్తి చేయడం ఈ ప్లాంట్ ముఖ్య ఉద్దేశం. సొంత పునరుత్పాదక కేంద్రాలను అదానీ గ్రూప్ వినియోగించుకుంది. హైడ్రోజన్ వాయువు విశ్వంలో అత్యంత తేలికైనది, స్వచ్ఛమైనది. ఇది మండినప్పుడు కేవలం నీటి ఆవిరిని ఉత్పత్తి చేస్తుంది. దేశీయ అవసరాలకు దిగుమతులపై ఆధారపడడం తగ్గించుకోవడంలో భాగంగా నేషనల్ గ్రీన్ హైడ్రోజన్ మిషన్‌ను కేంద్రం ప్రారంభించింది. ఈ నేపథ్యంలో అదానీ ఎంటర్‌ప్రైజెస్ అనుబంధ అదానీ న్యూ ఇండస్ట్రీస్ లిమిటెడ్ 5 మెగావాట్ ప్లాంట్‌ను నెలకొల్పింది. దేశ గ్రీన్ హైడ్రో జన్ మిషన్‌లో దీన్నో కీలక ముందడుగుగా అదానీ గ్రూప్ అభివర్ణించింది. గ్రీన్ హైడ్రో జన్ ఉత్పత్తిలో హబ్‌గా నిలవాలన్న భారత సంకల్పానికి అదానీ గ్రూప్ తన వంతు తోడ్పాటు అందిస్తోందని పేర్కొంది. గుజరాత్ లోని ముంద్రాలో గ్రీన్ హైడ్రోజన్ హబ్‌ను కూడా అదానీ గ్రూప్ ఏర్పాటు చేస్తోంది.



## వాణిజ్యం

### ఆల్‌టైమ్ కనిష్టానికి ఓలా ఎలక్ట్రిక్ షేర్లు

**ముంబై, జూన్ 23:** ప్రముఖ విద్యుత్తు ద్విచక్ర వాహన తయారీ సంస్థ ఓలా ఎలక్ట్రిక్ షేర్లు ఆల్‌టైమ్ కనిష్ఠాన్ని తాకాయి. బ్లాక్‌డీల్ కారణంగా సోమవారం పెద్ద మొత్తంలో కంపెనీ షేర్లు చేతులు మారిన నేపథ్యంలో వాటి విలువ పతనమైంది. కంపెనీలో 0.8శాతం వాటాకు సమానమైన 44 లక్షల షేర్లు రూ.44.1 వద్ద చేతులు మారాయి. దీంతో ఈ ఉదయం బీఎస్ఈలో కంపెనీ షేరు విలువ 6 శాతం మేర పతనమై రూ.43.20 వద్ద కనిష్ఠాన్ని తాకాయి. బ్లాక్ డీల్ ద్వారా ఎవరు విక్రయించారు? ఎవరు కొనుగోలు చేశారనే వివరాలు మాత్రం తెలియరాలేదు. మధ్యాహ్నం 12.50 గంటల సమయానికి ఓలా ఎలక్ట్రిక్ షేర్లు 4.76 శాతం నష్టంతో 43.86 వద్ద ట్రేడవుతున్నాయి. 2017లో స్థాపితమైన ఓలా



ఎలక్ట్రిక్ 2024 ఆగస్టు 9న స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్ట్ అయ్యింది. అప్పట్లో రూ.76 ఐపీఓ ధర కాగా.. రూ.91.20 వద్ద ప్రీమియంతో దలాల్ స్ట్రీట్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. అయితే, వినియోగదారుల నుంచి ఫిర్యాదులు, మరోవైపు నియంత్రణ సంస్థల దర్యాప్తు, ఇంకోవైపు సంప్రదాయ ఆటోమొబైల్ సంస్థలైన బజాజ్, టీవీఎస్ నుంచి గట్టి పోటీ కారణంగా మార్కెట్ వాటా క్షీణించడం వంటి కారణాలతో షేరు విలువ పడుతూ వస్తోంది. గత 12 నెలల్లో షేరు విలువ 51 శాతం మేర క్షీణించింది. గత ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలోనూ రూ.870 కోట్ల నికర నష్టాన్ని ప్రకటించింది. అంతకు ముందు ఏడాదితో పోలిస్తే నష్టం రెట్టింపుకావడం గమనార్హం. ఈనేపథ్యంలో బ్లాక్‌డీల్ జరగడంతో కంపెనీ షేర్లు ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. ఇదే నెలలో నెలలో హ్యుందాయ్ మోటార్ కంపెనీ రూ.51.40 వద్ద 3.23 శాతం వాటాకు సమానమైన 14.22 కోట్ల షేర్లను విక్రయించడం గమనార్హం.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.